సోమవారం
1•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 6
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

పకడ్బందీగా సభ్యత్వాలు

టీఆర్ఎస్‌ను క్యాడర్ బేస్డ్ పార్టీగా తీర్చిదిద్దుదాం

- జూలై 10లోగా సభ్యత్వ నమోదు పూర్తిచేయాలి.. క్రియాశీల సభ్యులు 35 శాతం ఉండేలా చూడాలి
- కార్యకర్తల పూర్తి సమాచారాన్ని సేకరించాలి.. పత్రాలన్నీ పక్కాగా పూర్తిచేస్తేనే బీమా సదుపాయం
- వారం రోజుల్లో ఆన్‌లైన్, మొబైల్‌లో సభ్యత్వ నమోదు సౌకర్యం
- జూలై 20 నాటికి గ్రామాలు, పట్టణాలు, మండలాల్లో పార్టీ కమిటీలను ఏర్పాటుచేయాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 51 శాతం ప్రాతినిధ్యం కల్పించాలి.. బీజేపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- పార్టీ సభ్యత్వ నమోదు కమిటీల ఇంచార్జీలకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర సమితిని క్యాడర్ బేస్డ్ పార్టీగా తీర్చిదిద్దుదామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించి పకడ్బందీగా పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం కేటీఆర్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కమిటీల ఇంచార్జీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో పక్కాగా పత్రాలన్నీ పూర్తిచేస్తేనే బీమా వర్తిస్తుందన్నారు. జూలై 10లోగా సభ్యత్వ నమోదు పూర్తిచేయాలని, ఈ కార్యక్రమం పూర్తికాగానే వార్డులు, గ్రామాలు, పట్టణాలు, మండలాల్లో పార్టీ కమిటీలను ఏర్పాటుచేయాలని చెప్పారు. ఈ కమిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 51 శాతం ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు టీఆర్ఎస్‌పై బీజేపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, పార్టీ ప్రచారం కోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వాడుకోవాలని శ్రేణులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వ నమోదుకు వీలుగా పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని, మొత్తం సభ్యత్వ నమోదులో 35 శాతం క్రియాశీల సభ్యులను నమోదు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని, శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జీలతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమన్వయం చేసుకునేందుకు హైదరాబాద్ నగర పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి

మిగతా 2వ పేజీలో

ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కమిటీల ఇంచార్జీల సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

ఆదివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాల గ్రామ పరిధిలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చోలె అనితపై దాడి చేస్తున్న పోడురైతులు. (ఇన్‌సెట్) కోనేరు కృష్ణారావు

ఎఫ్ఆర్వోపై దాడి

చట్టానికి ఎవరూ అతీతులు కాదు: కేటీఆర్

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై దాడులకు పాల్పడితే ఎంతటివారైనా సహించేది లేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం సర్సాల గ్రామంలో ఆదివారం అటవీ అధికారులపై జరిగిన దాడి ఘటనను ట్విట్టర్‌లో ఆయన తీవ్రంగా ఖండించారు. 'విధి నిర్వహణలో ఉన్న అటవీ అధికారిపై దాడిచేసిన కోనేరు కృష్ణ దుర్మార్గ ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆయనపై కేసు నమోదు చేసి.. అరెస్టు చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదు' అని కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

తీవ్రంగా గాయపడ్డ చోలె అనిత.. అటవీ సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్లకు గాయాలు

కాగజ్‌నగర్ ఘటనపై సీఎం కేసీఆర్ సీరియస్!

జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మరో 12మంది అరెస్టు

బాధ్యులను వదలం: ఎస్పీ మల్లారెడ్డి

డీఎస్పీ సాంబయ్య, రూరల్ సీఐ వెంకటేశ్‌ను సస్పెండ్ చేసిన ఐజీ నాగిరెడ్డి

ప్రభుత్వం, పార్టీ స్పందనపై పలువర్గాల్లో హర్షం

5

ఉత్తర కొరియా నిస్సైనిక ప్రాంతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఉత్తర కొరియా దేశాధినేత కిమ్

ఉత్తర కొరియాలో అడుగుపెట్టిన ట్రంప్

- మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిగా రికార్డు
- నిస్సైనిక ప్రాంతంలో సమావేశమైన ట్రంప్, కిమ్
- గంటసేపు చర్చించుకున్న ఇరు దేశాధినేతలు
- ఉత్తరకొరియా అణునిరాయుధీకరణ దిశగా మరో ముందడుగు
- వైట్‌హౌస్‌కు రావాలని కిమ్‌ను ఆహ్వానించిన ట్రంప్

9

మూడెకరాలు మాయం

ధర్మగంట

3.02 ఎకరాలకు కొత్త పాస్‌బుక్‌లో ఎక్కింది రెండు గుంటలే

- తప్పు జరిగిందని ఒప్పుకొన్నా.. సవరించని అధికారులు
- ఏడాదిగా తిరుగుతున్నా పట్టని రెవెన్యూ సిబ్బంది
- ధర్మగంటను ఆశ్రయించిన సిరిసిల్ల జిల్లా గర్జనపల్లి బాధితురాలు

4

వేములవాడలో వరద

విస్తారంగా వానలు

జగిత్యాల జిల్లాలో భారీగా..

నేడు, రేపు పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు

7

రూ.100 తగ్గిన సబ్సిడీయేతర వంట గ్యాస్

సిలిండర్ ధర రూ. 637

నేటినుంచే అమలు

9

నేటినుంచి గ్రూప్ 2 ఇంటర్వ్యూలు

టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోకి సందర్శకులకు నిషేధం

2



నేటినుంచి గ్రూప్ 2 ఇంటర్వ్యూలు

టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోకి సందర్శకులకు నిషేధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 2 ఇంటర్వ్యూలు సోమవారం నుంచి జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోకి సందర్శకుల రాకపై నిషేధం విధించారు. ఇంటర్వ్యూలు జరుగుతున్న నేపథ్యంలో కమిషన్ చైర్మన్ సహా సభ్యులెవరూ సందర్శకులను కలుసుకోవడం సాధ్యపడదని కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అభ్యర్థులకు మాత్రమే కమిషన్ కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని స్పష్టంచేశారు.

నాలుగురోజుల్లో ఎస్సై ఫలితాలు!

- ఆ తర్వాత కానిస్టేబుల్ ..
- పూర్తయిన ధ్రువపత్రాల పరిశీలన
- మిగిలింది కటాఫ్ మార్కుల వెల్లడి
- అంతాసిద్ధంచేసిన టీఎస్‌ఎల్పీఆర్బీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్‌శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి తుది ఫలితాల విడుదలకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్‌ఎల్పీఆర్బీ) సర్వం సన్నద్ధమైంది. నాలుగు రోజుల్లో ఎస్సై, ఆ తర్వాత కొన్ని రోజులకే కానిస్టేబుల్ ఫలితాలు వెల్లడించనున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే టీఎస్‌ఎల్పీఆర్బీ అధికారులు తుది పరీక్షల ఫలితాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17 కేంద్రాల్లో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పూర్తిచేశారు. ఇక కటాఫ్ మార్కులు వెల్లడించడమే మిగిలింది. ఇప్పటికే ప్రక్రియ మొత్తం పూర్తిచేశామని, మరో నాలుగు రోజుల్లో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందని టీఎస్‌ఎల్పీఆర్బీ ఉన్నతాధికారి ఒకరు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ప్రక్రియ మొత్తం పూర్తయినప్పటికీ, మరోమారు నిశితంగా జాబితాలను పరిశీలిస్తున్నామని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శంగా ఫలితాలు వెల్లడించేందుకు మరికొంత సమయం తీసుకుంటున్నామని చెప్పారు. వీలైనంతవరకు జూలై మొదటివారాంతానికల్లా ఎస్సై ఫలితాలు, ఆ తర్వాత కొన్నిరోజుల్లో పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలు వెల్లడించనున్నట్టు తెలిపారు.

5, 6 తేదీల్లో సెట్

రాష్ట్రవ్యాప్తంగా 44 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లుగా పని చేసేందుకు అర్హత కల్పించే టీఎస్ సెట్ (స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్)-2019ని ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్నారు. 29 సబ్జెక్టుల్లో నిర్వహించే ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 44,648 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అత్యధికంగా తెలుగు సబ్జెక్టులో 5,735 మంది, లైఫ్ సైన్సెస్‌లో 5,600, ఇంగ్లిష్‌లో 3,983, కెమికల్ సైన్స్‌లో 3,835 మంది, గణితంలో 3,802 మంది దరఖాస్తు చేశారు. తొలిసారిగా నిర్వహిస్తున్న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) కోసం హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లో 44 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో సెషన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు. ఇప్పటికే పరీక్షల కోసం హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది.

అమరావతి వేదికగా

ఇద్దరు సీఎంల భేటీ

ఈ నెల 15 తర్వాత సమావేశం కానున్న కేసీఆర్, జగన్

ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సుహృద్భావ వాతావరణంలో మొదటి విడుత సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. రెండోవిడుత సమావేశానికి సిద్ధమవుతున్నారు. అమరావతి వేదికగా ఈ సమావేశం జరుగనున్నదని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం వెల్లడించారు. కృష్ణా బేసిన్‌కు గోదావరిజలాల తరలింపు అంశం ప్రధాన ఎజెండాగా ఈ సమావేశం ఈనెల 15 తర్వాత జరుగనున్నదని స్పష్టంచేశారు. గతనెల 28న ప్రగతిభవన్‌లో సమావేశమైన ఇద్దరు ముఖ్యమంత్రులు నదీజలాల అంశంపై సుదీర్ఘంగా చర్చించిన విషయం తెలిసిందే. కృష్ణాబేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు రోజుకు నాలుగు టీఎంసీల చొప్పున గోదావరిజలాల తరలింపుపై అధ్యయనం చేయాలని రెండురాష్ట్రాల ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లకు సీఎంలు ఆదేశించారు. ఈ నెల 15లోగా ప్రాథమిక నివేదిక ఇవ్వాలని గడువు విధించారు. ఈ నేపథ్యంలో అమరావతి వేదికగా ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇంజినీర్లు ఇచ్చే నివేదికపై చర్చించి, ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలున్నాయి. కృష్ణాబేసిన్‌కు గోదావరిజలాల తరలింపుపై పలు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఈ క్రమంలో ఇంజినీర్లు కూడా తమ నివేదికలో ఐదారు ప్రతిపాదనలను సూచించవచ్చని తెలుస్తున్నది.

ధాన్యం సేకరణలో

మనకు రెండో స్థానం

రూ.13,675 కోట్లతో 77.41 లక్షల టన్నుల సేకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 వ్యవసాయ సీజన్‌లో పౌరసరఫరాలశాఖ రైతుల నుంచి అంచనాలకు మించి ధాన్యాన్ని కొనుగోలుచేసి రికార్డు సృష్టించింది. 14,73,608 మంది నుంచి రూ.13,675 కోట్ల విలువచేసే 77.41 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసి జాతీయస్థాయిలో పంజాబ్ తర్వాత రెండో స్థానంలో నిలిచింది. 2017-18 వ్యవసాయ సీజన్‌లో జరిపిన ధాన్యం కొనుగోళ్ల (53.98 లక్షల టన్నులు) కంటే ఇది 23.43 లక్షల టన్నులు ఎక్కువ. తెలంగాణ చరిత్రలో ఇదే అత్యధికం. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి రూ.1,770 (క్వింటాల్‌కు), సాధారణ రకం ధాన్యానికి రూ.1,750 చొప్పున కనీస మద్దతుధర చెల్లించి ఆ మొత్తాలను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఖరీఫ్‌లో 8,09,885 మంది రైతుల నుంచి 3,297 కొనుగోలు కేంద్రాల ద్వారా 40.41 లక్షల టన్నులు, యాసంగిలో 6,63,723 మంది రైతుల నుంచి 3,509 కొనుగోలు కేంద్రాల ద్వారా 37 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది.

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

సంవత్సరం	కొనుగోలు కేంద్రాలు	కొనుగోళ్లు	వ్యయం
2014-15	3,329	24.28 లక్షల టన్నులు	రూ.3,390.50 కోట్లు
2015-16	3,007	23.56 లక్షల టన్నులు	రూ.3,396.97 కోట్లు
2016-17	5,218	53.69 లక్షల టన్నులు	రూ.8,089.56 కోట్లు
2017-18	6,029	53.98 లక్షల టన్నులు	రూ.8,565.15 కోట్లు

అందరి సహకారంతోనే సాధించాం

సీఎం కేసీఆర్ ఆదేశాలు, పౌరసరఫరాల శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచనలు, అన్నిస్థాయిల్లోని అధికారుల సమన్వయంతో ఈ రికార్డు సాధ్యమైంది. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యం సేకరణ జరిపాం. ధాన్యం కొనుగోళ్లకు కావల్సిన నిధులను సీఎం కేసీఆర్ సకాలంలో సమకూర్చడంతో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు చెల్లింపులు జరిపాం.

- మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్

రైతు సంక్షేమ చర్యలతో సత్ఫలితాలు

రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్, కొత్త సాగునీటి ప్రాజెక్టుల వల్ల తెలంగాణలో ధాన్యం దిగుబడులు గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో ఈ ఏడాది లక్ష్యానికి మించి రికార్డుస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఎక్కడా లోపాలకు తావులేకుండా జిల్లాల కలెక్టర్లు, జేసీలు పౌరసరఫరాలశాఖతోపాటు ఇతర విభాగాల అధికారుల సమన్వయంతో ముందుకు సాగాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కచ్చితంగా మద్దతుధర లభిస్తుందనే నమ్మకంతో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం. కొత్త రాష్ట్రమైన తెలంగాణ కేవలం ఐదేండ్లలోనే ధాన్యం సేకరణలో రెండో స్థానానికి చేరుకోవడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణం.

- పౌరసరఫరాల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సచివాలయాన్ని గగన్‌విహార్‌కు తరలించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్న ఉద్యోగవర్గాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సచివాలయాన్ని గగన్‌విహార్‌కు తరలించాలని ఉద్యోగవర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రస్తుత సచివాలయ స్థలంలోనే నూతన సచివాలయాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో పాలనాపరమైన ఇబ్బందులు కొంతమేరకైనా తగ్గించడానికి అన్నిశాఖలు ఒకే దగ్గర ఉండాలని అభిప్రాయపడుతున్నాయి. మెట్రో రైల్, ఎంఎంటీఎస్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి బస్ సౌకర్యం ఉన్న నాంపల్లిలోని 13 అంతస్తుల గగన్‌విహార్ భవనాన్ని సచివాలయంగా మారిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నాయి. ఈ మేరకు వివిధ శాఖల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేయాలనుకుంటున్నాయి.

ముహూర్తం

సూర్యోదయం: 5.49 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం, చతుర్దశి, నక్షత్రం: రోహిణి ఉదయం 9.25 వరకు, తదుపరి మృగశిర, అమృతఘడియలు: రాత్రి 11.52 నుంచి 1.28 వరకు, రాహుకాలం: ఉదయం 7.27 నుంచి 9.05 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 11.54 నుంచి మధ్యాహ్నం 12.46 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.22 నుంచి సాయంత్రం 4.14 వరకు, వర్జ్యం: తె.జా. 1.37 నుంచి 3.13 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.45 నుంచి సాయంత్రం 4.21 వరకు.

విభజన సమస్యలపై

సీఎస్ సమీక్ష నేడు

3న గవర్నర్‌తో సమావేశానికి పూర్తి ఎజెండాతో సిద్ధం

- శాఖ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం
- హెడ్‌క్వార్టర్స్‌పై ప్రధానంగా చర్చ
- ఆర్టీసీ, డెయిరీ, ఫైనాన్స్ కార్పొరేషన్, దిల్ తదితర సంస్థల ఆస్తుల విభజనపై సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర విభజన సందర్భంగా ఉత్పన్నమైన సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవాలని తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ యంత్రాంగం అందుకు సంసిద్ధమవుతున్నది. ముఖ్యమంత్రుల సమావేశానికి కొనసాగింపుగా శనివారం ఇరురాష్ట్రాల అధికారులు సమావేశమయ్యారు. జూలై 3న రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ సమక్షంలో జరిగే సమావేశంలో కీలకమైన కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరయ్యేందుకు తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి సోమవారం సచివాలయంలో శాఖ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ మొదటి సీఎస్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ కూడా హాజరుకానున్నట్టు తెలిసింది. ముఖ్యంగా షెడ్యూల్ 9,10 పరిధిలోకి వచ్చే కీలకమైన ఆర్టీసీ, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఫుడ్స్, దక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (దిల్) తదితర సంస్థలపై సమగ్రంగా చర్చించనున్నట్టు తెలిసింది. ఏపీ పునర్విభజన చట్టం-2014 షెడ్యూల్ 9లోని సంస్థల హెడ్‌క్వార్టర్స్ విభజనపై స్పష్టమైన సూచనలు చేసింది. ఆ సంస్థ అధిపతి ఏ భవనంలో కూర్చుంటే అదే హెడ్‌క్వార్టర్స్ అవుతుందని.. అనుబంధ కార్యాలయాలు, సంస్థలన్నీ ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రం కిందకే వస్తాయని వర్గీకరించింది. అయితే చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఉన్న ఆయాసంస్థల కార్యాలయాలన్నీ హెడ్‌క్వార్టర్స్ కిందకే వస్తాయంటూ తప్పుడు వర్గీకరణచేసి షెడ్యూల్‌లోని సంస్థల విభజన జరుగకుండా అడ్డుకున్నది. ప్రస్తుతం రెండురాష్ట్రాల మధ్య ఏర్పడిన సహృద్భావ వాతావరణం నేపథ్యంలో పునర్విభజనచట్టం నిర్దేశించిన ప్రకారం ఏ విధంగా విభజన జరిగే అవకాశం ఉంటుంది, హెడ్‌క్వార్టర్స్ (సంస్థల అధిపతులు కూర్చునే కార్యాలయాలు)ను జనాభా నిష్పత్తి ప్రకారం పంపిణీ చేస్తే.. ఏపీకి ఎంత నగదు చెల్లించాల్సి ఉంటుందన్నదానిపై సీఎస్ జోషి చర్చించనున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏఏ విషయాలపై విభేదాలు సృష్టించి, విభజన జరుగకుండా అడ్డుకున్నది, దీనివల్ల తెలంగాణకు జరిగిన నష్టం ఎంత? తదితర అంశాలపై ఈ సందర్భంగా సమీక్షించనున్నారు.

షెడ్యూల్ 10 సంస్థలపై ప్రతిపాదనలు

షెడ్యూల్ 10 సంస్థలు ఏ రాష్ట్ర భూభాగంలో ఉంటే ఆ రాష్ట్రానికే వర్తిస్తాయని విభజనచట్టం స్పష్టంగా పేర్కొన్నది. కానీ, 10 షెడ్యూల్ కింద ఉన్న ఉన్నత విద్యామండలి విభజనపై నాటి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. విభజనచట్టం ప్రకారం వెళితే అసలు సమస్యే ఉండేది కాదు. చంద్రబాబు సర్కారు తెలంగాణ ప్రభుత్వంతో కావాలనే గిల్లికజ్జాలు పెట్టుకోవడంతో ఐదేండ్లుగా సంస్థల విభజన జరుగకుండా నిలిచిపోయింది. తాజాగా షెడ్యూల్ 10లోని సంస్థల విభజన కూడా జరిగే అవకాశం ఉండటంతో వాటిపై కూడా సీఎస్ జోషి సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలను సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వద్దకు తీసుకువెళ్లనున్నారు. వాటిని సీఎం ఆమోదించిన తరువాత గవర్నర్ వద్ద జరిగే సమావేశం ముందు ఉంచుతారు. ఇరురాష్ట్రాల సీఎస్‌లు అంగీకరించిన ప్రతిపాదనల మేరకు గవర్నర్ ఆమోదంతో విభజన జీవోలు వెలువడనున్నాయి.

పంటలవారీగా కొనుగోళ్లకు సాఫ్ట్‌వేర్

ఎన్ఐసీ సాయంతో సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్న మార్కెటింగ్‌శాఖ

రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీకి చర్యలు

గిట్టుబాటు ధర కల్పించేలా మార్కెటింగ్‌శాఖ యాక్షన్‌ప్లాన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పంట ఉత్పత్తులవారీగా కొనుగోళ్లకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను మార్కెటింగ్‌శాఖ సిద్ధంచేస్తున్నది. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సాయంతో ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. రైతుల వివరాలను పొందుపర్చడంతోపాటు, మద్దతు ధరకు ఉత్పత్తుల కొనుగోళ్లు జరిపేలా తయారుచేస్తున్నారు. పంట కొనుగోలుచేసిన వెంటనే రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ అయ్యేలా చర్యలు తీసుకొంటున్నారు. ఏ పంట ఎన్ని ఎకరాల్లో, ఎక్కడి రైతులు పండించారు? మద్దతు ధర ఎంత? అనే వివరాలు సాఫ్ట్‌వేర్‌లో ఉండనున్నాయి. పంట ఉత్పత్తులను ఎక్కువగా మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తున్నది. దాంతో మార్క్‌ఫెడ్‌కు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ తయారుచేస్తున్నారు. దీనితో హాకా, పౌరసరఫరాల శాఖను కూడా అనుసంధానం చేయనున్నారు. ప్రస్తుత వానకాలం నుంచి అన్ని వ్యవసాయోత్పత్తులను మద్దతు ధరకు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

రైతులకు బాసటగా యాక్షన్‌ప్లాన్

మద్దతు ధరకు మార్కెటింగ్‌శాఖ ద్వారానే కొనుగోళ్లు జరుపడం ద్వారా బహిరంగ మార్కెట్‌లో ఖచ్చితంగా అదే ధర రైతుకు లభిస్తుంది. దీంతో రైతులు ఏ పంట అమ్ముకొన్నా.. దళారులు, వ్యాపారుల దోపిడీ లేకుండా ఉంటుందని సీఎం కేసీఆర్ ఆలోచనగా ఉన్నది. కేంద్రం ప్రకటించిన పంటలకే కాకుండా రాష్ట్రంలో పండుతున్న అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా యాక్షన్‌ప్లాన్‌ను మార్కెటింగ్‌శాఖ సిద్ధంచేస్తున్నది. తెలంగాణలో పండుతున్న ఉత్పత్తులకు ఏయే రాష్ట్రాలు, దేశాల్లో డిమాండ్ ఉన్నదనేదానిని మానిటరింగ్ టీం ద్వారా తెలుసుకొని ఎప్పటికప్పుడు వారితో ఒప్పందాలు కుదుర్చుకొంటే మార్కెటింగ్‌శాఖకు నష్టాలు రావు. అలాగే ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు పెడుతున్నందున నాణ్యమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు ప్రభుత్వ బ్రాండ్‌తో అందించడం ద్వారా అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించవచ్చనేది ప్రభుత్వ వ్యూహంగా ఉన్నది.

ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కమిటీల ఇంచార్జీల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు. చిత్రంలో ఎంపీలు పీ రాములు, బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శంభీపూర్ రాజు, బోడకుంటి వెంకటేశ్వర్లు, భానుప్రసాద్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఫరీదుద్దీన్, వీజీ గౌడ్, ఫరూఖ్ హుస్సేన్, నారదాసు లక్ష్మణరావు, సత్యవతి రాథోడ్, నవీన్‌కుమార్ కూడా ఉన్నారు.. హాజరైన పార్టీ సభ్యత్వ నమోదు కమిటీల ఇంచార్జీలు

లోకం పోకడ

అందరూ రాజీనామాలు చేసేస్తున్నారు.. ఇకనైనా పార్టీ బలపడుతుందేమో చూడాలి!!

పకడ్బందీగా సభ్యత్వాలు

మొదటిపేజీ తరువాయి...

ఒకరు చొప్పున, మిగిలిన ప్రాంతాల్లో రెండు నియోజకవర్గాలకు ఒకరు చొప్పున ఇంచార్జీలను పార్టీ ప్రకటించిందన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు వీరంతా వచ్చే రెండువారాలపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, సభ్యత్వ నమోదులో స్థానిక టీఆర్ఎస్ నాయకులందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు. టీఆర్ఎస్ సభ్యత్వాన్ని ఆన్‌లైన్, మొబైల్ ద్వారా చేసుకునే సౌకర్యాన్ని వారం రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు.

కార్యకర్తల పూర్తి సమాచారాన్ని సేకరించాలి

సభ్యత్వ నమోదు సందర్భంగా కార్యకర్తల పూర్తి సమాచారాన్ని సేకరించాలని కేటీఆర్ స్పష్టంచేశారు. టీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రమాద బీమా కల్పిస్తున్నందున వారి చిరునామా, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, నామినీ వివరాలను విధిగా సేకరించాలని సూచించారు. ఈ వివరాలుంటే బీమా సదుపాయాన్ని పొందేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను స్వయంగా తానే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని తెలిపారు.

సభ్యత్వాల డిజిటలీకరణ

సభ్యత్వ నమోదు వివరాలను ఎక్కడికక్కడే డిజిటలీకరణ చేస్తున్నామని, కొత్త జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించే జిల్లా ఇంచార్జీలను కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. సభ్యత్వం పూర్తయిన పుస్తకాలను ఆయా జిల్లా కేంద్రాలకు పంపగానే కంప్యూటీకరిస్తారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశారు. క్రియాశీల సభ్యత్వాలనే కాకుండా సాధారణ సభ్యత్వాలను కూడా పూర్తిస్థాయిలో కంప్యూటీకరించనున్నారు. భవిష్యత్‌లో పార్టీ నాయకులతో మాట్లాడేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేసేందుకు వీలుగా ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ఈ-మెయిల్ అడ్రస్‌లను సేకరిస్తున్నారు.

గ్రామస్థాయిలో పార్టీ అనుబంధ కమిటీలు

పార్టీ సభ్యత్వ నమోదుతోపాటు పార్టీ కమిటీల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలను కేటీఆర్ వివరించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ కమిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కనీసం 51 శాతం ఉండేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ, మండల కమిటీలు, నగరాలు, పట్టణాల్లో డివిజన్, వార్డు కమిటీల ఏర్పాటు జూలై 20 నాటికి పూర్తయ్యేలా చూడాలని, ఇందుకోసం స్థానిక నాయకత్వంతో కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని ఇంచార్జీలకు కేటీఆర్ సూచించారు. ప్రతి కమిటీలో 15 మందికి తగ్గకుండా ఉండేలా చూడాలని, అన్ని కమిటీల్లోనూ పార్టీ క్రియాశీల సభ్యులకు మాత్రమే అవకాశమివ్వాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో పార్టీకి అనుబంధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, రైతు, యువజన, కార్మిక, మహిళా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సభ్యత్వ నమోదు పండుగలా జరుగాలి

మంచి కార్యకర్తలు, అభిమానులకు తప్పనిసరిగా పార్టీ సభ్యత్వం లభించేలా చూడాలని, రాసి కంటే వాసి ముఖ్యమని కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు టీఆర్ఎస్ శ్రేణులంతా సిద్ధం కావాలని, వార్డుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోనూ పార్టీ సభ్యత్వ నమోదును పండుగలా నిర్వహించాలన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా టీఆర్ఎస్ జిల్లా కార్యాలయాల్లో పెద్ద సమావేశ మందిరాన్ని నిర్మించుకోవాలని సూచించారు. సిరిసిల్లలోనూ ఇదేవిధంగా చేస్తున్నామని, దీని కోసం అదనంగా మరో రూ.40 లక్షల వరకు అవసరమవుతాయని భావిస్తున్నామని తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయాల్లో సిబ్బందిని నియమిస్తామని, సభ్యత్వ నమోదుకు వాడుతున్న కంప్యూటర్లను పార్టీ కార్యాలయాల్లో ఉపయోగించుకునేలా సమకూరుస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

465 మంది వీఆర్ఏలకు పదోన్నతి

ఉత్తర్వులు జారీచేసిన జిల్లాల కలెక్టర్లు

కృతజ్ఞతలు తెలిపిన వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అర్హులైన 465 మంది వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లాల కలెక్టర్లు ఉత్తర్వులు ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 142, నిజామాబాద్‌లో 38, మహబూబ్‌నగర్‌లో 80, వరంగల్‌లో 30, ఖమ్మంలో 56, కరీంనగర్‌లో 119 మంది వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు కల్పించిన జిల్లా కలెక్టర్లకు, జేసీలకు, డీఆర్వోలకు వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతులు ఉమ్మడి జిల్లాలవారీగా చేపట్టారని, తనకు కూడా మేలు జరుగడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పదోన్నతులు కల్పించాలని కోరారు.

యాదాద్రి గర్భాలయానికి తలుపుల బిగింపు పూర్తి

ప్రత్యేక పూజలుచేసిన అర్చకులు

యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయ గర్భాలయ తలుపుల బిగింపు కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. వైటీడీఏ వైస్ చైర్మన్ జీ కిషన్‌రావు, ఆలయ ఈవో ఎన్ గీత, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొనగా, ప్రధానార్చకులు నల్లంతీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు ఆధ్వర్యంలోని అర్చకులు సుమారు రెండుగంటలపాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ టేకు తలుపులను పూర్తిగా స్వర్ణమయం చేసేందుకు ఇప్పటికే కార్యాచరణ పూర్తిచేశారు. చెన్నైలోని గోల్డ్ ప్లేటింగ్ చేసే సంస్థకు బంగారాన్ని అందజేసి నిర్దేశించిన డిజైన్లను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థపతులు కే సుందరరాజన్, డాక్టర్ ఆనంద వేలు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

ఆదివారం యాదాద్రిలో గర్భాలయానికి తలుపులను బిగించి పూజలుచేస్తున్న అర్చకులు.
చిత్రంలో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవో గీత, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి తదితరులు కూడా ఉన్నారు.

ఒకేరోజు మూడు మోటర్ల డ్రైరన్

ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో రికార్డు

కాళేశ్వరం జలాలు వచ్చేలోగా 0.6 టీఎంసీల తరలింపునకు కసరత్తు

మెట్‌పల్లి వద్ద మోటర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్‌లో మోటర్ డ్రైరన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌లో డ్రైరన్ పూర్తిచేసుకున్న రెండు మోటర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/మల్యాల/మెట్‌పల్లి రూరల్: శ్రీరాంసాగర్‌కు పునర్జీవాన్ని కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పునర్జీవ పథకం రికార్డు నమోదుచేసింది. ఒకేరోజు మూడు మోటర్ల డ్రైరన్‌ను అధికారులు విజయవంతంగా పూర్తిచేసి రికార్డు నెలకొల్పారు. ఆదివారం మొదటి, రెండో పంపుహౌస్‌లోని మూడు మోటర్లను అధికారులు పరీక్షించగా.. నిర్ణీత సాంకేతిక ప్రమాణాల మేరకు అవి నడువడంతో ఇంజినీర్లలో సంతోషం వ్యక్తమైంది. గోదావరిలో వరద ఉధృతి పెరిగినప్పటి నుంచి మేడిగడ్డ మొదలు వరుస బరాజ్‌ల ద్వారా ఎల్లంపల్లి ఆపై మిడ్‌మానేరుకు గోదావరి జలాలను తరలించేందుకు అధికారులు అన్నిరకాలుగా సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఎస్సారెస్పీ వరద కాలువలోకి జలాలు రాగానే.. అక్కడి నుంచి మిడ్‌మానేరుకు, పునర్జీవ పథకం ద్వారా శ్రీరాంసాగర్‌కు తరలించాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్‌లో రెండు మోటర్ల ట్రయల్‌రన్‌ను కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రారంభించారు. జూలై 10 నాటికి నాలుగో మోటర్ బిగింపు, జూలై 15 నాటికి ఐదు మోటర్లను వినియోగంలోకి తేనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

చకచకా డ్రైరన్ పనులు

వరద కాలువ 73వ కి.మీ. వద్ద జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ గ్రామ పరిధిలో కొత్త క్రాస్ రెగ్యులేటర్ నిర్మిస్తున్నారు. అక్కడే నిర్మిస్తున్న పంపుహౌస్‌లో 1450 క్యూసెక్కుల డిశ్చార్జి, 6.5 మెగావాట్ల సామర్థ్యం ఉండే ఎనిమిది పంపులను ఏర్పాటుచేస్తున్నారు. తద్వారా 11,600 క్యూసెక్కుల నీటిని ఇక్కడ పంపింగ్ చేస్తారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట గ్రామ పరిధిలో వరద కాలువ 34వ కిలోమీటర్ దగ్గర కూడా కొత్త క్రాస్ రెగ్యులేటర్, మొదటి దశ తరహాలోనే పంపుహౌస్ ఏర్పాటుచేస్తున్నారు. ఇక్కడ ఎనిమిది మోటర్లను ఏర్పాటుచేయాల్సి ఉండగా.. ఇప్పటికీ రెండు పూర్తయ్యాయి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ గ్రామ పరిధిలోని వరద కాలువ 0.100 కిలోమీటర్ వద్ద ఎనిమిది పంపులతో పంపుహౌస్ నిర్మిస్తున్నారు. మొదటి రెండు దశల ద్వారా జలాల్ని ఎత్తిపోసినా శ్రీరాంసాగర్ జలాశయానికి జలాల్ని తరలించడంలో సాంకేతిక వెసులుబాటు ఉన్నందున.. అధికారులు మొదటి రెండు పంపుహౌస్‌లపై ప్రత్యేక దృష్టిసారించారు. జూలై నాటికి వరద కాలువ నుంచి శ్రీరాంసాగర్‌లోకి జలాల్ని ఎత్తిపోసేందుకు అధికారులు చకాచకా డ్రైరన్లను నిర్వహిస్తున్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరివ్వడమే లక్ష్యం: ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమనీ, అందులో భాగంగానే ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు చెప్పారు. రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌లో మోటర్ల డ్రైరన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సలహాదారు కే పెంటారెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, నవయుగ డైరెక్టర్ వెంకటరామారావు, ఎస్ఈ శ్రీకాంతారావు, ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌రావు, ఈఈ సుధాకిరణ్, డీఈ రూప్లా, క్యూసీ ఈఈ రమేశ్, క్యూసీ డీఈఈ మధుసూదన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్, రాంపూర్ పంప్‌హౌస్ ఇంచార్జి డీఈఈ రాంప్రదీప్, ఏఈఈ తిరుపతి, మధు, సైట్ ఇంచార్జి నారాయణ, మెట్‌పల్లి ఎంపీపీలు మారు సాయిరెడ్డి, జాజాల భీమేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి ఉమారాణి, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిపై పాంచ్ పటాకా!

నాలుగు టీఎంసీలపై ప్రధానంగా ఐదు ప్రతిపాదనలు

ముమ్మరంగా కసరత్తు చేస్తున్న ఇరురాష్ట్రాల ఇంజినీర్లు.. రేపు జలసౌధలో సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా బేసిన్‌కు రోజుకు 4 టీఎంసీల గోదావరి జలాలను తరలించే ప్రాజెక్టులపై తెలంగాణ, ఏపీ ఇంజినీర్లు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. జూన్ 28న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ తర్వాత మొదలైన ఈ మథనం.. ఇరువైపులా ఇంకా కొనసాగుతూనే ఉన్నది. మంగళవారం (జూలై రెండో తేదీ) జలసౌధలో రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లు సమావేశమవుతున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రతిపాదనలు కొలిక్కి వచ్చినట్టు తెలుస్తున్నది. కృష్ణా బేసిన్‌లోని నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలకు రోజుకు 4 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమైన దరిమిలా చకాచకా ప్రతిపాదనలు రూపుదిద్దుకొంటున్నాయి. ఇంజినీర్ల కసరత్తులో ప్రధానంగా తెరపైకి వచ్చిన అంశాలను పరిశీలిస్తే.. పోలవరం నుంచి నాగార్జునసాగర్‌కు రోజుకు 2 టీఎంసీలు తెచ్చే ప్రతిపాదన ప్రధానంగా చర్చకు రానున్నట్టు తెలుస్తున్నది.

ప్రచారంలో ఉన్న ఐదు ప్రతిపాదనలివే..

- పోలవరం నీటిని గ్రావిటీ ద్వారా ఏపీ తలపెట్టిన వైకుంఠాపురం బరాజ్‌కు తరలించడం. ఆపై పులిచింతలలోకి, అక్కడి నుంచి చిన్న లిఫ్టు ద్వారా నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌లో పోయడం.
- దుమ్ముగూడెం వద్ద రిజర్వాయర్ నిర్మించి అక్కడినుంచి నాగార్జునసాగర్‌కు జలాలు తరలించడం. ఇందుకు 240 కిలోమీటర్ల కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు.
- ఇచ్చంపల్లి దిగువన 50 కి.మీ.దూరంలోని రాంపూర్ నుంచి గోదావరి జలాలను లక్నవరం ట్యాంకులో పోయడం. అక్కడి నుంచి డిస్ట్రిబ్యూటరీ-38లో రివర్స్ పంపింగ్ ద్వారా కాకతీయ కాలువలోకి, ఆ తర్వాత మూసీ వద్ద క్రాస్ రెగ్యులేటర్ నిర్మించి ఉదయసముద్రానికి తరలించడం
- రాంపూర్ నుంచి గోదావరి జలాలను నేరుగా శ్రీశైలానికి తరలించడం. ఇందుకు సొరంగంసహా కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని ప్రాథమిక అంచనా.
- నాగార్జునసాగర్ జలాశయంలోకి గోదావరి జలాల తరలించి అవసరానికి అనుగుణంగా రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీశైలం టెయిల్‌పాండ్ నుంచి జలాశయంలోకి గోదావరి జలాల్ని ఎత్తిపోయడం.

రెండు, మూడేండ్లే లోటు

ఇంజినీర్ల మథనంలో తెరపైకి ప్రాథమికంగా ఐదు ప్రతిపాదనలు రాగా.. పూర్తిస్థాయి స్పష్టత వెల్లడి కాలేదు. నాగార్జునసాగర్ నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీశైలం జలాశయానికి అవసరమైన గోదావరి జలాల తరలింపు జరుపవచ్చని ఇంజినీర్లు చెప్తున్నారు. దీనిపై మూడురోజుల కిందటి సమావేశంలోనూ ఇంజినీర్లు చర్చించారు. కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం వరకు వరద బాగానే ఉన్నా.. అక్కడినుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో తగ్గిన పరిస్థితులు ఉన్నట్టు ఇంజినీర్లు గుర్తించారు. 47 ఏండ్ల రికార్డుల్ని పరిశీలిస్తే, రెండు, మూడేండ్లు మినహా శ్రీశైలం జలాశయానికి 500 టీఎంసీలకు మించి వరద వచ్చినట్టు తేలింది. శ్రీశైలం వరకు కృష్ణా జలాల వినియోగానికి ఒకవేళ లోటు ఏర్పడితే నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి రివర్స్ పంపింగ్ ద్వారా తరలింపు చేపట్టవచ్చనే చర్చ కూడా ఇంజినీర్ల మధ్య జరుగుతున్నది.

మిలియన్ కాదు.. 3.5 మిలియన్ పౌండ్లు!

లండన్, కరాచీకి చేరిన నిజాం నగదు

పాత రికార్డుల ద్వారా వెల్లడి

హైదరాబాద్, జూన్ 30: హైదరాబాద్ నిజాం నవాబుకు చెందిన నిధులపై లండన్ కోర్టులో భారత్, పాక్ మధ్య దశాబ్దాలుగా న్యాయ పోరాటం జరుగుతున్న విషయం తెలిసిందే. దేశ విభజన సమయంలో అనేక సంస్థానాలు భారత్‌లో విలీనమైనా, హైదరాబాద్ నిజాం మాత్రం భారత్‌లో కలువడానికి నిరాకరించారు. చివరకు 1948 సెప్టెంబర్‌లో సైనిక చర్య ద్వారా హైదరాబాద్ భారత్‌లో విలీనమైంది. అంతకు కొద్ది రోజుల ముందు నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ లండన్‌లోని నాటి పాకిస్థాన్ హైకమిషర్ హబిబ్ ఇబ్రహీంకు చెందిన నాట్‌వెస్ట్ బ్యాంకు ఖాతాకు ఒక మిలియన్ పౌండ్లు జమచేశారు. ఈ నిధుల కోసమే ప్రస్తుతం భారత్, పాక్ మధ్య వివాదం నడుస్తున్నది. అయితే నాడు నిజాం నవాబు పంపినది కేవలం ఒక మిలియన్ పౌండ్లు మాత్రమే కాదని పాత రికార్డులు వెల్లడిస్తున్నాయి. 3.5 మిలియన్ పౌండ్లు లండన్, కరాచీకి చేరినట్లు వాటిల్లో తేలింది. రహమతుల్లా ఖాతాలో ఒక మిలియన్ పౌండ్లు జమకాగా, మిగిలిన మొత్తం ఆయుధ డీలర్లు, ఇతరులకు చేరినట్లు వెల్లడైంది. అయితే తన అనుమతి లేకుండా తన ఆర్థిక మంత్రి, లండన్‌లోని ఏజెంట్ జనరల్ నవాబ్ మొయిన్ నవాబ్ జంగ్ ఈ నిధులను దుర్వినియోగం చేయడంతో ఆగ్రహం వ్యక్తంచేసిన నిజాం నవాబు విచారణకు ఆదేశించి.. నగదును వెనక్కి ఇచ్చేయాలని హుకుం జారీచేశారు. వివాదం నేపథ్యంలో నాట్ వెస్ట్ బ్యాంకు ఆ నిధులను స్తంభింపజేసింది. ఈ కేసుకు సంబంధించి బ్రిటన్ హైకోర్టు త్వరలోనే తీర్పు వెలువరించనుంది.

నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్

మరో రూ. 6 కోట్లు కూడా..

3.5 మిలియన్ పౌండ్లతోపాటు మరో రూ.6 కోట్లు కూడా లండన్, కరాచీకి చేరినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. నాటి హైదరాబాద్ ప్రధాని లైక్ అలీ ఇందులో కీలకపాత్ర పోషించారు. ఈ మొత్తాన్ని భజనపరులకు, సిడ్నీ కాటన్ తదితర ఆయుధ డీలర్లకు ముట్టజెప్పారు. విదేశాలకు చెందిన జర్నలిస్టులకూ కొంత మొత్తం అందజేశారు. రహమతుల్లా ఖాతాకు ఒక మిలియన్ పౌండ్లు బదిలీ చేయడంలో నవాబ్ ఆర్థిక మంత్రి మొయిన్ నవాజ్ జంగ్ కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ మొత్తం 307 కోట్లకు చేరుకున్నది. మిగిలిన 2.5 మిలియన్ పౌండ్లకు సంబంధించి ఎలాంటి లెక్కలు లేవు. నాడు హైదరాబాద్ సంస్థానంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నిధుల వ్యయానికి సంబంధించి ఎలాంటి రక్షణలు పొందుపరచకపోవడమే అందుకు కారణం. 1948 సెప్టెంబర్‌లో హైదరాబాద్ రాష్ట్రానికి సంబంధించిన వార్తా కథనాలపై జరిపిన అధ్యయనం ప్రకారం.. ఆయుధ డీలర్ హెన్రీ సిడ్నీ కాటన్‌కు లక్ష పౌండ్లు చెల్లించారు. నాటి పాక్ ఉన్నతాధికారి అయిన షోహ్రిబ్‌కు 89,000 పౌండ్లు చెల్లించినట్లు తేలింది. హైదరాబాద్‌కు ప్రత్యక్ష సముద్ర మార్గం ఉండాలన్న ఉద్దేశంతో గోవాను కొనుగోలు చేసేందుకుగాను సంప్రదింపులు జరిపేందుకు నిజాం నియమించుకున్న సర్ అలెగ్జాండర్ రోజర్స్‌కు 10 వేల పౌండ్లు అందజేసినట్లు వెల్లడైంది. నాటి పాక్ ప్రధాని గులాం మహమ్మద్‌కు 25 వేల పౌండ్లు చేరాయి. అయితే ఎందుకు ఆయనకు ఈ మొత్తం చెల్లించారనేదానిపై ఎలాంటి సమాచారం లేదు. ఐక్యరాజ్యసమితిలో కేసు విచారణ కోసం నిజాం నవాబు విదేశాంగ కార్యదర్శి, ఐక్యరాజ్యసమితిలో హైదరాబాద్ రాజ్య ప్రతినిధి జహీర్ అహ్మద్‌కు 45 వేల పౌండ్లు చెల్లించినట్లు తేలింది.

త్వరలో బ్రిటన్ హైకోర్టు తీర్పు..

నాట్ వెస్ట్ బ్యాంకులో దశాబ్దాలుగా మూలుగుతున్న నగదుపై బ్రిటన్ హైకోర్టులో విచారణ తుది దశకు చేరుకున్నది. త్వరలోనే దీనిపై తీర్పు వెలువడనున్నది. ఆ సొమ్ము తమకే చెందాలని నిజాం వారసులు పేర్కొంటుండగా, వాటిపై హక్కు తమకే ఉందని పాక్ వాదిస్తున్నది. నాటి హైదరాబాద్ సంస్థానంపై భారత్ దండెత్తినప్పుడు, నవాబుకు తాము ఆయుధాలు అందజేశామని, అందుకు ప్రతిగా ఆయన తమకు ఆ నిధులు చెల్లించారని పాక్ చెబుతున్నది. ఈ వాదనను నిజాం వారసులు తోసిపుచ్చుతున్నారు. ఈ కేసులో నిజాం వారసులు భారత ప్రభుత్వంతో చేతులు కలిపారు. 1967 లో ఏడో నిజాం మృతిచెందారని, అంతకు రెండేండ్ల ముందు 1965 లో ఆ నగదు భారత్‌కే చెందాలంటూ ఆయన వీలునామా రాశారని భారత్ తరపున వాదిస్తున్న లాయర్ పాల్ హెవిట్ చెప్పారు.

5 నుంచి ఎంసెట్ వెబ్‌కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంజినీరింగ్ కళాశాలలు ఇంకా ఫీజు ఖరారుచేయని కారణంగా సోమవారం ప్రారంభం కావాల్సిన ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఈ నెల ఐదు నుంచి ప్రారంభిస్తున్నట్టు టీఎస్ ఎంసెట్ కన్వీనర్ నవీన్ మిట్టల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 37,413 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. ఆదివారం 7500 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని చెప్పారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం 53,364 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. సోమవారం వరకు స్లాట్ బుకింగ్‌కు గడువు ఉన్నదని, ఈ నెల 3న వెరిఫికేషన్ పూర్తవుతుందని తెలిపారు.

Telangana Academy for Skill and Knowledge
TASK
Department of ITE&C, Govt. of Telangana
1st Floor, Ashoka Ragupathi Chambers, Begumpet, Hyd-16.
Students Registration Notification Year 2019-20
TASK invites enrollments from students pursuing II / III / IV year in B.E / B.Tech / B. Pharmacy / MCA / MBA / PGDM / BA / B.Sc / B.Com / BCA / BBM / BBA / MA / M.Sc / M.Com / Polytechnic to avail the services offered at its registered colleges.
visit : www.task.telangana.gov.in, 040 - 48488275
e-mail : enquiry_task@telangana.gov.in

Start date	End date	with Late fee
1st July 2019	31st Aug 2019	7th Sep 2019

Place : Hyderabad Date : 01-07-2019 Sd/- Director, HR&A

అధైర్యం వద్దు.. అండగా నేనున్నా!

- చేనేత కుటుంబానికి కేటీఆర్ భరోసా
- భర్త మరణంతో రోడ్డునపడ్డ భార్య, పిల్లలు
- వారి దీనస్థితిపై చలించిన కేటీఆర్
- ఆశ్రయం, భోజన వసతి కల్పన
- డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తామని హామీ

సిరిసిల్ల టౌన్: ఇంటి పెద్దదిక్కును కోల్పోయి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న చేనేతకార్మిక కుటుంబాన్ని ఆదుకొని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన వేముల సదానందం-కవిత దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు లవణ్ (13), కుమార్తె వైష్ణవి (7) ఉన్నారు. సదానందం సాంచాలు అద్దెకు తీసుకొని నడిపించుకుంటుండగా, కవిత బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు. శివనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివసిస్తూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. అప్పుల బాధతో మనస్తాపం చెందిన సదానందం గత నెల 24న పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సదానందం కుటుంబసభ్యులను ఇంటి యజమాని ఖాళీచేయించాడు. దీంతో కవిత తన ఇద్దరు పిల్లలతో కలిసి జిల్లా దవాఖాన ఆవరణలోని ఓ షెడ్డు కింద ఆశ్రయం పొందుతున్నది. వీరి దీనస్థితికి కేటీఆర్ చలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేటీఆర్ ఆదేశాలతో ఆయన పీఏ ధనరాజ్ జిల్లా దవాఖానకు వెళ్లి బాధితులతో మాట్లాడారు. వారి పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం వారిని సిరిసిల్ల బీవైనగర్‌లోని మహిళా కమ్యూనిటీ భవనానికి తరలించి అక్కడ ఆశ్రయం కల్పించారు. మెప్మా ద్వారా భోజన వసతితోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని ధనరాజ్ పేర్కొన్నారు. అధైర్యపడొద్దని, అండగా కేటీఆర్ సార్ ఉన్నారని భరోసా కల్పించారు. ప్రభుత్వం ద్వారా డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయించడంతోపాటు పిల్లల విద్యాఖర్చులు భరిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ధనరాజ్‌తోపాటు స్థానిక టీఆర్ఎస్ నేత కల్లూరి రాజు బాధితులకు ఆర్థికసాయాన్ని అందజేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడి కుటుంబసభ్యుల వివరాలు సేకరిస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పీఏ ధనరాజ్

కేటీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం

నా భర్త మమ్మల్ని అనాథలనుచేసి వెళ్లిపోయిండు. ఇద్దరు పిల్లలతో ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి. అద్దెఇల్లు కూడా ఇయ్యడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మా కష్టం తెలుసుకున్న కేటీఆర్ సార్ అండగా ఉంటానని హామీనివ్వడంతో ధైర్యం వచ్చింది. డబుల్ బెడ్‌రూం ఇల్లు, నా పిల్లల చదువులు కొనసాగించేందుకు అవసరమైన ఖర్చు లు భరిస్తానని కేటీఆర్ సార్ చెప్పారు. మమ్మల్ని ఆదుకున్న కేటీఆర్ సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

–వేముల కవిత, బాధితురాలు

నమస్తే తెలంగాణ

ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

పాస్‌బుక్.. పరేషాన

1.02 ఎకరాలకు పాత పాస్‌పుస్తకం ఉన్నా కొత్తది ఇస్తలేరు
తప్పుడు పత్రాలతో ఆక్రమించాలని చూస్తున్న వ్యక్తికి అధికారుల అండ
దరఖాస్తుచేసినా భూసర్వేచేయని రెవెన్యూ అధికారులు
జనగామ జిల్లా తీగారంవాసి సదానందంచారి ఆవేదన
న్యాయం కోసం ధర్మగంటను ఆశ్రయించిన బాధితుడు

కష్టపడి కొన్న భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించాలని చూస్తున్న వ్యక్తికి రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తన వద్ద భూమికి సంబంధించిన అన్ని ఆధారాలున్నాయన్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. సర్వేచేసి కొత్త పాస్‌పుస్తకం ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులే దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలంలోని తీగారం గ్రామానికి చెందిన బాధితుడు నర్సింగోజు సదానందంచారి దిక్కుతోచని స్థితిలో ధర్మగంటను ఆశ్రయించారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ

జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలంలోని తీగారం గ్రామానికి చెందిన నర్సింగోజు సోమయ్య కుమారుడు సదానందంచారికి అదే గ్రామంలోని సర్వే నంబర్ 176/బీ/2లో 1.02 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమి సదానందంచారికి తండ్రి సోమయ్య నుంచి వారసత్వంగా సంక్రమించింది. సోమయ్య తండ్రి నర్సయ్యకు సర్వే నంబర్లు 157, 176/బీ లో 7.14 ఎకరాల భూమి ఉండేది. నర్సయ్యకు ఏడుగురు కొడుకులు కాగా అందరూ సమానంగా పంచుకున్నారు. ఒక్కొక్కరికీ 1.02 ఎకరాలు వచ్చింది. అయితే సోమయ్యకు వాటా కింద 157 సర్వే నంబర్‌లోని 1.02 ఎకరాలు వచ్చింది. సోమయ్య తమ్ముడైన మల్లయ్యకు సర్వే నంబర్ 176/బీ లో 1.02 ఎకరాలు వాటాగా వచ్చింది. అయితే మల్లయ్యకు చెందిన భూమి సోమయ్య 1991లో కొనుగోలుచేశారు. సదరు భూమికి సంబంధించి సోమయ్య పేరిట రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకం కూడా మంజూరుచేశారు. పహాణీలో కూడా సోమయ్య పేరు నమోదైంది. 2018 వరకూ రికార్డుల్లో సోమయ్యే కొనసాగారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో సోమయ్య పేరిట ఉన్న పాత పాస్‌పుస్తకాన్ని రద్దుచేశారు. కొత్త పాస్‌పుస్తకం మాత్రం ఇవ్వలేదు. తమకు కొత్త పాస్‌పుస్తకం ఎందుకు ఇవ్వడంలేదని రెవెన్యూ అధికారులను బాధితుడు ప్రశ్నిస్తే సోమయ్య అన్న వెంకటయ్య సదరు భూమి తనదేనని ఆధారాలు చూపుతున్నారని సమాధానమిచ్చారు. సర్వే నంబర్ 176/బీ/2లోని 1.02 ఎకరాలను 1997లోనే సోమయ్య నుంచి వెంకటయ్య కొనుగోలు చేసినట్టు తప్పుడు పత్రాలు సృష్టించారని, వారు చూపించే ఒప్పంద పత్రంపై ఉన్నవి తమ సంతకాలు కావని బాధితుడు సదానందంచారి ఆరోపిస్తున్నారు. వెంకటయ్య చూపించే పత్రాలపై దస్తూరీ కూడా లేదని, అలాంటి తప్పుడు పత్రాలను ఆధారంగా చేసుకొని రెవెన్యూ అధికారులు తమకు కొత్త పాస్‌పుస్తకం మంజూరుచేయకపోవడం అన్యాయమని వాపోతున్నారు. అయితే సదరు భూమిని 2018లో సోమయ్య తన కుమారుడు సదానందంచారి పేరిట గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌చేశారు. ఆధారాలన్నీ ఉన్నా కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అధికారులు సర్వేచేస్తలేరు

నా భూసమస్యను పరిష్కరించాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వేచేయాలని ఇప్పటికే చాలాసార్లు దరఖాస్తు చేసుకున్న. అయినా అధికారులు కనికరించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు విడుతల రైతుబంధు నష్టపోయిన. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్తే.. భూమే లేదనడం అన్యాయం. సదరు భూమి మాదే అనడానికి నా వద్ద అన్ని ఆధారాలున్నాయి. మీసేవలో దరఖాస్తు చేసుకుందామంటే మా సర్వే నంబర్ బ్లాక్ చేశారు. ఉన్నతాధికారులు విచారణచేసి మా భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరుతున్న.

- సదానందంచారి, బాధితుడు

సర్వేచేసి పరిష్కరిస్తాం

అది అన్నదమ్ముల మధ్య సమస్య. వాళ్లు కూర్చొని మాట్లాడుకుంటామన్నారు. కుటుంబ సమస్య కాబట్టే కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా ఆపాం. వాళ్లు కూర్చొని మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకుంటే సదానందం పేరిట కొత్త పాస్‌పుస్తకం ఇస్తామని చెప్పాం. మీసేవలో దరఖాస్తు తీసుకోకుంటే మ్యానువల్‌గా దరఖాస్తు చేసుకోవాలి. తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లి, భూమిని సర్వేచేసి సమస్యను పరిష్కరిస్తాం.

- రామచందర్, తీగారం వీఆర్వో

మూడెకరాలు మాయం

- 3.02 ఎకరాలకు కొత్త పాస్‌బుక్‌లో ఎక్కింది రెండు గుంటలే
- తప్పు జరిగిందని ఒప్పుకొన్నా.. సవరణచేయని అధికారులు
- ధర్మగంటను ఆశ్రయించిన సిరిసిల్ల జిల్లా గర్జనపల్లి బాధితురాలు

అధికారుల నిర్లక్ష్యం ఓ మహిళా రైతు పాలిట శాపంగా మారింది. కొత్త పాస్‌పుస్తకం వస్తుందని, రైతుబంధు సాయంతో ఆసరా దొరుకుతుందని ఆశపడ్డ ఆమెకు నిరాశే మిగిలింది. వారసత్వంగా సక్రమించిన 3.02 ఎకరాల భూమిలో కేవలం రెండు గుంటలకు మాత్రమే పట్టా ఇచ్చిన రెవెన్యూ అధికారులు.. మిగిలింది మాయంచేశారు. 1-బీలో సవ్యంగా ఉన్నా.. పాస్‌పుస్తకంలో మాత్రం రెండు గుంటలే చేర్చారు. బాధితురాలి ఫిర్యాదుతో క్షేత్రస్థాయిలో పరిశీలనచేసిన అధికారులు పొరపాటు జరిగిందని ఒప్పుకొన్నారు. కానీ సవరణచేసి, పాస్‌బుక్ ఇవ్వండని బాధితురాలు ఎంత మొత్తుకుంటున్నా అధికారులు చెవికెక్కించుకోవడం లేదు. ఏడాది నుంచి చెప్పులరిగేలా తిరిగినా కనికరించడం లేదు సరికదా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన బాధితురాలు నాగవ్వ న్యాయం కోసం ధర్మగంటను ఆశ్రయించారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన ద్యావ రాజయ్య భార్య నాగవ్వకు గ్రామ శివారులో 3.02 ఎకరాల భూమి ఉన్నది. సర్వే నంబర్ 21/అ/బీలో రెండు గుంటలు, సర్వే నంబర్ 75/6లో 2 ఎకరాలు, 75/6/6/10లో ఎకరం.. మొత్తం 3.02 ఎకరాల భూమి ద్యావ రాజయ్య పేరిట ఉండగా, ఆయన మరణించడంతో ఆ భూమిని నాగవ్వ పేరు మీదికి బదలాయించారు. ఈ భూమిని వారసత్వపు ఆస్తిగా బదలాయిస్తూ అప్పటి ఎల్లారెడ్డిపేట మండల తాసిల్దార్ ప్రొసీడింగ్ సైతం జారీచేశారు. అయితే భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా అధికారులు 15-9-2017న ఈ 3.02 ఎకరాలను సక్రమంగా ఉన్నట్టు తేల్చి, 1-బీని సైతం అందజేశారు. అయితే 10-5-2018న నాగవ్వకు కొత్త పాస్‌పుస్తకాన్ని మంజూరుచేశారు. ఈ పాస్‌బుక్‌లో మొత్తం 3.02 ఎకరాలకుగాను.. రెండు గుంటలు మాత్రమే నమోదుచేసి, కేవలం రూ.200 రైతుబంధు చెక్కును చేతిలో పెట్టారు. దీంతో బాధితురాలు నాగవ్వ విస్తుపోయారు. చెక్కుల పంపిణీ సమయంలో అక్కడే ఉన్న తాసిల్దార్ టీ విజయలలితను ఇదే విషయంపై నాగవ్వ ప్రశ్నించగా.. రాతపూర్వకంగా దరఖాస్తుచేస్తే సరిచేస్తామని సూచించారు. సవరణ కోసం రాతపూర్వకంగా ఫిర్యాదుచేయగా, నంబర్ - 4226 రసీదును ఇచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామనిచెప్పారు. 15 రోజుల తర్వాత రెవెన్యూ అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి, పొరపాటు జరిగిందని గ్రహించి, సవరణ చేయాలని నివేదిక ఇచ్చారు. అప్పటినుంచి నాగవ్వకు కష్టాలు మొదలయ్యాయి. సవరణ చేస్తామని చెప్పిన అధికారులు ముఖం చాటేశారు. 2018 జూన్‌లో సవరణ చేస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు సవరణ చేయలేదని నాగవ్వ 'నమస్తే తెలంగాణ'తో వాపోయారు. ఏడాదిగా చెప్పులరిగేలా తిప్పుకొంటున్నారని, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందించి మిగిలిన 3 ఎకరాలను పాస్‌పుస్తకంలో ఎక్కించి, తనకు న్యాయంచేయాలని బాధితురాలు వేడుకొంటున్నారు. ఇదే విషయంపై గర్జనపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాసర్ల శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు నమస్తే తెలంగాణ ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

మా మాట!

ధర్మగంటతో రైతులకు మేలు

గతంలో రైతులు తమ సమస్యలను పరిష్కరించమని వెళ్తే ఏ అధికారి కూడా సరిగ్గా పట్టించుకునేవారు కాదు. ప్రస్తుతం భూరికార్డుల ప్రక్షాళనతోపాటు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో తాసిల్దార్ కార్యాలయానికి వెళ్తే అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. సమస్యను తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నారు. రైతులకు మేలుచేసేలా 'నమస్తే తెలంగాణ'లో ధర్మగంటను ప్రారంభించిన తర్వాత సమస్యలపై అధికారులను కలిస్తే మరింత వేగంగా స్పందిస్తున్నారు.

- నక్క శేఖర్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా

అధికారుల్లో మార్పు వచ్చింది

ఎన్నో ఏండ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా కాని పనులు ధర్మగంట ద్వారా పరిష్కారమవుతున్నాయి. సమస్యలపై కథనం ప్రచురితమవగానే బాధితులను రెవెన్యూ కార్యాలయాలకు పిలిపించుకొని మరీ రైతుల సమస్యలను తీరుస్తున్నారు. అధికారుల్లో మార్పుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకుంటున్న నిర్ణయాలు కూడా దోహదపడుతున్నాయి. పూర్తిస్థాయిలో రెవెన్యూశాఖను ప్రక్షాళన చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

- పులిజాల జ్యోతి, త్రిపురారం, నల్లగొండ జిల్లా

ఐదెకరాలు మింగేశారు!

- రెవెన్యూ యంత్రాంగం అండతో రికార్డుల్లో పేరుమార్పు
- నమ్మి పత్రాలిచ్చిపోతే ముంచిన బంధువులు
- ఏండ్లుగా విన్నవిస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో యాదాద్రి భువనగిరి జిల్లా బండసోమారం వృద్ధురాలు

అధికారుల అండతో ఐదెకరాల భూమిని అప్పనంగా మింగేశారు. కనీసం యజమానికి సమాచారం కూడా ఇవ్వకుండా అక్రమంగా రికార్డుల్లో పేరు మార్చేశారు. బతుకుదెరువు కోసం పట్నంపోతూ బంధువులపై నమ్మకంతో భద్రపర్చాలని భూపత్రాలను ఇస్తే మోసంచేశారు. రికార్డుల్లో పేర్ల మార్పుపై అధికారులను ప్రశ్నిస్తే పట్టించుకోవడంలేదని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బండసోమారం గ్రామానికి చెందిన కాల్లె కొమురమ్మ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రికార్డుల్లోకి తన పేరును ఎక్కించాలని విన్నవించినా స్పందించడంలేదని 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండం బండసోమారం గ్రామానికి చెందిన కాల్లె కొమురమ్మకు అదే గ్రామంలో సర్వే నంబర్ 15/4/అ లో 3.25 ఎకరాలు, 53 సర్వే నంబర్‌లో 15 గుంటలు, 54 సర్వే నంబర్‌లో ఒక ఎకరంతో కలిపి మొత్తం 5 ఎకరాల భూమి ఉన్నది. ఆ భూమిని 1967లో సర్వ కోటయ్య నుంచి కొమురమ్మ కొనుగోలుచేశారు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు పహాణీలోనూ కొమురమ్మ పేరును నమోదుచేశారు. ఆమె బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి నివాసముంటున్నారు. గ్రామంలో ఉన్న భూమికి సంబంధించిన పాస్‌పుస్తకం, పత్రాలను భద్రపర్చాలని వరుసకు మేనబావ అయిన కర్కి బీరప్పకు అప్పగించారు. ఇదే అదునుగా భావించిన బీరప్ప.. రెవెన్యూ అధికారుల సహకారంతో ఐదెకరాల భూమిని అక్రమంగా ఆయన పేరిట రికార్డులు మార్చుకున్నారని కొమురమ్మ ఆరోపిస్తున్నారు. బంధువని నమ్మి పత్రాలిస్తే తమకు తెలియకుండానే రికార్డుల్లో పేరు మార్చడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆ భూమి 2008-09 వరకు కాలె కొమురమ్మ పేరిట రికార్డులో ఉన్నది. 2012లో ఈసీని పరిశీలించినా కొమురమ్మ పేరే వస్తున్నది. ఐదెకరాల భూమి తన పేరిట లేదని భూప్రక్షాళన సమయంలో బయటపడింది. ఏ ఆధారం చూసి తమ భూమిని కర్కి బీరప్ప పేరిట మార్చారని రెవెన్యూ అధికారులను కొమురమ్మ ప్రశ్నిస్తున్నారు. రికార్డుల ప్రక్షాళన సమయంలో బయటపడిన ఈ సమస్యను పరిష్కరించాలని, తనపేరిట కొత్త పాస్‌బుక్ ఇవ్వాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏండ్లుగా తిరుగుతున్నా అధికారులు కనికరించడంలేదని ఆమె ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇక తిరిగే ఓపిక లేదు

ఇప్పటికే చాలాసార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగాం. ఇక తిరిగే ఓపిక లేదు. వృద్ధురాలినని కూడా చూడకుండా రికార్డులో పేరు మార్చి తిప్పలు పెట్టడం అన్యాయం. రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకపోవడంతో రెండు విడుతల రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కోల్పోయా. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సర్వే చేయించి నా భూమిని నాకు ఇప్పించాలి.

- కాల్లె కొమురమ్మ, బాధితురాలు

పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం

కొమురమ్మ సమస్యను పరిశీలిస్తాం. రికార్డులో పేరు మార్చిడి అక్రమంగా జరిగి ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరించి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరుచేస్తాం.

- వెంకటేశ్వర్లు, భువనగిరి ఆర్డీవో

ఇనాం భూములు అన్యాక్రాంతం

- వక్ఫ్‌బోర్డు తీర్పును పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన బాధితుల ఆవేదన

శక్కర్‌నగర్: నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులోని ఇనాం భూములను కొందరు అక్రమార్కులు రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై అన్యాక్రాంతం చేస్తున్నారు. బోధన్ శివారులోని వక్ఫ్‌బోర్డుకు చెందిన పలు ఇనాం భూములకు ఖాజీ ఖాజా జలాలుద్దీన్ కొన్నేండ్లపాటు పర్యవేక్షకుడిగా కొనసాగారు. అతడి మరణానంతరం ప్రభుత్వం ఆయన సోదరుడు జలీలుద్దీన్‌ను ఇనాం భూములకు పర్యవేక్షకుడిగా ఏప్రిల్4, 2006లో నియమించింది. అయితే ఈ నియామకాన్ని వ్యతిరేకిస్తూ ఖాజీ కుమారులు అన్వరుల్లా ఖాజీ, సిరాజుద్దీన్ ఖాజీ వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ కోర్టులో దావా వేశారు. వీరి వాదనలతో ఏకీభవించిన కోర్టు పర్యవేక్షకుడి నియామక ఉత్తర్వులను రద్దుచేస్తూ జూన్ 20, 2017న తీర్పు వెలువరించింది. అయినప్పటికీ జలీలుద్దీన్ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఇనాం భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని ఖాజీ ఖాజా జలాలుద్దీన్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. భూములను తమకు అప్పగించి చట్టప్రకారం పాస్‌పుస్తకాలు అందించాలని కోరుతున్నారు. ఎన్నోఏండ్లుగా ఖాజీ సర్వీసులు అందిస్తున్న తమకు అధికారులు అన్యాయం చేస్తున్నారని, ఖాజీ ఖాజా జలాలుద్దీన్ భార్య రయీసా బేగం, ఆయన కుమారులు అన్వరుల్లా ఖాజీ, సిరాజుద్దీన్ ఖాజీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన పేరుతో అందరికీ న్యాయం చేస్తుండగా, ఇనాం భూములు అన్యాక్రాంతమవుతున్న విషయంలో కొన్ని శాఖల అధికారులు సదరు వ్యక్తులకే సహకరిస్తున్నారని వారు ఆరోపించారు.

ఖాజీ ఖాజా జలాలుద్దీన్ కుటుంబీకులు

అంధుడితో రెవెన్యూ ఆట!

ఆరేండ్లుగా తిప్పించుకొంటున్న అధికారులు
భూమి ఎక్కడుందో చూపించాలని బాధితుడి వేడుకోలు
నల్లగొండ జిల్లా మునుగోడు మండలం రావిగూడెంలో
గల్లంతైన 1.28 ఎకరాల అసైన్డ్ భూమి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆయనో అంధుడు. తండ్రి ద్వారా 1.28 ఎకరాల అసైన్డ్ పట్టా భూమి అతని చేతికొచ్చింది. 1 బీ పట్టాలో స్థలమున్నది. పాస్‌పుస్తకాన్ని పిలిచి మరీ ఇచ్చారు. కానీ, స్థలం ఎక్కడుందో చూపించమంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన బాధితుడు ఆరేండ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టు తిరుగుతున్నా కనికరించడం లేదు. దీంతో బాధితుడు ధర్మగంటను ఆశ్రయించారు. బాధితుడి మాటల్లోనే.. 'నా పేరు బొంగు యాదగిరి. నాకు చిన్నప్పట్నుంచి రెండుకండ్లు కనిపించవు. రావిగూడెం మా స్వస్థలం. సర్వే నంబర్ 365లో ఎకరం 28 గుంటల భూమిని 1961లో అప్పటి తాసిల్దార్ మా నాన్నకు కేటాయించారు. అది అసైన్డ్ పట్టా భూమి. 1967- 68 వరకూ ఆ భూమిని సాగుచేశాం. ఆ తర్వాత చదువు, ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్, కరీంనగర్ జిల్లాలకు వెళ్లాం. మరుసటి ఏడాది మా నాన్న మరణించారు. ఆ భూమి నా పేరిట బదిలీ అయ్యింది. 1974లో కొత్త పాస్‌పుస్తకం ఇచ్చారు. అందులో అంతకుముందున్న 365 బదులు 366 సర్వే నంబర్‌ను పేర్కొన్నారు. 365 సర్వే నంబర్‌ను వేముల సాయిలు అనే వ్యక్తికి కేటాయించారు. మాది అసైన్డ్ భూమి కాబట్టి.. ఎవరూ కబ్జాచేయరని భావించాం. కొన్నాళ్ల తర్వాత ఆ భూమి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కొత్తగా ఇండ్లు కట్టుకున్నారు. రోడ్లు వచ్చాయి. దాంతో మా స్థలాన్ని గుర్తించలేకపోయాం. అదే విషయాన్ని స్థానిక వీఆర్వోకు చెప్పి మా స్థలాన్ని చూపెట్టమని కోరాం. అదిగో ఇదిగో అంటూ కాలయాపనచేశారు. భూమికి సంబంధించిన పత్రాలు నల్లగొండ ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయని చెప్పారు. టీపన్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. 2014 తర్వాత వీఆర్వో శ్రీనివాస్ మా భూమికి హద్దులు చూపెట్టారు. అయితే, మాకు 1.13 ఎకరాల భూమి మాత్రమే ఉన్నదని చెప్పారు. పైగా, ఆయన చూపెట్టిన స్థలంలో కొన్ని ఇండ్లు ఉన్నాయి. వారిని వెళ్లి అడిగితే.. వేముల సాయిలు అనే వ్యక్తి మాకు ప్లాట్లు విక్రయించాడని చెప్పారు. దీంతో, మేం ఖంగుతిన్నాం. 2018లో 366 సర్వే నంబర్‌లో 1.13 ఎకరాలకు సంబంధించి మాకు 1-బీ పట్టా, పాస్‌పుస్తకం ఇచ్చారు. మా స్థలం ఎక్కడుందో మాకు తెలియడం లేదు. మా సమస్యను పరిశీలించి పరిష్కరించాలని స్థానిక ఎమ్మార్వోను కోరుతున్నాం' అని విజ్ఞప్తిచేశారు.

బాధితుడు బొంగు యాదగిరి

బాధితుడికి న్యాయం చేస్తాం

1961లో కేటాయించిన భూమి కాబట్టి.. ఏ ప్రాతిపదికన సర్వే నంబర్ మారిందో ముందుగా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం డాక్యుమెంట్లన్నీ పరిశీలించాలి. మా వద్దకు బాధితులొస్తే వారితో కూలంకషంగా చర్చించి.. సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం. బాధితులకు న్యాయంచేస్తాం.

- జ్ఞానేశ్వర్‌దేవ్, తాసిల్దార్

భూమి పదిలం.. రికార్డే మాయం!

కొత్త పట్టాదారు పాస్‌పుస్తకంలో కానరాని 1.20 ఎకరాలు
సమస్యను పరిష్కరించాలని కోరుతున్న వరంగల్ రూరల్ జిల్లా రైతు కొమురయ్య

నెక్కొండ: కొందరు అధికారుల నిర్లక్ష్యంతో కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది భూ ప్రక్షాళన వ్యవహారం. అస్తవ్యస్త రెవెన్యూ రికార్డులను సరిచేసి, భూముల పత్రాలు సరిచేసి, రైతులకు ధీమాను కలిగించే ఉద్దేశంతో చేపట్టిన భూప్రక్షాళన లేని సమస్యలను సృష్టించిందంటూ బాధితులు వాపోతున్నారు. ఉన్నత ఆశయంలో ప్రభుత్వం చేపట్టిన భూప్రక్షాళన, రెవెన్యూ రికార్డుల నవీకరణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం రైతుకు కొత్త సమస్య తెచ్చిపెట్టింది. కొనుగోలు చేసిన భూమి రికార్డుల్లో పదిలంగా ఉన్నా, వారసత్వంగా వచ్చిన భూమి అధికారుల నిర్లక్ష్యంతో మాయమైపోయింది. ఫలితంగా ప్రభుత్వం అందించే రైతుబంధు సాయం రెండు పర్యాయాలు దక్కకుండాపోయింది. తన ఆధీనంలో ఏండ్ల తరబడి ఉన్న భూమికి హక్కులు కల్పించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నా పనికాకపోవడంతో ధర్మగంటను ఆశ్రయించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామానికి చెందిన సుంకరబోయిన కొమురయ్య. బాధిత రైతుకు ప్రభుత్వం 2006 సంవత్సరంలో జారీచేసిన 711 పట్టాదారు పాస్‌పుస్తకంలో సర్వే నంబర్ 494/ఏ/1/లో 1.20 ఎకరాల భూమి ఉన్నది. భూప్రక్షాళన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఖాతా నంబర్ 1772లో జారీచేసిన పట్టాదారు పాస్‌పుస్తకంలో ఆ భూమి వివరాలు మాయమయ్యాయి. సర్వే నంబర్ 412/ఏ/17లో 20 గుంటల భూమి మాత్రమే నమోదైంది. 13 ఏండ్ల కిందట పట్టా చేయించుకున్న 1.20 ఎకరాల భూమి నమోదు కాలేదు. దీనికి సంబంధించి రెండువిడుతల రైతుబంధు పథకం సాయం డబ్బులు దక్కకుండా పోయాయి. పాత పట్టాదారు పాస్‌పుస్తకాల్లోని భూములతో పాటు రైతులు కొనుగోలు చేసిన, వారసత్వ భూములును కొత్త పాస్‌పుస్తకాల్లో నమోదు చేసి అందించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉన్నది. రెవెన్యూ అధికారులు తమ భూమిని రికార్డుల్లో నమోదు చేయలేదని, ఆధారాలు చూపించినా సరిచేయడం లేదని, తాసిల్దార్లు మారుతున్నారే తప్ప సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని రైతు ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం 1.20 ఎకరాల భూమిని పట్టాదారు పాస్‌పుస్తకంలో నమోదు చేసి రైతుబంధు సాయం అందించాలని బాధిత రైతు కొమురయ్య కోరారు.

కొమురయ్య పాత పాస్‌బుక్‌లో నమోదైన 2.02 ఎకరాలు, కొత్త బుక్‌లో నమోదైన 20 గుంటలు

బాధిత రైతు కొమురయ్య

మూడు రోజుల్లో పరిష్కరిస్తాం

కొత్తగా జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకంలో భూమి వివరాలు నమోదుకాలేదని బాధిత రైతు కొమురయ్య సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. మూడురోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. భూమి వివరాలు పక్కాగా నమోదుచేసి, రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకం అందజేస్తాం.

-భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటుచేసిన చిత్రప్రదర్శనను తిలకిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్. చిత్రంలో ఆయన సతీమణి రేణుక చౌహాన్, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం కూడా ఉన్నారు.

వైబ్రంట్ సిటీగా హైదరాబాద్

- హైకోర్టు సీజే జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్
- స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ వైబ్రంట్ సిటీగా ఎదుగుతున్నదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ అన్నారు. మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటుచేసిన ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్, ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన.. చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి యువత ఇందులో పాల్గొనడం గొప్ప విషయమని, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి అయిన తాను ఇప్పుడు ఈ కార్యక్రమానికి రావటం సంతోషంగా ఉన్నదని తెలిపారు. పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. మొత్తం 680కి పైగా ఎంట్రీలు వచ్చాయని, ఎంపికచేసిన 250 చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటుచేశామన్నారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతి కింద ముగ్గురికి రూ.50 వేలు చొప్పున, తృతీయ బహుమతి కింద పదిమందికి రూ.25 వేల చొప్పున నగదు ప్రదానం చేశారు. ఈ నెల 9 వరకు ఈ ప్రదర్శన కొనసాగనున్నది. ఈ కార్యక్రమంలో జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ సతీమణి రేణుక చౌహాన్, బార్‌కౌన్సిల్ సభ్యుడు సంతోష్ రెడ్డి, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

టీఆర్ఎస్ జిల్లా కార్యాలయ భవనాల నిర్మాణానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగేందర్‌గౌడ్. చిత్రంలో ఎమ్మెల్సీలు బోడకుంటి వెంకటేశ్వర్లు, కర్నె ప్రభాకర్, ఫారూక్ హుస్సేన్, గంగాధర్‌గౌడ్ కూడా ఉన్నారు.

ఆదివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని కొత్త సార్సాల గ్రామ శివారులోని అటవీ భూములను చదును చేసేందుకు వచ్చిన అటవీశాఖ అధికారులు, సిబ్బందిని అడ్డుకొంటున్న పోడు రైతులు

ఫారెస్ట్ రేంజ్ అధికారి చోలె అనితపై దాడి చేస్తున్న కోనేరు కృష్ణారావు

స్థానిక దవాఖానలో చికిత్స పొందుతున్న ఎఫ్ఆర్వో చోలె అనిత

ఎఫ్ఆర్వోపై దాడి

అటవీ సిబ్బంది, ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్లకు గాయాలు

జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మరో 12మంది అరెస్టు

కాగజ్‌నగర్ ఘటనపై సీఎం కేసీఆర్ సీరియస్!

కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ, కాగజ్‌నగర్ టౌన్:

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కొత్తసార్సాల గ్రామ పరిధిలో అటవీభూములను చదును చేసేందుకు వచ్చిన అధికారులపై ఆదివారం పోడురైతులు దాడులకు పాల్పడ్డారు. జెడ్పీ వైస్‌చైర్మన్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు కోనేరు కృష్ణారావు తోపాటు, కొంతమంది రైతులు కర్రలతో దాడి చేయడంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) చోలె అనితకు తీవ్ర గాయాలయ్యాయి. మరి కొంతమంది అటవీ సిబ్బందితోపాటు, ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్లు గాయపడ్డారు. కాగా, దాడిలో తీవ్రంగా గాయపడిన ఎఫ్ఆర్వో చోలె అనితను హుటాహుటిన దవాఖానకు తరలించారు. పోలీసులు కోనేరు కృష్ణారావుతోపాటు, మరో 12 మందిపై కేసు నమోదుచేశారు. దాడిని అడ్డుకోలేకపోయిన కాగజ్‌నగర్ డీఎస్పీ సాంబయ్య, రూరల్ సీఐ వెంకటేశ్వర్లును ఐజీ నాగిరెడ్డి సస్పెండ్‌చేశారు. అటవీ అధికారులపై దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఘటన విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను వాకబుచేశారు. పీసీసీఎఫ్, డీజీపీతో మాట్లాడిన కేసీఆర్ బాధ్యులు ఎవరైనా కఠినచర్యలు తీసుకోవాలని, ఏ స్థాయి వ్యక్తులున్నా ఉపేక్షించవద్దని సూచించినట్టు తెలిసింది. మొత్తం ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం. పార్టీ నేతలతోనూ మాట్లాడిన కేసీఆర్ అధికారులపై జులుంను సహించేది లేదని తేల్చిచెప్పినట్టు తెలిసింది. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ అంశంపై తక్షణమే ట్విట్టర్ ద్వారా స్పందించారు. తద్వారా క్రమశిక్షణ ఉల్లంఘనల విషయంలో ఎంతటివారున్నా మినహాయింపులు ఉండబోవని పార్టీ శ్రేణులకు తేల్చిచెప్పారు. నిందితులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని, ఇప్పటికే పోలీసులు దాడిఘటనపై తగినచర్యలు తీసుకున్నారని హోంమంత్రి మహమూద్‌అలీ తెలిపారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తంచేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలే తప్ప, దాడులు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ స్పందనపై అన్నివర్గాల నుంచి అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

చదును చేసేందుకు వెళ్లి..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన అటవీభూములను భర్తీ చేయటంలో భాగంగా ప్రభుత్వం కుమ్రభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం కొత్తసార్సాల గ్రామ సమీపంలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 136, 133లో 20 హెక్టార్ల భూమిని అటవీశాఖకు కేటాయించింది. ఈ భూముల్లో మొక్కలు నాటేందుకు వీలుగా చదును చేసేందుకు ఆదివారం కాగజ్‌నగర్, పెంచికల్‌పేట అటవీరేంజ్ అధికారులు చోలె అనిత, శ్రీనివాస్‌రెడ్డి సుమారు 30 మంది సిబ్బంది, మరో 30 మంది పోలీసులతో కలిసి ట్రాక్టర్లు తీసుకొని వచ్చారు. ఈ భూములను ఇరవైఏండ్లుగా తాము సాగుచేసుకుని జీవిస్తున్నామంటూ పోడురైతులు అటవీ అధికారులను అడ్డుకున్నారు. దీంతో అటవీ అధికారులు, పోడు రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో కోనేరు కృష్ణారావు, కొందరు కర్రలతో అటవీ సిబ్బందిపై దాడులకు తెగబడ్డారు. కాగజ్‌నగర్ ఎఫ్ఆర్వో అనితపై విచక్షణారహితంగా దాడిచేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్లతో పాటు కొందరు అటవీ సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. ఎఫ్ఆర్వో అనితను కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అటవీ భూమిని చదును చేసేందుకు వెళ్లిన తమపై జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మరికొందరితో దాడిచేశారని ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. సుమారు పదిమంది తన చుట్టూ చేరి కర్రలతో కొట్టారని పేర్కొన్నారు. అటవీ అధికారులపై జరిగిన దాడికి నిరసనగా అటవీ సిబ్బంది కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ సాంబయ్యకు ఫిర్యాదుచేశారు.

దాడిని ఖండించిన ఎమ్మెల్యే కోనప్ప

అటవీ అధికారులపై పోడు రైతులు చేసిన దాడిని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఖండించారు. అటవీ అధికారులపై దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తన సోదరుడు కోనేరు కృష్ణారావు అటవీ అధికారులపై దాడి చేశాడనటం సరికాదని, కావాలనే కొంతమంది అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కొత్త సార్సాల గ్రామంలో అటవీహక్కు పత్రాలు కలిగి ఉండి కొన్నేండ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ ఫారెస్టు అధికారులు నోటీసులు జారీచేస్తున్నారని, ఈ విషయాన్ని అటవీమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అలాగే పోడు భూముల సమస్యను సీఎం కేసీఆర్ పరిష్కారం చేస్తానని తెలిపారన్నారు. ఫారెస్టు అధికారులు పోలీసుల సహాయంతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ కనీసం అడవినుంచి కట్టెలు కూడా తీసుకురాకుండా చేస్తున్నారని ఆరోపించారు.

చర్యలు తప్పవు: నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి

విధి నిర్వహణలోఉన్న అటవీశాఖ అధికారులపై దాడులకు పాల్పడినవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి అన్నారు. ఆదివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. అటవీ అధికారులపై దాడికేసు దర్యాప్తును ఆసిఫాబాద్ డీఎస్పీ సత్యనారాయణకు అప్పగించినట్టు తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడు కోనేరు కృష్ణారావు, అనుచరుడు బోరం పోశంతోపాటు 12 మందిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. దాడుల్లో పాల్గొన్న మరికొంతమందిని పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహార కార్యక్రమాన్ని ఎవరూ అడ్డుకున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సంఘటనలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన కాగజ్‌నగర్ డీఎస్పీ సాంబయ్య, రూరల్ సీఐ వెంకటేశ్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. గాయపడిన ఎఫ్ఆర్వో అనితను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించామన్నారు.

కర్రతో దాడి చేస్తున్న కోనేరు కృష్ణారావు

డీఎఫ్‌వో రాజరమణారెడ్డితో మాట్లాడుతున్న ఎస్పీ మల్లారెడ్డి, పక్కన డీఎస్పీ సాంబయ్య

ఆ భూములు అటవీ శాఖవే

కాగజ్‌నగర్ మండలంలోని కొత్త సార్సాల గ్రామం సమీపంలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 136,133 లోఉన్న 20 హెక్టార్ల భూములు అటవీశాఖకు చెందినవి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపుకు గురైన అటవీ భూములకు బదులుగా ఈ భూమిని ప్రభుత్వం అటవీశాఖకు కేటాయించింది. ఈ భూమిలో హరితహారం మొక్కలు నాటేందుకు వెళ్లిన సిబ్బందిపై జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మరికొంత మందితో కలిసి విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ సంఘటనలో ఎఫ్ఆర్వో అనితకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమె చెయ్యి విరిగింది. బాధ్యులపై చర్యలు కఠినచర్యలు తీసుకోవాలి.

–రాజరమణారెడ్డి, డీఎఫ్‌వో, కాగజ్‌నగర్

13 మందిపై కేసు నమోదు: ఎస్పీ మల్లారెడ్డి

అటవీ అధికారులపై దాడికి పాల్పడిన సంఘటనలో పోలీసులు 13మందిపై కేసు నమోదు చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావుతోపాటు, రైతు బోరంపోషంను అదుపులోకి తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ మల్లారెడ్డి తెలిపారు. కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనలో సుమారు 30 నుంచి 40 మంది వరకు పాల్గొన్నట్టు తెలిపారు. విధినిర్వహణలోఉన్న అటవీ అధికారులపై దాడికి పాల్పడటం నేరమని, దాడిలో పాల్గొన్న అందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. 55/2019, యూ/ఎస్147, 148, 307, 332, 353, 341, 427, ఆర్/డబ్ల్యూ 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, 13 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడినయువకుడిని అదుపులోకి తీసుకొంటున్న పోలీసులు

దాడిపై ఉద్యోగసంఘాల ఆగ్రహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ఆదేశాలను అమలుపర్చేందుకు వెళ్లిన అటవీ అధికారులపై దాడులకు పాల్పడటం హేయమని ఉద్యోగసంఘాలు మండిపడ్డాయి. ఓ ప్రజాప్రతినిధిగా ఉండి స్వయంగా దాడిచేయడం దారుణమని పేర్కొన్నాయి.

ప్రభుత్వఆస్తులు కాపాడుతుంటే దాడులు చేస్తున్నారు : నాగేంద్రబాబు

ప్రభుత్వ ఆస్తులను కాపాడుతుంటే అటవీ అధికారులపై దాడులు చేస్తున్నారని తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో కామారెడ్డి, కాగజ్‌నగర్ ప్రాంతాల్లో దాడులు చేసిన ఘటనలున్నాయని తెలిపారు. పోడుభూములను తీసుకోవాలని సీఎం కేసీఆర్ కూడా పలుమార్లు ప్రకటించారని, ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తుంటే ప్రజాప్రతినిధులే దాడులు చేయడం హేయనీయమన్నారు. దాడి ఘటనను సీఎస్‌కు వివరిస్తామని తెలిపారు. నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలుతీసుకోవాలని కోరారు. తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం కార్యదర్శి ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడు మొజాం అలీంఖాన్, సంయుక్త కార్యదర్శి రాజు, కోశాధికారి గోవింద్ తదితరులు దాడిని ఖండించారు.

కఠినంగా శిక్షించాలి: టీఎన్జీవో

అటవీ అధికారులపై దాడులను ఖండిస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై దాడులుచేసే వారిని కఠినంగా శిక్షించాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, ప్రతినిధులు బండారు రేచల్, శ్రీనివాసరావు, ముజీబ్, రాయకంటి ప్రతాప్, కొండాల్‌రెడ్డి, ఉమ తదితరులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులపై దాడులు జరిగితే వారిలో మానసికస్థయిర్యం దెబ్బతిని సరిగా విధులు నిర్వర్తించలేరని పేర్కొన్నారు.

దాడులను సహించేదిలేదు: టీజీవో

సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ ఆదేశాలను అమలుచేసే ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై దాడులు చేయడాన్ని సహించేది లేదని టీజీవో అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ప్రతినిధులు రవీంద్రకుమార్, ఎంబీ కృష్ణ యాదవ్, గండూరి వెంకటేశ్వర్లు, వెంకటయ్య తదితరులు అన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండి ఆటవికంగా దాడి చేశారని మండిపడ్డారు.

హరితహారాన్ని విజయవంతం చేస్తున్నారు: తెలంగాణ ఉద్యోగుల సంఘం

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అటవీఅధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారని, వారిపై దాడులు జరుగడం సరికాదని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి అన్నారు. ఉద్యోగులు నిర్భయంగా విధులు నిర్వర్తించేలా చూడాలని తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు హనుమంత్ నాయక్ కోరారు. అదేవిధంగా టీఎన్జీవో మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వర్ నాయక్, టీసీ టీజీవో అధ్యక్షుడు బీ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పర్వతాలు, టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, సెర్ప్ జేఏసీ అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు భిక్షవమ్మ, ఐసీడీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పున్నారెడ్డి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవేందర్, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌తోపాటు పలు ఉద్యోగసంఘాలు దాడిని ఖండించాయి.

వైస్‌చైర్మన్ పదవికి కృష్ణారావు రాజీనామా

అటవీ అధికారులపై దాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కోనేరు కృష్ణ జెడ్పీ వైస్‌చైర్మన్‌తోపాటు, జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులపై అటవీ అధికారులు చేస్తున్న దౌర్జన్యానికి నిరసనగా రాజీనామాచేస్తున్నట్టు ఆయన తెలిపారు.

త్వరలో చింతమడకకు సీఎం



ఆదివారం అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వెల్లడి

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ వారంరోజుల్లో సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలంలోని స్వగ్రామం చింతమడకకు రానున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, పలుశాఖల అధికారులతో చింతమడక గ్రామ అభివృద్ధి, పర్యటన ఏర్పాట్లపై ఆదివారం ఆయన సమీక్షించారు. చింతమడక సమస్యలపై అధికారులతో, గ్రామ ప్రజలతో సీఎం కేసీఆర్ సమీక్షిస్తారని, అనంతరం గ్రామస్థులందరితో కలిసి సహపంక్తి భోజనం చేస్తారని పేర్కొన్నారు.

జడ్చర్ల ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలపై చర్యలు

జడ్చర్ల రూరల్ : ఎన్నికల సమయంలో పట్టుకున్న మద్యం నిల్వల్లో వ్యత్యాసం చూపించడంతో ఇద్దరు ఎక్సైజ్ అధికారులపై ఎక్సైజ్ డీసీ జయసేనారెడ్డి చర్యలు తీసుకున్నారు. జడ్చర్ల ఎక్సైజ్ సీఐ ఖలీద్, ఎస్ఐ భద్రునాయక్‌లు అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికల విధుల్లో భాగంగా పలు ప్రాంతాలలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పట్టుబడిన మద్యాన్ని ఓ వ్యాపారితో కలిసి విక్రయించిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. 10 రోజుల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈమేరకు ఎక్సైజ్ డీసీ జయసేనారెడ్డి సీఐ ఖలీద్‌ను కమిషనరేట్‌కు సరెండర్ చేయడంతోపాటు ఎస్ఐ బద్రునాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటినుంచి జర్నలిస్టు బస్‌పాస్‌ల రెన్యువల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఆధారంగా ఇచ్చే బస్‌పాస్‌లను మళ్లీ రెన్యువల్ చేస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ తెలిపారు. జర్నలిస్టు బస్‌పాస్‌ల గడువు ఆదివారంతో ముగియగా, మరో మూడునెలలపాటు చెల్లుబాటు అయ్యేలా గడువు పెంచి రెన్యువల్ చేయనున్నట్టు చెప్పారు. ఆయా కౌంటర్ల వద్ద పాత పాస్‌లు అందజేసి కొత్తవి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

అగ్రి వర్సిటీ డిప్లొమా కోర్సులో ప్రవేశాలు

- 4 వరకు దరఖాస్తు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ 2019-20 సంవత్సరానికి డిప్లొమా ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. 880 సీట్లకు దరఖాస్తు చేసుకునేందుకు జూలై 4 తుది గడువు అని ప్రకటించింది. పదో తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్ తప్పినవారు మాత్రమే అర్హులని స్పష్టం చేసింది. పదో తరగతిలోపు గ్రామీణ ప్రాంతాల్లో చదివినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

గిరిజన యువతకు ప్రభుత్వం అండ

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- రూ.50 లక్షల వరకు పెట్టుబడి రాయితీ
- బ్యాంకు రుణం.. సాంకేతిక సహకారం
- వందమంది ఔత్సాహికులకు నైపుణ్య శిక్షణ
- 24 మంది ప్రతిపాదనలకు సంక్షేమశాఖ ఆమోదం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని గిరిజన యువత పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. గిరిజన సంక్షేమశాఖ ద్వారా సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ పథకం కింద రెండేండ్లుగా ఏటా వందమందిని గుర్తించి ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా గిరిజన యువత వ్యాపార ప్రణాళికలు తయారుచేసుకొని అభివృద్ధి చేసుకునేందుకు కావాల్సిన సామర్థ్యాలు పెంపొందించుకోవడంతోపాటు అవసరమైన ఆర్థిక వనరులను బ్యాంకులు, ఆర్థిక సహకార సంస్థల ద్వారా పొందేందుకు సహకరిస్తున్నది. దేశంలోని అత్యున్నత ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ) సాంకేతిక సహకారంతో సరికొత్త వ్యాపార అవకాశాలపై, మార్కెట్ స్థితిగతులపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి రూ.50 లక్షల వరకు రాయితీ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా గిరిజన ఆవాస ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి పెంచడంతోపాటు లాభసాటి పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు అంతర్జాతీయ సంస్థలతో గిరిజన యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

24 మంది ప్రతిపాదనలకు ఆమోదం

ముఖ్యమంత్రి ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అండ్ ఇన్నోవేషన్ పథకంలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి వందమంది గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. పరిశ్రమల స్థాపన, నిర్వహణ అంశాలపై శిక్షణ పొందినవారిలో 24 మంది అందించిన వివరణాత్మక ప్రతిపాదనలను గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఆమోదించారు. వారికి ప్రభుత్వ రాయితీలను, బ్యాంకు రుణాలను అందించనున్నారు. వ్యాపారాలు చేసుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమన్వయంతో ప్రాజెక్టు రిపోర్టులను తయారు చేయించి రాష్ట్రస్థాయి హైపవర్ కమిటీ ఆమోదానికి పంపించారు.

ఆదివారం తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఇతర దివ్యాంగులు

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

దివ్యాంగ ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పెంపు పట్ల హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దివ్యాంగ ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఇచ్చే మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం రూ. 1,25,145 లకు పెంచడం పట్ల హర్షం వ్యక్తమవుతున్నది. ఆదివారం తెలంగాణభవన్‌లో వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల తరపున సీఎం కేసీఆర్‌కు వాసుదేవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగులను సకలాంగులు పెండ్లి చేసుకుంటే ఇచ్చే వివాహ ప్రోత్సాహకాన్ని రూ.50 వేల నుంచి లక్షకు పెంచినట్టు వాసుదేవరెడ్డి గుర్తుచేశారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, భువనేశ్వర్, మున్నా, రాజేందర్, మల్లికార్జున్, కవిత, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అజేయం

ప్రాణ తర్పణాలిడ్సిన
ఫికర్ల కాలానికి
సుడిగుండాలీదిన
ముసుర్ల పయనానికి
చిగురాకులు తొంగిచూస్తున్న
నెనర్ల ఋతు ధర్మాలకి
కంచె నాటుకోవాలె...

పల్లెర్లను ఏరేసి
మల్లెమొగ్గల పేర్కుకుని
ఎత్తొమ్పుల తొవ్వలల్ల
మాటు, కాటుల మత్పరిచ్చి
పానాది దాటాలె...

రైతు కాలు పెట్టినచోట
జల సవ్వడికి
కలం నోట పలికిన
రూఢీ మాటకు
నోరెత్తే గొంతులకి కళ్ళుతెరిచే
రువ్వడి పాటకు
పునాది గట్టిగ పడాలె...

ఊరు తిరిగొచ్చిన పాలమూరును
పల్లవిస్తున్న పనీపాటల ఉషారును
విశ్వకీర్తనమౌతున్న నడత గతులను
కాపు కాసుకోవాలె...

అన్నేళ్లు ఏమొరిగిందో
డాబులేలే దగాలేలే
కొన్నేళ్ల కేమొచ్చిందో
సంపదలే సంతోషాలే
యిమరస చేసుకోవాలె...

చరిత్రలో చేరుతున్న కొత్త అధ్యాయ పాయలకు
పురాస్మృతుల అడుగుజాడల
అడుగులు తీస్తున్న పాదాలకు
వివక్షాల కక్షలకు, దాయాదుల పోరులకు
తెరదీసి, పబ్బం గడపనందుకు
గర్వంగ తలెత్తుకోవాలె...

కళలు పదారింతలై
కలల మజిలీలు పాలపుంతలై
మట్టికిచ్చిన ఒట్టు
నొక్కువడని చెల్లింపులై
గిట్లనే నడువాలె...

కనుబొమ్మలు జతపరచి
రెండు చేతుల చప్పట్లు చరచి
'మోఖా'సురులు పరారయ్యేలా
భూగోళం గిర్రున తిప్పాలె...

– దాసరాజు రామారావు, 96182 24503

రెండవ ప్రపంచయుద్ధం ముగిసింది. చైనా విప్లవోద్యమం విజయవంతమైంది. ఆఫ్రికా దేశాల్లో వలస వ్యతిరేక ఉద్యమాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ సాయుధ పోరాటయోధుల యాదితడి పచ్చిగానే ఉన్నది. నాటి విప్లవాల యుగాల అనంతర కాలంలో మన దేశంలో కించిత్తు నిరాశ నిస్పృహ వ్యాపించిన కాలం. నవభారతంలో స్వాతంత్ర్యంనాటి కలలు కల్లలై యువత నీరసించిన కాలం. అభ్యుదయ సాహిత్యోద్యమం అడుగంటిపోయింది. మానవత రెండుకళ్లు మూసుకుపోయినప్పుడు కాలం వాయులీనం మీద కమానై, చరిత్ర నిద్రా సముద్రం మీద తుపానై రాత్రి ఉదయించే రవిలా వచ్చాడు ఒక బక్కపలచనివాడు. నిండా 20 ఏండ్లు నిండని యువకుడు. 1962లో ఈ భాగ్యనగరం నడిరోడ్డు మీద అడుగుపెట్టి నాగరికత రోడ్డు మీద నగ్నంగా నిలబడ్డాడు. ఆ కవి పేరు మహాస్వప్న. అసలు పేరు కమ్మిశెట్టి వెంకటేశ్వర్‌రావు. జిల్లా ప్రకాశం, ఊరు లింగసముద్రం.

మహాకవి మెచ్చిన మహాస్వప్న

చిన్న వయస్సులోనే గొప్ప సాహితీ అభినివేశంతో కలిగిన మహాస్వప్న 'రాత్రి' కవితాసంకలనం చేసి నాటి యువ కవులనేక మంది రచనలను అందులో చేర్చాడు. ఈ సంకలనం కూడా తెలంగాణ ఆధునిక కవితా పరంపరంలో వెలువడిందని చెప్పవచ్చు. సురవరం, కాళోజీ, దాశరథి, సినారె, మాదిరాజు రంగారావు, సుప్రసన్న, పేర్వారం, కవిరాజమూర్తితో ప్రారంభమైన ఆధునిక తెలంగాణ కవిత డాడాయిజం, సర్రియలిజం, ఫార్మలిజం వంటి కవితా ఉద్యమాలను చవిచూసింది. కవిరాజమూర్తి వెలువరించిన 'మహైకే', 'మానవుడే నా సంగీతం', సినారె 'జలపాతం' అందులో భాగమే. ఈ పరంపరలో ఈ 'రాత్రి' సంకలనానికి చాలా ప్రాముఖ్యం ఉన్నది. ఒకరకంగా చెప్పాలంటే దిగంబర కవితా ఉద్యమానికి పూర్వరంగమది. అంతేకాదు వరవరరావు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజు, నెల్లుట్ల మురళీధర్‌రావు వంటి యువకవులకు చోటిచ్చిన సంకలనమది. దీనికి ఎడిటర్ శివాజీ నాయుడు. మహాస్వప్నకు బంధువు. అప్పటికి మహాస్వప్న కమ్మిశెట్టి వెంకటేశ్వరరావుగానే ఉన్నాడు. ఆయన తొలి కవితా సంకలనం 'మంచు జడులు– అగ్నిశిఖలు'. అటు తర్వాత మరికొన్ని రచనలు చేశారు. మహాస్వప్న తన సమకాలీన కవులందరి కవితలతో కూర్పుచేసిన సంకలనమిది. అప్పటికే నాటి పరిస్థితులకు తగ్గట్టుగా ఆధునిక కవిత్వం రాస్తున్న నిఖిలేశ్వర్, వరవరరావు, చెరబండరాజు, జ్వాలాముఖిలు ప్రసిద్ధిగాంచారు. అంతకుముందే నిఖిలేశ్వర్ కవిత 'కోపోద్రిక్త యువతరం' వెలువడింది. ఇంతేకాకుండా నాటి తెలుగుప్రాంతాన్నే గాక మొత్తం దేశంలో సంచలనం సృష్టించిన కవితా ఉద్యమం 'దిగంబర కవితా' రచన.అంత్య ప్రాసలతో అణగారిపోయి నిస్సారంగా మారిన తెలుగు కవితకు అంత్యక్రియలు చేసిన కవితా ఉద్యమం అది. 1966లో ప్రారంభమై మూడు కవితా సంపుటాలు వెలువడ్డాయి. ఈ ఉద్యమానికి కూడా అంతర్జాతీయ నేపథ్యం ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాలో బీట్ జనరేషన్, బ్రిటన్‌లో ఆంగ్రీ యంగ్ మెన్ కవితా ఉద్యమాలు మొదలయ్యాయి. మనదేశంలో బెంగాళీలో భూకీ పీడి, హిందీలో, మరాఠీలో కవిత్వోద్యమాలు తలెత్తాయి. దిగంబర కవిత ప్రభావంతో వెలువడిన కన్నడ కవిత 'బండాయి'.

దిగంబర కవులు కేవలం ఆరుగురే. అందరిలో చిన్నవాడు మహాస్వప్న. మిగిలిన వారిలో నిఖిలేశ్వర్ (కె.యాదవ రెడ్డి), జ్వాలాముఖి (రాఘవాచారి), నగ్నముని (మానేపల్లి కేశవరావు), చెరబండరాజు (బద్దం భాస్కర్‌రెడ్డి), భైరవయ్య (మన్‌మోహన్ సహాయ్)లు ఉన్నారు. వీరిలో అతి తక్కువ రాసిన మహాస్వప్న అబ్బురపరిచే అభివ్యక్తితో, అపురూపమైన శైలితో ఆత్మనిండా నిజాయితీతో నవ ప్రపంచ వీధుల్లోకి నగ్నంగా వెళ్లాలనుకున్నాడు. మొత్తానికి 16వ తేదీన మహాభినిష్క్రమణం చేశాడు. మొదట తన యువ స్వప్నాన్ని వాస్తవం చేద్దామనుకునే సరికి ప్రతీపశక్తుల దాడితో ఈ భాగ్యనగరిని విడిచి వెళ్లాడు. ఇప్పుడు కవి యోధులకు కొన్ని కన్నీటి చుక్కలు మిగిల్చి ఈ లోకాన్నే విడిచి వెళ్లిపోయాడు.

ఒకనాటి యువతరానికి శ్రీశ్రీ అభిమాన కవి. కానీ శ్రీశ్రీకే అభిమాన కవి మహాస్వప్న. ఈ సంగతిని శ్రీశ్రీ తన ఆత్మకథ అనంతంలో రాశాడు. మహాస్వప్నమీద ప్రేమతో రెండు కవితలను ఆంగ్లంలోకి తర్జుమా చేశాడు. ఆయన రాసిన వచన కవితను చదివి వచన కవిత అంటే ఇట్లా ఉండాలని కితాబిచ్చాడు. అప్పటికే దిగంబర కవులు మూడవ సంపుటి వెలువడింది. తిరిగి నాలుగవ సంపుటికి సమాయాత్తమవుతున్న కాలం. అంటే 1970ల కంటే ముందు రోజులు. ఏడు కవితలతో ఏడు దశాబ్దాలుగా చర్చలోకి వస్తున్న కవి గొప్ప కవితా పిపాసి మహాస్వప్న. అందరూ శ్రీశ్రీని చూడటానికి మద్రాసు వెళితే, ఆయన మాత్రం మహాస్వప్న చిరునామాను వెతుక్కుంటూ ఈ భాగ్యనగరిలో అడుగుపెట్టాడు. మహాస్వప్న ఒక చిరునామా లేని వ్యక్తి అన్న విషయం తెలుసుకొని, చివరికి దిగంబర కవులలో ఒకరిని ఆరా తీసి మహాస్వప్నను బేగంబజార్ లాడ్జీలో పట్టుకున్నాడు. అది కవిగా శ్రీశ్రీ గొప్పతనం. జీవితాంతం తెలుగు భాషను అక్షరాలను ప్రేమించిన శ్రీశ్రీ దిక్కులు పిక్కటిల్లే ధిక్కార స్వరంతో కవితా రచన చేసిన మహాస్వప్నను శ్రీశ్రీ కలవడంలో ఆశ్చర్యం లేదు. నాటి నుంచి వారిద్దరి మధ్య దోస్తానా కుదిరింది. దీనితో తెలుగు పాఠకులకు గొప్ప పుస్తకం మిగిలింది. దానిపేరు 'రెక్కవిప్పిన రెవల్యూషన్'. 1968లో ప్రపంచాన్ని కుదిపేసిన మే–68 విద్యార్థుల తిరుగుబాటును చిత్రిస్తూ వెలువడిన రచన ఇది. కరీంనగర్ నుంచి ప్రచురితమైంది. ఖైరతాబాద్ కల్లు కాంపౌండ్‌లో రికామీగా కూర్చుని శ్రీశ్రీ చెబుతుంటే మహాస్వప్న తెలుగులో రాశాడు. అంతే కాదు మొత్తం దిగంబర కవులలో ముగ్గురు తెలంగాణ కవులు. మరో ముగ్గురు ఆంధ్రలో పుట్టి హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డవారు. వర్తమాన సందర్భంలో వారి కవితా రచనను తెలంగాణ కోణంలోంచి చూస్తే చాలా తేడాలు కనిపిస్తాయి. తెలంగాణ సాయుధపోరాట నేపథ్యంతో వచ్చినందువల్ల కావచ్చు చెరబండరాజు, నిఖిలేశ్వర్, జ్వాలాముఖిల కవిత చాలా భిన్నంగా ఉన్నది. ఆంధ్రకు చెందిన ముగ్గురు కవులలో మహాస్వప్న అప్పటి సోషలిస్ట్ పార్టీ పెట్టిన 'పోరాటం' పత్రికలో పనిచేస్తున్నాడు. దీనివల్ల కావచ్చు ఆయన కవిత ఉత్తమ ప్రమాణాలతో ఉన్నది. మిగిలిన ఇద్దరు. నగ్నముని, భైరవయ్య. వీరిలో నగ్నమునిలో గొప్ప అభివ్యక్తి ఉన్నప్పటికీ జుగుప్స కలిగించే, ఆడవాళ్లను కించపరిచే ప్రతీకలు ఉండటం వల్ల స్త్రీవాదుల విమర్శకు గురైంది. భైరవయ్యలో కూడా స్వల్పంగా ఉన్నాయి. వీళ్లు పూర్తిగా కోస్తా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు. పైగా ఆధునిక రాజకీయ చైతన్యం లేనివారు. ఈ సంకలనం ప్రత్యేకత ఏమిటంటే జ్వాలాముఖి గొప్ప వచన కవితలు రాశాడు. ఆ స్థాయిలో ఇప్పటికీ తెలుగు వచన కావ్యాలు వెలువడలేదు. హైదరాబాద్ నగరం నుంచి ఉద్భవించిన గొప్ప కవితా ఉద్యమం దిగంబర కవిత్వం. ఈ కవిత్వానికి తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉన్నది. దేశంలో అనేక భాషల్లోకి తర్జుమా జరిగింది. ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషల్లోకి వెళ్లిన గొప్ప కవిత ఇది. ఇంతేకాదు తెలంగాణ 1969 ఉద్యమానికి ఈ ఉద్యమం ప్రచారంలో పెట్టిన తిరుగుబాటు భావాలే కారణం అంటారు. చిన్న వయస్సులో గొప్ప సాహిత్య కృషిచేసిన మహాస్వప్నకు నివాళి.

– సామిడి జగన్‌రెడ్డి, 8500632551

ఒకనాటి యువతరానికి శ్రీశ్రీ అభిమాన కవి. కానీ శ్రీశ్రీకే అభిమాన కవి మహాస్వప్న. ఈ సంగతిని శ్రీశ్రీ తన ఆత్మకథ అనంతంలో రాశాడు. మహాస్వప్న మీద ప్రేమతో రెండు కవితలను ఆంగ్లంలోకి తర్జుమా చేశాడు. ఆయన రాసిన వచన కవితను చదివి కలవరించి, పలవరించి వచన కవిత అంటే ఇట్లా ఉండాలని కితాబిచ్చాడు.



ఒడువని దుఃఖం

కేర్ మంటూ నేలపై పడ్డాక
మసక చూపులోనూ
దుఃఖం స్పష్టంగా కన్పిస్తోంది
మళ్ళీ చావడం కోసం పుట్టినట్లు ...!

కళ్ళల్లో స్వప్నాల కంకులను కాయిస్తే
కష్టాలు పిట్టల్లా వచ్చి ఒలుచుకుపోతుంటే
ఆనందాల ఆనవాళ్లు
భూతద్దం పెట్టి వెతుక్కోవాల్సిన పరిస్థితి

చిన్నతనం మోసుకొచ్చిన
ఆనంద ఛాయల తీపి గాయాలు తప్ప
ఏం మిగిలున్నాయని,

దుఃఖం పంచిన ఆనందం
ఆశయం పెంచిన దుఃఖం
జీవితం దుఃఖాల కూడిక
సంతోషాల తీసివేత
బాధలు భాగాహారమే
అయినా అవన్నీ
దారమేలేని దండలో ఒరుచుకొని మురిసిపోతున్నాయి
ఆనందంతో మూసిన
నా కనురెప్పల చప్పుడుకే టపీమంటాయి
ఎన్ని దుఃఖాలను మోసిన కళ్ళు నావి..

వయసు నడుస్తుంటే
ఆశయం ఆగిపోద్దా..

నడివయసు ఆశయాలు
పడమటింటి అర్రలో
శిలక్కొయ్యకు తగిలించి
చీకట్లో దేవులాడుతున్నావని
ఎద్దేవా చేస్తున్న ఎందరినో కాంచిన కళ్ళు నావి
అలాంటి దృశ్యాలన్నీ
అదృశ్యాలవ్వాలని స్వప్నాలాపన చేస్తున్న
దుఃఖస్వరం నాది

నా కళ్ళు నవ్వేది
నేను దుఃఖంలో ఉన్నప్పుడే
నన్ను చుట్టేసిన దుఃఖం
నేను వెంట తెచ్చుకున్నది కాదు
నా దుఃఖం
అగణిత మరణాలను ఆహ్వానించింది
ఆతిథ్యం స్వీకరించిన మరణాలు
ఆశీర్వదించి మంత్రించి వెళ్లాయి
వికటాట్టహాసం చేస్తూ
నాపై నర్తిస్తున్న దుఃఖ క్రీడకి
డకౌట్ అయ్యే రోజులు దగ్గర పడాలని...

దుఃఖమే మనిషిని చంపేస్తుందంటే ఎలా...
సుఖం సైతం సైతాన్‌లా నృత్యం చేస్తుంది
సుఖానికి మరోవైపే దుఃఖం
ఒడువని దుఃఖానికి మనిషే ముఖచిత్రం

మనసు అనాహతంగా దుఃఖిస్తేనే
మనిషి ఎగిరే విజయపతాకాన్ని ముద్దాడగలడు

– నామాల రవీంద్రసూరి, 9848321079

నా పల్లె యాస ఇట్లుంటది

నా పల్లె యాస
ఎట్లుంటది
జుంటితేనే తాగినట్లు
జమ్మికొమ్మ ఊగినట్లు
జోడెద్దులు దూకినట్లు
జోలపాట విన్నట్లు
ఎంత కమ్మగుంటది
నాపల్లె యాస.

సద్దకంకిపై పాలపిట్ట ఊగినట్లు
కందికొమ్మపై కందిరీగ ఆడినట్లు
రేగిపూతపై జింగన్నలాడినట్లు
నల్లరేగడిలో ఆరుద్ర నడిసినట్లు
ఎంత కమ్మగుంటది
నా పల్లెయాస.

మాదిగ ఊశన్న అలాయ్ కాడ డప్పుకొట్టినట్లు
సాకాలి నర్సింహులు కాగడ వెలిగించినట్లు
ఎరుకలి ఎంకన్న ఈతాకు సీల్చుతూ మాటాడినట్టు
తురక సాయబ్ హలాల్ జేస్తూ యాసనెత్తుకున్నట్లు
ఎంత కమ్మగుంటది
నా పల్లెయాస.

కరిగేట్లా తుమ్మనాగలి తిరిగినట్లు
వరికల్లంలా తంగేడు పొరక ఊడ్సినట్లు
మ్యాదరి సోమన్న శాట తాలొడ్లు సేరిగినట్లు
దూపేసినప్పుడు దోసిలితో నీళ్ళుదాగినట్లు
ఎంత కమ్మగుంటది
నా పల్లెయాస.

ఆశన్ననాయుడు రామభజన పాటెత్తినట్లు
మా నాయన సిత్రాంగి వేశామేసి ఆడినట్లు
గుడిసెరామన్న బ్రహ్మంగారి పద్యం పాడినట్లు
ఇద్దుం లక్ష్మన్న తాత జానపదం అందుకున్నట్లు
వడ్ల శ్రీరాములయ్య నక్కబావ కథ సెప్పినట్లు
మా అంజిగాడు ఆదాంభి పాత్రకు రాగమైనట్లు
ఎంత కమ్మగుంటది
నా పల్లెయాస.

మా పల్లె గుడికట్టకు కూసోని చెప్పే సంగతులు
పగటియాలన ఇద్దరక్కలు మాట్లాడే ముచ్చట్లు
దాపుదర్పం లేకుండా జీరగొంతు పాడేపాటలు
ఎంత కమ్మగుంటది
నా పల్లెయాస.

ఎంత కమ్మగుంటది
నా పల్లెయాస

పూనాస పూసినట్లు
పున్నమి నవ్వినట్లు
కమ్మని సుద్దులిన్నట్లు
తీయ్యటి కల్లు తాగినట్లు
గుండ్రటి మలిద ముద్దలు
కడుపు నిండగా తిన్నట్లు
ఎంత కమ్మగుంటది
నా తెలుగు భాష
నా పల్లె యాస.

– అవనిశ్రీ, 9985419424

ప్రకటనలు

ఆవిష్కరణ

డాక్టర్ శాంతినారాయణ రచించిన 'నాలుగు అస్తిత్వాలు–నాలుగు నవలికలు, నాగలకట్ట సుద్దులు' ఆవిష్కరణ సభ 2019 జూలై 5న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి మినీ హాలులో జరుగుతుంది. కె.శివారెడ్డి అధ్యక్షతన జరుగు ఈ సభలో గౌరవ అతిథులుగా నందమూరి లక్ష్మీపార్వతి, మామిడి హరికృష్ణ, డాక్టర్ మేడిపల్లి రవికుమార్, డాక్టర్ ఏకే ప్రభాకర్, గుడిపాటి హాజరవుతారు. కె.రామచంద్రమూర్తి పుస్తకాలను ఆవిష్కరిస్తారు.

- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పాలపిట్ట బుక్స్

'నానీల పయనం' ఆవిష్కరణ

మాయకుంట్ల నారాయణరెడ్డి రచించిన 'నానీల పయనం' ఆవిష్కరణ సభ 2019 జూలై 5న, 6 గంటలకు, హైదరాబాద్ త్యాగరాయగాన సభ, లలిత కళావేదికలో జరుగుతుంది. డాక్టర్ పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరుగు ఈ సభలో గౌరవ అతిథులుగా డాక్టర్ ఎన్.గోపి, కళాజనార్దన మూర్తి, కెప్టెన్ వై.ప్రభాకర్‌రెడ్డి, రమణ వెలమకన్ని, రాపోలు సీతారామరాజు హాజరవుతారు.

- డాక్టర్ పోరెడ్డి రంగయ్య, తేజ ఆర్ట్ క్రియేషన్స్ అధ్యక్షులు

కొత్త పుస్తకం

మాక్సీమ్ గోర్కీ కథలు

మానవజాతి చరిత్రలో రష్యన్ అక్టోబర్ విప్లవం ఓ మలుపు. రష్యా విప్లవ సమయంలోనూ, అనంతర కాలంలోని పరిస్థితికి గోర్కీ కథలు అద్దం పడుతాయి. ఈ కథలను చదివిన పాఠకుడు రష్యా ప్రజల జీవన పరిస్థితులను, పరిణామాలను అవగతం చేసుకోగలుగుతాడు.

- రచన: మాక్సీమ్ గోర్కీ, అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి, వెల: రూ. 150, ప్రతులకు: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ బ్రాంచీలు.

వెల్లివిరిసిన సామరస్యం

క్రీ.శ. తొలి వెయ్యి సంవత్సరాలు గడిచిన తర్వాత ఆదిశంకరులు స్థాపించిన సర్వదేవతా సమభావన క్రమంగా వెనక్కి తగ్గుతూ వచ్చింది. తమిళదేశంలో చోళరాజులు శైవపరమ్యాన్ని స్థాపిస్తూ ఇతర ధర్మాలను తిరస్కరించే ప్రయత్నం చేశారు. కానీ తెలుగుప్రాంతంలో అలాంటి పరిస్థితి లేదు. వేములవాడ ప్రాంతంలో, హనుమకొండలో జైన మతం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. అంతకుముందు ప్రహతంగా ఉన్న త్రిపురుషారాధనం స్థానంలో శివకేశవులు ప్రాధాన్యం వహించారు. వారితోపాటు స్త్రీ దేవతలందరికీ ప్రతీకగా అమ్మవారు పూజింపబడుతూ వచ్చింది. ఈ ముగ్గురితో పాటు సూర్యునికి, గణపతికి ఉచితమైన స్థానం లభించింది. సాధారణ హిందూ ప్రజలు భేద బుద్ధి లేకుండా ఈ ఐదుగురిని పంచయాతనంగా అర్చిస్తూ వచ్చారు. ఈ పంచయాతన పద్ధతి వల్ల సమాజంలో ఒక సామరస్య ధోరణి వ్యాపిస్తూ వచ్చింది. వీరశైవం తెచ్చిన బసవేశ్వరుని ఉగ్రత కాని, దక్షిణ దేశంలో చోళరాజులు అనుసరించిన పరమత అసహనం కాని తెలుగు ప్రాంతంలో కనిపించలేదు. 12వ శతాబ్దం ఆరంభంలోనే రుద్రదేవమహారాజు హనుమకొండలో త్రికూటాలయాన్ని నిర్మించారు. దీనిలో రుద్రేశ్వరుడు, వాసుదేవు డు, సూర్యదేవుడు ముగ్గురు ముఖ్యమూర్తులుగా ఉన్నా రు. ఒక్కొక్క ఆలయం వెనుక భాగంలో ఆయా దేవతల లీల విభవమూర్తులు మూడువైపుల చెక్కబడి ఉన్నాయి. రుద్రేశ్వరాలయ ద్వారతోరణం మీద తాండవం చేస్తున్న శివుడు, వాసుదేవాలయ ద్వారతోరణం మీద తాండవం చేస్తున్న నరసింహమూర్తి ఉంటుంది. సూర్యదేవాలయం ద్వారతోరణం మీద తాండవం చేస్తున్న ఇంద్రుని మూర్తి చెక్కబడి ఉన్నా యి. ప్రధాన మంటపంలో ఎన్నో అద్భుతమైన శిల్పాలను దర్శించవచ్చు. రుద్రేశ్వర ఆలయ శాసనంలో తొలి శ్లోకంలో కాకతీయుల రాజలాంఛనమైన వరాహమూర్తిని వర్ణించారు. ఆ కాలంలో అనేక రహస్య యోగ సాధనలు చేయబడుతూ ఉండేవి. పాశుపత, కాపాలిక మొదలైన మార్గాలు వ్యాప్తిలో ఉండేవి. ఇప్పుడు చూడలేం కానీ సుమారు ఇరువై సంవత్సరాల ముందు పునర్నిర్మాణం కోసం తొలిగించిన కళ్యాణ మంటపం ఇంకా పూర్తికాలేదు. దీనిలో ఒక మూలకు చిన్న స్తంభాలతో నిర్మించిన మంటపభాగం ఉండేది. దానిలో ఒక స్తంభం మీద ఒక అందమైన శిల్పం కానవచ్చేది. జఠ సమూహం పెంచుకున్న సాధకుడు ఒకవైపు, అతనికి భక్తితో ఒక బుట్టలో ఫలాలను అందిస్తున్న ఒక గణిక కనిపిస్తుంది. అయితే వీరిద్దరి కాళ్ల మధ్య ఒక కోతి, పండ్ల బుట్టపైన ఒక రామచిలుక చెక్కబడినాయి. ఈ చిత్రం ఆ సాధకుని తపోభంగాన్ని సూచించే కామాన్ని కోతి శిల్పం వల్ల తెలియజేస్తుంది. అట్లాగే రామచిలుక తనలో కలిగిన ప్రేమ భావాన్ని వ్యక్తీకరిస్తుందని మనం భావించవలసి ఉంటుంది.ఈ కథ మనం శిల్పాన్ని చూసి భావించేదే. కానీ ఏ సారూప్యత సాక్ష్యం లేదు. శిల్పి వ్యక్తిగతమైన ఎరుక కావచ్చు.

క్రీ.శ.1208 ప్రాంతంలో నిర్మించబడినది రామప్ప దేవాలయం. నేటికీ అడవిగా ఉన్న ఆ ప్రాంతం 800 ఏండ్ల కింద ట కీకారణ్యంలో ఉండి ఉంటుంది. ఈ ఆలయ ఉనికిని బట్టి శిల్పాలను బట్టి ఒకనాట్య విద్యాలయం గాను, యోగ విద్యాలయం గాను, రహస్య సాధన స్థలంగా ఆరోజుల్లో తీర్చిదిద్దబడి ఉంటుందని అర్థం అవుతుంది. ఇక్కడి శిల్పాలను బట్టి నటరాజ రామకృష్ణ గారు నూతన నాట్య పద్ధతి కనిపెట్టి ప్రచారంలోకి తెచ్చారు. అయితే ఇంకా అర్థం కావలసిన విషయాలు 'కోష్ఠ' శిల్పాలు మదనికలు ఉన్నాయి. వీటిని కేవలం సుందర స్త్రీల శిల్పాలుగానే చూస్తున్నాం. కానీ వాటి వెనుక ఉన్న రహస్యాలను మనం కనిపెట్టే ప్రయత్నం చేయటం లేదు. ఒక సుందరి పాదాల కింద పడగ విప్పిన సర్ప శిల్పం ఉన్నది. మరొక సుందరి పాదాల కింద ఆమె కొంగు పట్టి లాగుతున్న కోతి శిల్పం ఉన్నది. ఈ కోతి 'శివానంద లహరి'లో శంకరులు చెప్పిన చిత్రకపి కావచ్చు. అట్లాగే పడగ విప్పిన సర్ప శిల్పం కుండలినీ శక్తికి సంకేతము కావ చ్చు. ఇలా మదనికల శిల్పాలు నిశితంగా పరిశీలిస్తే ఏదో ఒక రహస్య సాధన విద్యకు ఈ 'కోష్ఠ' ప్రతిమలు సూచిస్తున్నాయేమో అని సందేహం కలుగుతున్నది. సుమారు అరువై సంవత్సరాల కిందట వరంగల్ బట్టల బజారులో కాకతీయు ల నాటి 'వాగ్దేవతా' విగ్రహం బయటపడింది. హనుమకొండ నయీంనగర్‌లో సగానికి విరిగిన రంగనాథస్వామి విగ్రహం, దగ్గరలోనే అన్నపూర్ణాదేవి విగ్రహం లభించాయి.

తెలంగాణలోని త్రికూటాలయాలు వివిధ సంప్రదాయాల మధ్య అన్యోన్య సామరస్యాన్ని వెల్లడిస్తున్నాయి. కరీంనగర్ నగర సమీపంలోని నగునూరులో మరొక త్రికూటాలయం వెలుగుచూసింది. దీన్ని పునర్నిర్మిస్తున్నారు. నలభై సంవత్సరాలముందు నేను, మా గురువు గారు దెందుకూరి సోమేశ్వరరావు గారు రోడ్డు మీది ఆలయాన్ని చూసి ఊరిని చూస్తూ చివరిదాకా వెళ్లాం. దారిలో ఒక ఇంటి పునాదిలో శాసన శిల కనిపించింది. అది ఇప్పుడెలా ఉందో తెలియదు. ఊరి చివర శిలగుహ ఉన్నది. దానిలో పశువులు గడ్డి మేస్తున్నాయి. ఆ గుహ వెనుక శిల భాగంలో అద్భుతమైన భైరవ ప్రతిమ ఉన్నది. మన ప్రాంతంలో 'పంచయతన' పద్ధతే కాక, కుమారస్వామిని ఆరాధించిన విధానం కనిపిస్తుంది. వరంగల్ పురావస్తు పరిశోధనశాలలో షణ్ముఖుని మూర్తి సుందరమైనది కనిపిస్తుంది. ఆ విధంగా ఆదిశంకరులు స్థాపించిన షణ్మేతములను సమానంగా ఆరాధించినట్టు తెలుస్తుంది. నన్నయభట్టు 'షడస్య' అని పేర్కొనగా, పోతన 'పుట్టం పుట్ట' అనగా, ముక్కుతిమ్మన 'కవితా ప్రావీణ్య ఫణి శ'అని, విశ్వనాథ సత్యనారాయణ 'కవిత్వ కాళోగ్ర కార్తికేయుడు' అని అన్నారు. ఈ స్తుతి పరంపర అంతా తెలుగుప్రాంతంలో వ్యాపించి ఉన్న సుబ్రహ్మణ్య ఆరాధన స్పష్టం చేస్తుంది. ఈ విధంగా తెలుగు దేశంలో శంకరుల మార్గము తాత్వికంగా అంతర్వాహిని బాహ్యంగా షణ్మత స్థాపకమై వెల్లివిరిసింది. కవిత్రయము పోతన, రాయలు, రామకృష్ణు డు, వీళ్లందరూ ఈ సమభావానికి కేతనమెత్తినవారుగా చెప్పుకోవచ్చు.

తెలంగాణలోని త్రికూటాలయాలు వివిధ సంప్రదాయాల మధ్య అన్యోన్య సామరస్యాన్ని వెల్లడిస్తున్నాయి. కరీంనగర్ నగర సమీపంలోని నగునూరులో మరొక త్రికూటాలయం వెలుగుచూసింది. దీన్ని పునర్నిర్మిస్తున్నారు. నలభై సంవత్సరాల ముందు నేను, మా గురువు గారు దెందుకూరి సోమేశ్వరరావు గారు రోడ్డు మీది ఆలయాన్ని చూసి ఊరిని చూస్తూ చివరిదాకా వెళ్లాం.

– కోవెల సుప్రసన్నాచార్య

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

మేడారం సమ్మక్క-సారక్కలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో రాష్ట్రంతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.
-తాడ్వాయి(ములుగు)

వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ నల్లగొండ జిల్లా మర్రిగూడలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగదేవమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వరద పాశాన్ని ఆలయ ఆవరణలో ఉన్న బండపై పోయగా, భక్తులు ఆరగించారు.
- నల్లగొండ కల్చరల్

వేములవాడ రాజన్న సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి కోడె మొక్కు చెల్లించుకుని, స్వామివారిని దర్శించుకొన్నారు. దాదాపు 10 వేల మందికి పైగా దర్శించుకోగా, సుమారు రూ.8 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.
- వేములవాడ కల్చరల్

విస్తారంగా వానలు

జగిత్యాల జిల్లాలో భారీగా ▪ మిగతాచోట్ల ఓ మోస్తరు..

నేడు, రేపు పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు: వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆదివారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాలో భారీగా, ఉమ్మడి వరంగల్ జిల్లా, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడ్డాయి. వానలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జగిత్యాల జిల్లాలో పలుచోట్ల ఆదివారం వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలోని మోతె రోడ్డు, టవర్ సర్కిల్, సార్గమ్మ వీధి, పోచమ్మవాడ, శివవీధి ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు పారింది. అత్యధికంగా కథలాపూర్ మండలంలో 4 సెం.మీ., జిల్లా కేంద్రంలో 3.9 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా హుజూరాబాద్ మండలంలో 16.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం చినుకులతో ప్రారంభమైన వాన రాత్రి వరకు కురిసింది. రాజన్న ఆలయ పరిసరాలు, పట్టణ ప్రధాన రహదారి, జాతర గ్రౌండ్‌తోపాటు పలు రహదారులు వరదనీటితో నిండిపోయాయి. వేములవాడ పట్టణంలో 2 సెం.మీటర్ల వర్షం పడినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు వర్షం పడింది. పెద్దపల్లిలో 0.4 మి.మీ., ఓదెలలో 4.6 మి.మీ., కాల్వశ్రీరాంపూర్‌లో 1.8 మి.మీ., వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పత్తి విత్తనాలతోపాటు వరి నార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నిజామాబాద్‌లో..

నిజామాబాద్ జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఆదివారం బాల్కొండ నియోజకవర్గంలో చిరుజల్లులు కురిశాయి. ఆర్మూర్ నియోజకవర్గంలో గంట సేపు ఓ మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లాలో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. శనివారం నుంచి మొదలైన ముసురు ఆదివారం మరింత ఊపందుకున్నది. అత్యధికంగా రామారెడ్డి మండలంలో 41.0 మి.మీటర్లు, అత్యల్పంగా దోమకొండ మండలంలో 3.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తాడూరు, బిజినేపల్లి, ఉప్పునుంతల, తెలకపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి కురిసిన వర్షానికి అక్కడక్కడ చెరువు, కుంటల్లోకి నీళ్లొచ్చాయి.

ములుగులో..

ములుగు జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వర్షం కురిసింది. చిరు జల్లులతో మొదలైన వర్షం పలుచోట్ల ఓ మోస్తరు వాన కురిసింది. వెంకటాపురం(నూగూరు), వాజేడు, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, గోవిందరావుపేట, వెంకటాపూర్, ములుగు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. వరంగల్ అర్బన్ జిల్లాలో చిరుజల్లులు కురిశాయి. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, కురవి, మహబూబాబాద్, గూడూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండ్రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జైనథ్, బేల, బోథ్, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ, ఉట్నూర్, గాదిగూడ, తాంసి, తలమడుగు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా జైనథ్‌లో 72.2. మి.మీ., బేలలో 62.2. మి.మీ., వర్షం కురవగా జిల్లా సగటు వర్షపాతం 3 సెంటీ మీటర్లు నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గుండాల, చర్ల, భద్రాచలం, దుమ్ముగూడెం, పాల్వంచ, కరకగూడెంలో ఓ మోస్తరు వర్షం కురిసింది.

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఆకునెల్లికుదురు ఎర్రకుంట చెరువులోకి చేరిన వర్షపు నీరు

జగిత్యాల జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కరీంనగర్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ మార్గంలో కారుపై కూలిన చెట్టు

నేడు, రేపు పలుజిల్లాల్లో భారీ నుంచి అతిభారీగా..

ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం ఉంది. దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో 3.1 కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. వీటి ప్రభావంతో తెలంగాణలో పలుచోట్ల భారీ వర్షాలు, అక్కడక్కడ అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి తెలిపారు.

రాగల 48 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన..

హైదరాబాద్ సిటీబ్యూరో నమస్తే తెలంగాణ: రాగల 48గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా గ్రేటర్‌లో మేఘాలు కమ్ముకున్నాయి. ఆదివారం గ్రేటర్ వ్యాప్తంగా తుంపర్లు పడ్డాయి. చల్లబడటంతో ఉష్ణోగ్రతలు సాధారణ కంటే తక్కువకు పడిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం 5.30 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 28.8డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23.2 డిగ్రీలు, గాలిలో తేమ 78 శాతంగా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

నేడు బాబ్లీకి ఎస్సారెస్పీ అధికారులు

మెండోరా: ప్రతి సంవత్సరంలాగే శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ అధికారులు మహారాష్ట్ర లోని బాబ్లీ ప్రాజెక్ట్‌కు సోమవారం వెళ్లనున్నారు. సుప్రీం కోర్టు ఆదేశానుసారం జూలై ఒకటి నుంచి అక్టోబర్ 28వరకు బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా ఎస్సారెస్పీ ఎస్ ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ రామారావ్, డీఈ జగదీశ్ బాబ్లీ గేట్ల నుంచి నీటి విడుదలకు ఉదయం అక్కడికి వెళ్లనున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి తండ్రీకొడుకులు మృతి

ముక్కెర రవీందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి (ఫైల్)

రాజాపేట: ట్రాక్టర్ బోల్తా పడి తండ్రీకొడుకులు మృతి చెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కుర్రారంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముక్కెర రవీందర్‌రెడ్డి(48) హైదరాబాద్ ఉప్పల్‌లోని శ్రీనగర్‌కాలనీలో 15 ఏండ్లుగా ఆర్ ఎంపీగా పని చేస్తూ అక్కడే జీవిస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. తన స్వగ్రామంలో ఉన్న పొలాన్ని సాగు చేసుకునేందుకు కొడుకు జీవన్ రెడ్డి(22)తో కలిసి రవీందర్‌రెడ్డి వచ్చారు. ఆదివారం ట్రాక్టర్‌తో పొలాన్ని దున్ని రోడ్డు పైకి వచ్చే క్రమంలో కల్వర్టు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తండ్రి కొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

జోరుగా సభ్యత్వాలు

- పెద్దఎత్తున స్వీకరిస్తున్న టీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు
- పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతున్నది. ఆదివారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, పార్టీ పర్యవేక్షకులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో మంత్రి ఈటల రాజేందర్ కా ర్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. వనపర్తి మండలం రాజపేట, జిల్లా కేంద్రంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మెట్‌పల్లిలోఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సభ్య త్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు టీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో టీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జెడ్పీ చైర్‌పర్స న్ వేలేటి రోజాశర్మ, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గద్వాలలో నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం అన్నాసాగర్‌లో రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా చెర్వుగట్టులో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ నూతన చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, హాలియా, పెద్దపూర, తిర్మలగిరి(సాగర్) మండలాల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సయ్య, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్, మోతె, నడిగూడెం మండలాల్లో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సభ్య త్వ న మోదును నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి పలువురికి సభ్యత్వాలు అందజేశారు. భువనగిరిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎలిమినేటి కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్ పాల్గొన్నారు. వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లో పార్టీ సభ్యత్వ న మోదును నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎం పీఆర్వో గటిక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మెట్‌పల్లిలో టీఆర్ఎస్ సభ్యత్వమందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

మహబూబ్‌నగర్ జిల్లా అన్నాసాగర్‌లో సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి

ఎన్ఆర్ఐలు, వ్యాపారులకు మంత్రులు ఎర్రబెల్లి, ఈటల సూచన

వరంగల్ అర్బన్ జిల్లా గట్ల నర్సింగాపూర్‌లో మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి, ఈటల, ఎమ్మెల్యే సతీష్, కావేరి సీడ్స్ అధినేత భాస్కరరావు

భీమదేవరపల్లి: ఎన్ఆర్ఐలు, వ్యాపారులు తెలంగాణ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వైద్యఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్‌లో కావేరి సీడ్స్ అధినేత గుండవరం భాస్కర్‌రావు, వనజ దంపతులు తమ సొంత నిధులతో నిర్మించిన ప్రభు త్వ పాఠశాల భవనం, మెగా హెల్త్‌క్యాంపును త్రిదండి చినజీయర్‌స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలు సొంత ఊరి అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. మహిళా ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదనీ మంత్రి ఈటల పేర్కొన్నారు. సామాజిక సేవలో భాగంగా భాస్కర్‌రావు పాఠశాల నిర్మించడం అభినందనీయమని చిన్నజీయర్‌స్వామి అన్నారు. కార్యక్రమంలో ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజపేటలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానంతో పోలీస్ వ్యవస్థ

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

గద్వాల,నమస్తేతెలంగాణ/వనపర్తిరూరల్: దేశంలోనే అత్యంత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పోలీస్ వ్యవస్థను తెలంగాణలో ఏర్పాటు చేశామని, దీని ద్వారా నేరస్థులను త్వరగా పట్టుకోవడంతోపాటు నేరాలను నియంత్రించడానికి అవకాశం ఏర్పడిందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రూ. కోటితో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే పోలీసుల సమస్యలు పరిష్కారమవుతున్నాయని స్పష్టం చేశారు.

'డబుల్' ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

వనపర్తి జిల్లా వనపర్తి మండలం రాజపేట, నాగవరంలో ఆదివారం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలకు మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాగవరం శివారులోని ప్రభుత్వ భూమిలో జీ ప్లస్ 1 నిర్మాణంతో 30 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రాజపేట శివారులోని ప్రభుత్వ భూమిలో 66 ఇండ్ల నిర్మాణాలను చేపట్టనున్నామని తెలిపారు.

సాంకేతిక లోపంతో కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఖమ్మం జిల్లా బోనకల్లు రైల్వేస్టేషన్‌లో ఆదివారం మూడున్నర గంటలపాటు నిలిచిపోయింది. ఉదయం 11.10 గంటలకు బోనకల్లుకు చేరుకోగా, ఎస్-2 బోగి వీల్‌యాగ్జిల్ నుంచి పొగలు రావడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. - బోనకల్లు

వరంగల్ మేయర్ గుండా ప్రకాశ్‌రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్‌గుప్తా, 'ఆవోపా' నాయకులు

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

- సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి
- ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

వరంగల్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ పాలనలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తున్నారనీ, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్నారని నిజామాబా ద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. వరంగల్ మేయర్ గుండా ప్రకాశ్‌రావుకు ఆదివారం రాత్రి వరంగల్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్‌కు వైశ్య సేవారత్న బిరుదును ప్రదానం చేసి స్వర్ణ కంకణం తొడిగారు. దక్షిణ భారతదేశంలోనే తొలి ఆర్యవైశ్య మేయర్ గుండా ప్రకాశ్‌రావు అని ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. చారిత్రక వరంగల్ నగర మేయర్‌గా ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ గుప్తా, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణగుప్తా, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా, ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్, ప్రొఫెషనల్ అసోసియేషన్) రాష్ట్ర సలహాదారులు పోకల చందర్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అసోసియేట్ డీన్‌గా సుధాకర్

బాసర: బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ సుధాకర్ మాడవేడి నియామకమయ్యారు. ప్రస్తుతం ఆయన మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అధికారిగా సతీష్, చీఫ్‌వార్డెన్లుగా మధుసూదన్, నందిని నియామకయ్యారు.

గుట్కా పట్టివేత

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ద్వారకా నగర్ కాలనీలో చింతపల్లి లింగారెడ్డి ఇంట్లో రూ.6 లక్షల విలువైన 130 బ్యాగుల గుట్కాను స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ సురేశ్ తెలిపారు. విచారణలో గుట్కా పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన అక్రమ్ అలీకి చెందినదిగా నిర్ధారించారు. లింగారెడ్డి, అక్రమ్ అలీ ఇద్దరూ కలిసి వ్యాపారం చేస్తున్నరనీ, ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

తెలంగాణ ప్రభుత్వంలోనే విద్యకు అధిక ప్రాధాన్యం దక్కుతుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా ఓదెలలోని మోడల్ స్కూల్, హాస్టల్, బీసీ హాస్టళ్లను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి మంత్రి తనిఖీ చేశారు. బోధన, భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. - ఓదెల

బాలికలపై లైంగిక దాడి

ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ: అభం శుభం తెలియని బాలికలపై ఓ ప్రబుద్ధుడు లైంగికదాకి పాల్పడిన ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటకు చెందిన నైతం జ్ఞానేశ్వర్ ఆదివారం తనకు చెల్లులు, కోడలు వరుసయ్యే 9 ఏండ్ల వయసున్న ఇద్దరు బాలికలపై లైంగిక దాడి చేశాడు. కూలీ పనులు పని చేసుకునే జ్ఞానేశ్వర్ సదరు బాలికల ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం సెలవు కావడంతో ఆరుబయట ఆడుకుంటున్న సమయంలో వారిని ఇంట్లోకి పిలిచిన జ్ఞానేశ్వర్ టీవీ సౌండ్ పెద్దగా పెట్టి, తలుపులు మూసి ఒకరి తర్వాత ఒకరిపై లైంగిక దాడి జరిపాడు. ఇదే సమయంలో జ్ఞానేశ్వర్ ఇంటికి వచ్చిన బంధువు తలుపులు తోసి ఇంట్లోకి వెళ్లగా అతన్ని చూసి పారిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన బాధితుల తల్లిదండ్రులు ఆ చిన్నారులను ఆసిఫాబాద్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు వివరించారు.

అమర్‌నాథ్ యాత్రకు బయలుదేరిన తొలి బృందం

జమ్ము: అమర్‌నాథ్ యాత్ర కోసం తొలి బృందం ఆదివారం బయలుదేరింది. దక్షిణ కశ్మీర్‌లోని హిమాలయాల్లోని మంచు శివలింగాన్ని దర్శించుకోవడానికి 2,234 మంది భక్తులు జమ్ములోని బేస్ క్యాంప్ నుంచి బయలుదేరారు. ఈ మంచు శివలింగాన్ని దర్శించుకోవడానికి ఈ ఏడాది 1.5 లక్షలకుపైగా భక్తులు దరఖాస్తు చేసుకున్నారు. సీఆర్పీఎఫ్ జమ్ము రీజియన్ ఐజీ చౌహాన్ మాట్లాడుతూ భక్తులకు యాత్ర పొడవునా పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు. యాత్రికుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమన్నారు.

జమ్ము నుంచి అమర్‌నాథ్ యాత్రకు బయలుదేరుతున్న తొలి బృందం

2,700 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

అమృత్‌సర్: పాకిస్థాన్ నుంచి భారత్‌కు తరలిస్తున్న రూ.2,700 కోట్ల విలువ జేసే 532 కిలోల హెరాయిన్‌ను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 532 కిలోల హెరాయిన్, మరో 52 కిలోల నార్కోటిక్స్‌ను సంచుల్లో నింపి లారీలో పాక్-భారత్ వాణిజ్య రహదారి గుండా కొందరు దుండగులు తరలిస్తున్నారు. ఈ లారీ అట్టారీ చెక్‌పోస్ట్ వద్దకు చేరుకోగానే తనిఖీల్లో బయట పడ్డాయి.

అఖండ భారత సంస్కృతికి ప్రతినిధిని నేను

తన కట్టు, బొట్టుపై నటి, టీఎంసీ ఎంపీ నుస్రత్ జహాన్ స్పందన

న్యూఢిల్లీ: అఖండ భారత సంస్కృతిని తాను ప్రతిబింబింపజేస్తున్నానని బెంగాల్ నటి, టీఎంసీ ఎంపీ నుస్రత్ జహాన్ తెలిపారు. లోక్‌సభకు తొలిసారి ఎన్నికైన ఆమె జూన్ 25న ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నుస్రత్ జహాన్ చీరకట్టుతోపాటు నుదిటిపై సింధూరం, చేతులకు గాజులతో అచ్చమైన హిందూ మహిళగా కనిపించారు. దీనిపై ఆగ్రహించిన ముస్లిం మత పెద్దలు ఫత్వా జారీచేశారు. ఎంపీ నుస్రత్ జహాన్ ట్విట్టర్‌లో దీటుగా బదులిచ్చారు. 'కుల, మత వివక్షలకతీతంగా అఖండ భారత సంస్కృతిని నేను ప్రతిబింబింపజేస్తున్నా. నేను ఇప్పటికీ ముస్లింగానే ఉన్నా. కానీ అన్ని మతాలను గౌరవిస్తా. నా ఆహార్యంపై వ్యాఖ్యలు చేసే హక్కు ఇతరులకు లేదు. ఆహార్యం కంటే విశ్వాసం గొప్పది. చాందసవాదుల వ్యాఖ్యలకు ప్రాధాన్యమిచ్చినా.. స్పందించినా ద్వేషం, హింసకు దారితీస్తుంది. ఇది చరిత్ర చెప్పిన సత్యం' అని ట్వీట్ చేశారు.

దేశానికి కాంగ్రెస్ పునర్జీవనం అవసరం

మోదీ 'కాంగ్రెస్ ముక్త్ భారత్' భావన దేశానికి హానికరం

ఎన్సీపీ అధినేత పవార్ వాఖ్య

ముంబై, జూన్ 30: కాంగ్రెస్ పార్టీ పునర్జీవనం దేశానికి అవసరం అని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. దీనిపై రాహుల్ గాంధీ తన సలహాను తీసుకునేందుకు అంగీకరించారని ఒక మరాఠీ జర్నలిస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవార్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి గాంధీ కుటుంబం చాలా ముఖ్యం అని, అయితే ఆ కుటుంబం కూడా తామే పార్టీ అన్నట్లు వ్యవహరించొద్దని హితవు పలికారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో తన ఎన్సీపీని విలీనం చేసే అంశంపై మాట్లాడేందుకు మరోసారి నిరాకరించారు. ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్న 'కాంగ్రెస్ ముక్త్ భారత్' భావన దేశానికి హానికరం అని పేర్కొన్నారు. పార్టీకి పునర్జీవనం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పార్టీ అసలు సిసలు సంప్రదాయాలను, విలువలను, నైతికతను ముందుకు తేవాల్సి ఉందన్నారు. దీనిపై ఏం చేయాలన్న విషయమై తాము రాహుల్ (గాంధీ)తో మాట్లాడతామని పవార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రూపులు కలిసే అవకాశాలు లేవని, అటువంటి ప్రతిపాదనేదీ లేదన్నారు. ఒకవేళ అవసరమైతే తామంతా కలిసి నడిచేందుకు సిద్ధమని చెప్పారు. ప్రస్తుతానికి అటువంటి పరిస్థితి ఉందని తాను భావించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలోని గ్రూపులు కలిసే విషమై చర్చ జరుగనే లేదన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తామంతా కలిసి పని చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ చెప్పారని, కానీ అటువంటిదేదీ జరుగదన్నారు. గాంధీ కుటుంబంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ విడదీయరాని అనుబంధం పెనవేసుకున్నదని ఆ పార్టీ నేతలు, శ్రేయోభిలాషులు చెబుతున్నారన్నారు. గాంధీ కుటుంబం మాత్రమే కాంగ్రెస్ పార్టీని కలిపి ఉంచగలదని పవార్ స్పష్టం చేశారు. గాంధీ కుటుంబం లేకుండా కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్ట సాధ్యమని చెప్పారు. కానీ గాంధీలంటేనే కాంగ్రెస్ అన్న భావనకు గాంధీ కుటుంబం రావద్దని సూచించారు.

ఇష్టారాజ్యం కుదరదు

- ప్రజాస్వామ్యమంటే ఆషామాషీకాదు..
- నీటిని పొదుపు చేయండి
- స్వచ్ఛత మాదిరే నీటి రక్షణకూ ఉద్యమం కావాలి
- మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ
- జలశక్తి శాఖ 'డేటాబేస్'కు పొదుపు సూత్రాలు పంపాలని సూచన

న్యూఢిల్లీ, జూన్ 30: ప్రజాస్వామ్యమంటే ఆషామాషీకాదని, ఇష్టం వచ్చినట్లు చేస్తామంటే కుదరదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. మరోవైపు నీటి సంరక్షణకు త్రిసూత్ర పథకాన్ని ప్రతిపాదించారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మలి విడుత ప్రధానిగా పగ్గాలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ ఆదివారం తొలిసారి 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడారు. 'ఎవరైనా మీ హక్కులను లాగేసుకుంటే తప్ప, ప్రజాస్వామ్య సుగంధం విలువ మీకు అర్థం కాదు. తినడానికి భోజనం లభించిన వాడికి ఆకలి బాధలు తెలియవు' అని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో పౌరులు ఎదుర్కొన్న ఇబ్బందులను ఆయన గుర్తుచేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో చివరి విడుత పోలింగ్‌కు ముందు కేదార్‌నాథ్ పుణ్యక్షేత్రాన్ని సందర్శించడాన్ని ప్రధాని మోదీ సమర్థించుకున్నారు. ఇది రాజకీయ యాత్ర కాదని, తన అంతరంగ ఆవిష్కరణకు తాను కల్పించుకున్న ఒక అవకాశం అని చెప్పారు. కేదార్‌నాథ్ యాత్రపై చాలా మంది రాజకీయ అర్థాలు వెతికారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందు ఫిబ్రవరిలో జరిగిన చివరి మన్‌కీ బాత్‌లోనూ తాను తిరిగి అధికారం చేపట్టనున్నానని చేసిన వ్యాఖ్యపై అది అతి విశ్వాసం అని విమర్శించారన్నారు. కానీ 'మీ విశ్వాసమే నాకు తిరిగి అధికారం అప్పగించింది' అని ప్రజలనుద్దేశించి అన్నారు. ఇటీవలి ఎన్నికల్లో 91 కోట్ల మంది ఓటర్లకు 61 కోట్ల మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని చెప్పారు. ఈ దఫా తొలితరం ఓటర్లు, మహిళలు ఎంతో ఆసక్తిగా ఓటేశారు. దీనికి తోడు పార్లమెంట్‌కు 78 మంది మహిళలు ఎన్నిక కావడం ప్రోత్సాహకరం అని చెప్పారు.

నీటి పొదుపు కోసం త్రిసూత్ర పథకం

స్వచ్ఛతా ఉద్యమం మాదిరిగా నీటి సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా నీటి పొదుపు ఉద్యమం చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇందుకోసం త్రిసూత్ర పథకం ప్రతిపాదించారు. ఉమ్మడిగా సృజనాత్మక చర్యలతో సంక్షోభాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ రంగాల ప్రముఖులతోపాటు భారతీయులంతా నీటి సంరక్షణపై అవగాహన కల్పనకు ముందుకు రావాలని కోరారు. సంప్రదాయ నీటి సంరక్షణ పద్ధతులను పరస్పరం పంచుకోవాలని ప్రజలను అభ్యర్థించారు. నీటినిల్వ, వినియోగంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జల్‌శక్తి' మంత్రిత్వశాఖ కీలక భూమిక వహించబోతుందని ప్రధాని మోదీ సంకేతాలిచ్చారు. 'నీటి సంరక్షణ కోసం పని చేసే వ్యక్తులు గానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ తమ అనుభవాలను ట్విట్టర్ హ్యాండిల్ '#జన్‌శక్తి 4 జల్‌శక్తి'లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జల్‌శక్తి శాఖ ఆధ్వర్యంలో నీటి నిల్వల కోసం అనుసరించాల్సిన పద్ధతులపై 'డేటా బేస్' ఏర్పాటు నీటి సంరక్షణతోపాటు యోగాకు ప్రాముఖ్యం ఉన్నదని ప్రధాని మోదీ చెప్పారు. భారత్‌లోనూ, విదేశాల్లోనూ ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చాలా గొప్ప ఉత్సాహం ప్రదర్శించారని అన్నారు. 'నరేంద్రమోదీ మొబైల్ యాప్' ద్వారా ప్రజలు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు.

'ఒకదేశం- ఒక రేషన్‌కార్డు'

సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం

రాష్ట్రాలపై ఆధిపత్యం కోసం మోదీ సర్కార్ ▪ యత్నాలు: డీఎంకే అధినేత స్టాలిన్

చెన్నై, జూన్ 30: పౌరులు దేశంలో ఏ రేషన్ దుకాణం నుంచైనా సరుకులు పొందేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒక దేశం, ఒక రేషన్ కార్డు' విధానాన్ని డీఎంకే తప్పుబట్టింది. ఇది సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమని డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రాష్ట్ర ప్రభుత్వాల ప్రాథమిక హక్కు. కానీ ఒక దేశం, ఒక రేషన్ కార్డు విధానాన్ని అమలు చేయడం వల్ల తలెత్తే పరిణామాలను కేంద్ర మంత్రి అర్థం చేసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను ఉల్లంఘించడమే సరైన విధానమనుకుంటే ఆ పని చేయొచ్చు. ఇటువంటి పద్ధతుల అమలు ద్వారా రాష్ట్రాలపై పెత్తనం చేయాలని కేంద్రం ప్రయత్నిస్తున్నది. సమాఖ్య వ్యవస్థను పెకిలించి వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని ప్రభుత్వం ఇటువంటి లక్ష్యాల సాధనకు ప్రయత్నిస్తున్నది' అని అన్నారు. ఏఎంఎంకే నాయకుడు టీటీవీ దినకరన్ సైతం ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. ప్రారంభ దశలోనే ఈ పథకాన్ని వ్యతిరేకించాలని అధికార అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని స్టాలిన్, దినకరన్ కోరారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు.. 'ఒక దేశం, ఒక రేషన్ కార్డు' అనే విధానాన్ని అవలంబించేందుకు వచ్చే ఏడాది జూన్ 30ని తుది గడువు విధించింది.

ఇకపై సినిమాల్లో నటించను

మత విశ్వాసాలను కాపాడేందుకే ఈ నిర్ణయం

అనూహ్యంగా ప్రకటించిన బాలీవుడ్ నటి జైరా వసీం

శ్రీనగర్: అమిర్‌ఖాన్ నటించిన 'దంగల్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి సంచలనం సృష్టించిన నటి జైరా వసీం.. ఇకపై సినిమాల్లో నటించనని తెలిపారు. తన నిర్ణయం ఆదివారం ఫేస్‌బుక్ వేదికగా ప్రకటించి సినీ పరిశ్రమను ఆశ్చర్యంలో ముంచెత్తారు. 'దంగల్'లో బాల నటిగా కెరీర్ ప్రారంభించిన జైరా వాసిమ్.. తొలి సినిమాతోనే జాతీయ అవార్డుతోపాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డునూ సొంతం చేసుకొన్నారు. తరువాతి సినిమా 'సీక్రేట్ సూపర్ స్టార్' సినిమాలోనూ తన నటవిశ్వరూపంతో విమర్శకుల అభినందనలు అందుకొన్నారు. తనకు వచ్చే పాత్రల తో తన మత విశ్వాసాల్ని కోల్పోతున్నానని, అందుకే ఇక సినిమాల్లో నటించనని ఆమె స్పష్టంచేసింది. 'బాలీవుడ్‌లో అడుగుపెట్టి ఐదేండ్లే. దంగల్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన తనకు మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. సినిమాల్లో నేను నటించే పాత్రలతో యువతకు రోల్ మోడల్‌గా నిలువాలనుకొంటున్నా. ఈ ఐదేండ్ల కెరీర్‌లో సంతృప్తిగా ఉన్నా, నిజజీవితంలో మాత్రం సంతోషంగా లేను. నాకు వస్తున్న పాత్రల వల్ల మత విశ్వాసాల్ని కోల్పోతానేమోనని భయంగా ఉంది' అని ఫేస్‌బుక్ పేజీలో వివరంగా రాసుకొచ్చింది జైరా వసీం. సినిమా ఫీల్డ్‌లో ఉంటూ నా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేనందున సినిమాల నుంచి పూర్తిగా తప్పుకోవాలని నిర్ణయించుకొన్నానని పేర్కొన్నారు.

ప్రాణ భయంతో పారిపోయిన

దుబాయ్ రాజు భార్య!

ఇద్దరు పిల్లలు, 271 కోట్లతో లండన్‌కి వెళ్లినట్టు అనుమానం

జర్మనీలో ఆశ్రయం కల్పించాలని అభ్యర్థన

లండన్: దుబాయ్ రాజు, యూఏఈ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఆరో భార్య ప్రిన్సెస్ హయా బింత్ అల్ హుస్సేన్ దుబాయ్ విడిచిపెట్టి వెళ్లారు. ఇంటినుంచి రూ.271 కోట్లతో తన ఇద్దరు పిల్లలతో రహస్యంగా ఆమె దుబాయ్ నుంచి లండన్‌కు వెళ్లిందన్న వార్తలు చర్చనీయాంశమవుతున్నాయి. ఇటీవల భర్త రషీద్‌తో విడాకులు తీసుకున్న హయా.. ఓ జర్మనీ దౌత్తవేత్త సాయంతో లండన్‌కెళ్లినట్టు తెలుస్తున్నది. దుబాయ్‌లో తన ప్రాణాలకు ముప్పు ఉందనే ఆమె ఈ పని చేసిందని, తనకు జర్మనీలో ఆశ్రయం ఇవ్వాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరినట్టు సమాచారం. దుబాయ్, జర్మనీ మధ్య దౌత్య వైరుధ్యాల నేపథ్యంలో.. తన భార్య ను తిరిగి అప్పగించాలన్న రషీద్ అభ్యర్థనను జర్మనీ తోసిపుచ్చినట్టు వార్తలొచ్చా యి. కాగా, హయా జోర్డన్ రాజుకు వరుసకు సోదరి. 2004లో రషీద్‌తో ఆమెకు పెండ్లి జరిగింది. గతేడాది షేక్ మహమ్మద్ కూతురు ప్రిన్సెస్ లతిఫా పారిపోయేందుకు యత్నించగా, ఇండియన్ కోస్ట్‌లో పట్టుకున్నారు. కూతురు మాదిరే హయా కూడా భర్త వేధింపులు తట్టుకోలేక అదే పని చేసిందని మానవ హక్కుల కార్యకర్త రాధా స్టిర్లింగ్ పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు, ఎద్దు మృతి

ముథోల్ : పంట చేనులో దుక్కిదునున్నతున్న రైతు కాడెద్దుతో సహా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడిన దుర్ఘటన నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని విఠోలి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాస రవి(29) అనే యువ రైతు కౌలుకు తీసుకున్న ఐదెకరాల్లో దుక్కి దున్నేందుకు వెళ్లాడు. ఈక్రమంలో పొలంలో ఉన్న విద్యుత్ తీగలు ఎద్దు కొమ్ములకు చుట్టుకొని కింద పడిపోయింది. ఎద్దును కాపాడే ప్రయత్నంలో రవి విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే ప్రాణాలు వదిలాడు. విద్యుత్ వైర్లను తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో దారుణం జరిగిందని రైతులు ఆరోపించారు. మృతిడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన రైతు, ఎద్దు

సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

గట్టు భీముడి మృతి తీరని లోటు

పాలమూరు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్ : బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించిన మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడి మృతి తీరని లోటని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో వాల్మీకి, బోయ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆయన సంతాప సభ నిర్వహించారు. కింది స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన భీముడి సేవలు చిరస్మరణీయం అన్నారు. తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

క్యాట్‌ఫిష్ పట్టివేత

పెనుబల్లి : అక్రమంగా క్యాట్ ఫిష్‌ను తరలిస్తున్న వ్యాన్‌ను ఆదివారం తెల్ల వారుజామున ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి వ్యాన్‌లో ఖమ్మం జిల్లా మీదుగా తరలిస్తున్నారు. ఈక్రమంలో వీఎం బంజరలో పోలీసుల తనిఖీల్లో 40 బాక్సుల్లో 900 కేజీలు క్యాట్‌ఫిష్ ఉండటంతో డ్రైవర్ మహ్మద్‌షరీఫ్‌ను అదుపులోకి తీసుకుని, వ్యానును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అప్పు ఇస్తావా.. చస్తావా!

బీహార్ బ్యాంకు మేనేజర్లకు బడా బాబుల బెదిరింపులు

మాట వింటే ముడుపులు.. లేకపోతే హత్యలు

ఇష్టారాజ్యంగా స్థానిక రాజకీయ గూండాల ఆగడాలు

పాట్నా: సాధారణంగా బ్యాంకు రుణం కోసం చాలా మంది మేనేజర్ కాళ్లావేళ్లపై పడి ప్రాధేయపడుతుంటారు. లేదా పలుకుబడి ఉపయోగించో, డబ్బులు ఎర చూపో తమ పని చేయించుకుంటారు. అయితే బీహార్‌లో పరిస్థితే వేరు. అప్పు ఇస్తావా లేక చస్తావా అని బ్యాంకు మేనేజర్లను బెదిరిస్తుంటారు. మాట వింటే సరే.. లేక పోతే అన్నంతగా వారి అంతు చూస్తారు. బీహార్‌లో గత కొన్నేళ్లుగా జరుగుతున్న బ్యాంకు మేనేజర్ల హత్యల వెనక స్థానిక బడా బాబుల హస్తమున్నదన్నది అక్కడ బహిరంగ రహస్యమే. తాజాగా గత బుధవారం లఖిసారై జిల్లాలో కెనరా బ్యాంకుకు చెందిన అసిస్టెంట్ మేనేజర్ మిలింద్ కుమార్ మాధుర్ (28) దారుణ హత్యకు గురయ్యారు. గయలో సమావేశానికి హాజరై రైలులో తిరిగి వస్తుండగా కొందరు దుండగులు మిలింద్‌పై కత్తితో దాడి చేసి పొడిచి చంపారు. ఘటన స్థలంలో డబ్బుల పర్సు, ఇతర వస్తువులు ఎక్కడవి అక్కడే ఉండటంతో ఆగంతులు చోరీ కోసం ఆయనను హత్య చేయలేదని, దీని వెనక మరో కారణం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. గత అక్టోబర్‌లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ జైవర్ధన్ మృత దేహం పక్కరాష్ట్రమైన జార్ఖండ్ హజారీబాగ్ జిల్లాలోని తెలయ్యా డ్యాంలో తేలియాడగా పోలీసులు గుర్తించారు. గత ఏడాది మే నెలలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్వాల్ బ్రాంచ్ మేనేజర్ అలోక్ చంద్రాను దుండగులు కాల్చి చంపారు. రూ.1.5 కోట్ల బ్యాంకు రుణాన్ని మళ్లించేందుకు నిరాకరించడంతో అతడిని హత్య చేసినట్లు నిందితుడు ఒకరు అంగీకరించాడు.

బ్యాంకుల్లో గూండాలదే రాజ్యం

పదేళ్ల కిందట బీహార్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక గూండా నేతలదే రాజ్యం. అంతా కలిసి వడ్డీ వ్యాపారాన్ని వ్యవస్థీకృత వ్యాపారంగా మార్చారు. దీని కోసం బ్యాంకులపై తమ పెత్తనం చూపేవారు. అధిక వడ్డీలతో పేదలను దారుణంగా దోచుకునే వారు. శాంతి భద్రతలు పాలకులకు అంతగా పట్టకపోవడంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు. దీంతో స్థానిక గూండా నేతల దృష్టంతా గ్రామీణ బ్యాంకు శాఖలపై పడింది. బ్యాంకు మేనేజర్లను నయానో భయానో చెప్పుచేతల్లో ఉంచుకుని తమ పనులు చక్కబెట్టుకునేవారు. ప్రస్తుతం స్థానిక బడాబాబుల నుంచి రాజకీయ నేతల వరకు రుణాలు ఇప్పించే దళారులుగా మారారు. లబ్దిదారులకు రుణాల ఎంపికలోనూ వారు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. అయితే గ్రామీణ బ్యాంకుల్లో పని చేసే మేనేజర్లకు కత్తిమీద సామే. ఓ వైపు పేరుకుపోతున్న బకాయిలపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి, మరోవైపు దళారులు చెప్పినట్లు రుణం మంజూరు చేసి వారు ఇచ్చినంత పుచ్చుకోవాలి లేదా దాడులకు గురికావడంతోపాటు ప్రాణాలు కూడా పోయే దారుణమైన పరిస్థితి వారిది. 2018 డిసెంబర్ 31 నాటికి బీహార్‌లో రూ.4069 కోట్లకు సంబంధించిన 5,80,408 రుణ బకాయిల కేసులు పెండింగ్‌లో ఉండటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నది.

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పని చేస్తున్నాం..

తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని బ్యాంకుల్లో పని చేస్తున్నామని బీహార్లోని పలు బ్యాంకు మేనేజర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోన్ దరఖాస్తును తిరస్కరిస్తే తమకు చావు తప్పదని వారు వాపోతున్నారు. ఇది గ్రహించే చాలా మంది బ్యాంకు మేనేజర్లు స్థానిక గూండా నేతలతో రాజీ పడుతుంటారని పాట్నా జిల్లాలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ అసలు వాస్తవాన్ని బయటపెట్టారు. 'గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి బ్యాంకు శాఖ మేనేజర్ ప్రతి ఏటా రూ.5 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేస్తారు. మధ్యవర్తులు చెప్పినట్లు చేస్తే ఎంతోకొంత ముట్టజెప్పుతారు. కాదని మెండికేస్తే కాల్చి చంపడానికి వెనుకాడరు' అని లోగుట్టును ఆయన రట్టు చేశారు.

పాలన చేరువ చేసేందుకే ఎమ్మెల్యే కార్యాలయాలు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ: రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు పరిపాలన మరింత చేరువ చేసేందుకు సీఎం కేసీఆర్ ఆలోచించి ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేశారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో నిర్మించిన మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఎమ్మెల్యే నియోజకవర్గంలోనే అందుబాటులో ఉండేలా క్యాంపు కార్యాలయాలు నిర్మిస్తున్నారన్నారు.

భారతీయ కంటైనర్ నిగమ్ లిమిటెడ్
(భారత సరకుల రవాణా, గిడ్డంగుల) రైల్ వికాస్ సంస్థ
మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఆర్థిక ఇబ్బందులను తగ్గించడం
(A Govt. Of India Undertaking, Ministry of Railways) A Navratna Company
మన్మ రైల్వే సర్వీస్ షెడ్ రోడ్డు, మారేడ్‌పల్లి, సికింద్రాబాద్, హైదరాబాద్ - 500015
CIN: L63011DL1988GOI030915
CONCOR
BSE 532343 NSE CONCOR

టెండరు ప్రకటన (కేవలం e- టెండరింగ్ పద్ధతిలో)
టెండరు నం:CON/SCR/CM/O&M/Weighbridge/SNF/2019 తేదీ: 01-07-2019
కాంకార్ ఖమ్మంలోని/డామెస్టిక్ కంటెయినర్ డిపో, సనత్‌నగర్, హైదరాబాదు, తెలంగాణ రాష్ట్రంలో కాంకార్ పాలంపేటలో 80mt సామర్థ్యంతో వెయిబ్రిడ్జి ఆపరేషన్, నిర్వహణల కొరకు సింగిల్ బిడ్ విధానంలో-ఆన్‌లైన్ టెండర్లను కాంకార్ కోరుతోంది.

అంచనా వ్యయం	రూ.39.17 లక్షలు
కాంట్రాక్ట్ కాలము	4 సంవత్సరాలు
బయానా	రూ.20,000/- e - చెల్లింపు ద్వారా
డాక్యుమెంట్ ధర	రూ.2800/- (GST తో సహా) e - చెల్లింపు ద్వారా
టెండరు ప్రాసెసింగ్ రుసుము	రూ. 5310/- (GST తో సహా) (వాపసు చేయబడదు) e - చెల్లింపు ద్వారా
అమ్మకం తేదీ (ఆన్‌లైన్)	01-07-2019, 11.00 గంటల నుండి 29-07-2019 (1500 గంటల వరకు)
టెండరు రాయుటకు ఆఖరి తేదీ & సమయం	29-07-2019, 1700 గంటల వరకు
ప్రీ-బిడ్ మీటింగ్	16.07.2019 11:30 గంటలకు పై ప్రదేశం వద్ద
e-టెండరు తెరవు తేదీ & సమయం	31-07-2019 నా11.30 గంటల కు పై ప్రదేశం వద్ద

అర్హత ప్రమాణాలు, ఇతర వివరాల కోసం www.concorindia.com, లేదా www.eprocure.gov.in లేదా www.tenderwizard.com/CCIL లో లాగాన్ చేయండి లేదా దిగువ సంకేతపదాలను సంప్రదించండి. పైపైన వివరణలు ఉంటే పై వెబ్‌సైట్‌లో మాత్రమే దాఖలుకు ఆఖరి తేదీలోగా ఉంచబడతాయి. అందుబాటు పాటుదార్లు వెబ్‌సైట్‌లను క్రమం తప్పకుండా చూడవలేను.
సం/- చీఫ్ మేనేజర్/ICD/సనత్‌నగర్

అసోంనూ వణికిస్తున్న 'మెదడువాపు'

ఇప్పటివరకు 12 మంది చిన్నారులు మృతి

గువాహటి, జూన్ 30: బీహార్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న మెదడువాపు రోగం తాజాగా అసోంను కూడా వణికిస్తున్నది. అసోంలో ఈ వ్యాధితో మరణించిన చిన్నారుల సంఖ్య 12కు చేరుకుంది. మెదడువాపు వల్ల ఆదివారం బార్పేట జిల్లాలో 15 ఏండ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. 35 పాజిటివ్ కేసులను వైద్యులు గుర్తించారు. గువాహటి మెడికల్ కాలేజీ దవాఖాన, జోర్హట్ మెడికల్ కాలేజీ దవాఖానలో పలువురు చికిత్స పొందుతున్నారు. అలాగే అసోంలోని పలు జిల్లాల్లోనూ మెదడువాపు కేసులు నమోదయ్యాయి. మరోవైపు చిన్న పిల్లల మరణాలపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని అసోంకు పంపింది. ఈ రోగాన్ని నివారించడానికి కృషి చేయడంతోప

కన్నీటి పర్యంతమైన ఛత్తీస్‌గఢ్ సీఎం

పార్టీ అధ్యక్ష బాధ్యతలు మార్క్‌మ్‌కు అప్పగింత

అధ్యక్షుడిగా జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఉద్వేగానికి గురైన బఘేల్

రాయ్‌పూర్, జూన్ 30: ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ కన్నీటి పర్యంతమయ్యారు. శనివారం రాష్ట్ర పీసీసీ అధ్యక్ష బాధ్యతలు మోహన్ మార్క్‌మ్‌కు అప్పగిస్తూ ఆయన తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. ఐదేండ్లుగా తనతో కలిసి పనిచేసిన పార్టీ నేతలకు బఘేల్ కృతజ్ఞతలు తెలియజేశారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ అధ్యక్షుడిగా వీడ్కోలు సందేశం ఇస్తూ ఒక్కసారిగా ఆయన కన్నీళ్లు పెట్టుకోవడంతో పార్టీ కార్యకర్తలు భూషేశ్ బఘేల్ జిందాబాద్, కాంగ్రెస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. సభలో కాంగ్రెస్ సీనియర్ నేత పీఎల్ పూనియా, మార్క్‌మ్ కూడా ఉన్నారు. 2013 మేలో మావోయిస్టుల దాడిలో పార్టీ అగ్రనేతలు మరణించడంతో, 2014 ఎన్నికల ముంగిట బఘేల్ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. పార్టీ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. 15 ఏండ్ల బీజేపీ పాలనకు తెరదించి గతేడాది కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీఎంగా బాధ్యతలు చేపట్టారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం పార్టీ ఘోర పరాజయం పాలయింది.

100 తగ్గిన సబ్సిడీయేతర గ్యాస్ సిలిండర్ ధర!

న్యూఢిల్లీ: సబ్సిడీయేతర వంట గ్యాస్ (ఎల్పీజీ) సిలిండర్ ధరలు తగ్గాయి. ఒక్కో సిలిండర్ పై రూ.100 తగ్గిస్తూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఆదివారం నిర్ణయం తీసుకున్నది. తగ్గిన ధరలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఢిల్లీలో సబ్సిడీయేతర వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 637 ఉంటుంది. ధరలు తగ్గకముందు సబ్సిడీయేతర వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 737.50. అంతర్జాతీయ విపణిలో సానుకూలాంశాలు, డాలర్ – రూపాయి మారకం విలువ తగ్గడంతో సిలిండర్ ధరలు తగ్గినట్టు ఐఓసీ పేర్కొంది. 'ఢిల్లీలో సబ్సిడీయేతర వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 100.50 తగ్గింది. తగ్గిన ధరలు జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయి' అని ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా సబ్సిడీ కోటా కలిగిన వాళ్లకు ఒక్కో సిలిండర్ రూ. 494.35 ఖరీదు చేస్తుందని, సబ్సిడీ రూపంలో రూ. 142.65ను ఖాతాదారు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని ఐఓసీ తెలిపింది.

ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ విధ్వంసం

రోడ్డు నిర్మాణ యంత్రాలకు నిప్పు

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడ్డారు. రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న యంత్రాలను దగ్ధం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుక్మా జిల్లాలోని ఎర్రబోరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లోద్రా అడవిలోని ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు ఇటీవల పలుసార్లు కాంట్రాక్టర్లను హెచ్చరించారు. అయినా పనులు కొనసాగిస్తున్నారు. దీంతో ఆదివారం సుమారు 30 మంది సాయుధ మావోయిస్టులు రోడ్డురోలర్, కాంక్రీట్ మిక్సర్‌లకు నిప్పంటించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలను పిలిచి రోడ్డు నిర్మాణ పనులు రాకూడదని బెదిరించి తర్వాత పరారయ్యారు. ఈ సమాచారం అందుకున్న పోలీస్ అధికారులు ఆ ప్రాంతంలో భద్రతా బలగాలను మోహరించారు.

ట్రంప్ - మోదీ భేటీ ఫలప్రదం!

ఒసాకాలో ఇరు దేశాధినేతల భేటీపై ఇవాంకా స్పందన

ఒసాకా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ఒసాకాలో జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయని ట్రంప్ కుమార్తె, అమెరికా అధ్యక్షుడి అత్యున్నత సలహాదారు ఇవాంకా పేర్కొన్నారు. ఇరుదేశాధినేతల చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని.. ఇరుదేశాల భద్రత, 5జీ, వాణిజ్య సంబంధాలతో పాటు ఎంతో కీలకమైన ఇరాన్ వ్యవహారంపైనా ఇరువురు నేతలు చర్చలు జరిపారని ఆమె వెల్లడించారు.భారత్ తమకు వ్యాపార, రక్షణ రంగాల్లో కీలక భాగస్వామి అని చెప్పారు. జపాన్ నగరం ఒసాకా వేదికగా జి-20 సదస్సుకు ట్రంప్, మోదీ సహా పలు దేశాధినేతలు హాజరైన సంగతి తెలిసిందే. 'జి-20 సదస్సులో భారత ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని అబేలు అమెరికా అధ్యక్షునితో భేటీ అయ్యారు. 5జీ సాంకేతికత, దాని భద్రతా పరిమితులపై వాళ్ళు చర్చించారు' అని ఇవాంకా ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇరాన్ తాజా పరిస్థితుల నుంచి దేశాల భద్రత వరకూ అన్ని అంశాలు ఈ భేటీలో ట్రంప్, మోదీ చర్చకు వచ్చాయని ఆమె అన్నారు. ట్రంప్‌తో భేటీ గురించి ప్రధాని మోదీ మాట్లాడుతూ.. సాంకేతిక వినియోగం, రక్షణ, భద్రతా సంబంధాలను మెరుగుపరుచుకోవడం, వాణిజ్యపరమైన సమస్యలను పరిష్కరించుకోవడంలో ఈ చర్చలు సాయపడ్డాయని అన్నారు.

ఉత్తర కొరియా భూభాగంలోకి అడుగుపెడుతున్న ట్రంప్

ఉత్తర కొరియాలో అడుగుపెట్టిన ట్రంప్

- మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిగా రికార్డు
- నిస్సైనిక ప్రాంతంలో సమావేశమైన ట్రంప్, కిమ్
- గంటసేపు చర్చించుకున్న ఇరు దేశాధినేతలు
- ఉత్తరకొరియా అణునిరాయుధీకరణ దిశగా మరో ముందడుగు
- వైట్‌హౌస్‌కు రావాలని కిమ్‌ను ఆహ్వానించిన ట్రంప్

పన్మున్‌జోన్, జూన్ 30: సంచలనాలకు మారుపేరైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రత్యేకతను చాటుకున్నారు. ఆదివారం ఉత్తరకొరియాలో అడుగుపెట్టారు. ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్‌ఉన్‌తో జరిగిన భేటీలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తద్వారా ఉత్తరకొరియాలో అడుగుపెట్టిన తొలి అమెరికా అధ్యక్షుడిగా చరిత్ర సృష్టించారు. కిమ్‌ను వైట్‌హౌస్‌కు రావాలని కూడా ఆహ్వానించారు. ట్రంప్ వెంట దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ కూడా ఉండటం మరో విశేషం. జపాన్‌లో జీ-20 సదస్సు నుంచి శనివారం తిరిగి వస్తూ ట్రంప్ చేసిన ట్వీట్‌తో ఈ చారిత్రాత్మక పర్యటనకు మార్గం ఏర్పడింది. 'నేను దక్షిణ కొరియాకు (ఆ దేశాధ్యక్షుడు మూన్‌తో కలిసి) వెళ్తున్నా. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ నన్ను కలుసుకోవాలని భావిస్తే సరిహద్దుల్లో డీ మిలిటరైజ్డ్ జోన్(డీఎంజెడ్) వరకు వెళ్లి కలుస్తా. షేక్‌హ్యాండ్ ఇచ్చి హలో చెప్తా' అని ట్రంప్ ట్వీట్ చేశారు. దీంతో 'డీఎంజెడ్' వద్ద ట్రంప్-కిమ్ భేటీకి ఏర్పాట్లు జరిగాయి.

కిమ్ సామ్రాజ్యంలోకి ట్రంప్

ఆదివారం ట్రంప్ దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌తో కలిసి డీఎంజెడ్ వద్దకు చేరుకున్నారు. మొదట సరిహద్దు రేఖపై ట్రంప్-కిమ్ కలుసుకున్నారు. ఇద్దరూ షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు. ఆ తర్వాత కిమ్‌తో కలిసి ట్రంప్ ఉత్తర కొరియా భూభాగంలోకి అడుగుపెట్టి కొంత దూరం నడిచి వెళ్లారు. మరోసారి షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. 'ఉత్తరకొరియాలోకి అడుగుపెట్టాలని నన్ను ఆహ్వానించడాన్ని గౌరవంగా భావిస్తున్నా. సరిహద్దు దాటడం గర్వంగా ఉన్నది' అని కిమ్‌తో ట్రంప్ అన్నారు. తర్వాత వారు దక్షిణ కొరియావైపు వెళ్లారు. అక్కడ ట్రంప్-కిమ్-మూన్ కాసేపు మాట్లాడుకున్నారు. ఈ ముగ్గురు దేశాధినేతలు ఒకేచోట కలువడం ఇదే తొలిసారి. ఆ తర్వాత అక్కడే ఉన్న 'ఫ్రీడం హౌస్' అనే భవనంలో ట్రంప్-కిమ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు గంట సేపు ఏకాంత చర్చలు జరిపారు. ఈ భేటీలో అమెరికా ఆంక్షల తొలిగింపు, ఉత్తరకొరియా అణు నిరాయుధీకరణ తదితర అంశాలపై చర్చించినట్టు సమాచారం. తర్వాత ఇద్దరూ మీడియా తో మాట్లాడారు. ట్రంప్ మాట్లాడుతూ ఇది ప్రపంచానికి ఒక అద్భుతమైన రోజని అభివర్ణించారు. తాను ఇక్కడ ఉండటం గౌరవంగా భావిస్తున్నానన్నారు. 'చర్చలు అద్భుతంగా జరిగాయి. ఇక పలు గొప్ప మార్పులు కలుగబోతున్నాయి' అని చెప్పారు. తమ మధ్య జరిగిన చర్చల ఆధారంగా ప్రణాళిక రూపొందించడానికి, ఉత్తర కొరియా అణు నిరాయుధీకరణపై తమ మధ్య గతంలో నిలిచిపోయిన చర్చలను కొనసాగించడానికి ఇరు దేశాలు ఒక్కో బృందాన్ని నియమించాలని నిర్ణయించామన్నారు. కిమ్‌ను అమెరికాకు ఆహ్వానించానని, ఆయన ఎప్పుడైనా వైట్‌హౌస్‌కు రావొచ్చని ట్రంప్ చెప్పారు. అది సరైన సమయంలో కార్యరూపం దాల్చుతుందన్నారు. కిమ్ మాట్లాడుతూ.. డీఎంజెడ్ దగ్గర కలువాలన్న ట్రంప్ ఆహ్వానంతో తాను ఆశ్చర్యపోయానన్నారు. తమ మధ్య భేదాభిప్రాయాలను పక్కనబెట్టి సరికొత్త భవిష్యత్ కోసం అడుగులు వేయాలన్న ట్రంప్ తపనకు ఇది నిదర్శనమని కొనియాడారు. ఉత్తర-దక్షిణ కొరియాల విభజనకు గుర్తుగా ఉన్న ఈ ప్రాంతంలో శాంతి స్థాపన భేటీ జరిగిందని పేర్కొన్నారు. ట్రంప్ తమ రాజధాని ప్యాంగ్‌యాంగ్‌కు వస్తే గొప్ప గౌరవంగా భావిస్తానని ఆహ్వానించారు.

డీఎంజెడ్‌లోని ఫ్రీడమ్ హౌస్‌లో భేటీ అయిన కిమ్, ట్రంప్

ఉద్రిక్తతల నుంచి స్నేహం వైపు..

నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర కొరియా అణ్వాయుధాలు తయారుచేస్తున్నదంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో ఆంక్షలు విధించడంతో రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత ట్రంప్-కిమ్ ఒకరినొకరు దూషించుకున్నారు. ఉత్తర కొరియా సరిహద్దుకు సమీపంలోకి అమెరికా యుద్ధ నౌకలు చేరడంతో యుద్ధవాతావరణం నెలకొన్నది. అవసరమైతే అణ్వాయుధాలు ప్రయోగిస్తామని ఇద్దరూ ప్రకటించడంతో ప్రపంచం మొత్తం చిగురుటాకులా వణికింది. అయితే దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ చొరవతో పరిస్థితిలో మార్పు వచ్చింది. దక్షిణ కొరియాలో గత ఏడాది జరిగిన శీతాకాల ఒలంపిక్స్ వేదికగా కిమ్‌కు స్నేహహస్తాన్ని అందించారు. మూన్ చొరవ ఫలితంగా మొట్టమొదటిసారిగా ట్రంప్-కిమ్ గత ఏడాది సింగపూర్‌లో భేటీ అయ్యారు. అయితే అణు నిరాయుధీకరణపై స్పష్టత రాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వియత్నాంలో రెండోసారి భేటీ అయ్యారు. అణ్వాయుధాలను నిర్వీర్యం చేస్తేనే ఆంక్షలు తొలిగిస్తామని అమెరికా స్పష్టం చేయడంతో భేటీ అర్ధాంతరంగా ముగిసింది. ఆ తర్వాత ఉత్తరకొరియా మళ్లీ అమెరికాపై విమర్శలు చేయడంతో వాతావరణం కాస్త వేడెక్కింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ చొరవ తీసుకోవడం, ట్రంప్-కిమ్ పలు అంశాలపై ఒకరికొకరు లేఖలు రాసుకోవడంతో మూడో సమావేశం సాధ్యమైంది. అమెరికా-ఉత్తరకొరియా మధ్య స్నేహం దిశగా అడుగులు పడుతున్నాయి.

ఏమిటీ డీఎంజెడ్?

డీఎంజెడ్.. డీ మిలిటరైజ్డ్ జోన్ (నిస్సైనిక ప్రాంతం).. ట్రంప్-కిమ్ భేటీతో మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఇది ఉభయ కొరియాల మధ్య గల అధికారిక సరిహద్దు. 1950-53 మధ్య కొరియా యుద్ధం జరిగిన ప్రాంతం. డీఎంజెడ్ పొడవు 248 కి.మీ.లు, వెడల్పు నాలుగు కి.మీ.లు. దీన్ని భూమిపై ఉండే భయానక ప్రదేశమని పిలుస్తుంటారు. ఏ క్షణాన్నైనా యుద్ధానికి సన్నద్ధమయ్యేలా ఏర్పాట్లు ఉంటాయి. డీఎంజెడ్‌కు ఇరువైపులా లక్షల మంది సైనికులు కాపలా కాస్తుంటారు. ప్రపంచంలోనే అత్యధికంగా సైనికులు కాపలా కాస్తున్న సరిహద్దుగా దీనికి పేరుంది. ఎప్పుడూ యుద్ధ ట్యాంకులు, క్షిపణులు మోహరించి ఉంటాయి. వందల సంఖ్యలో గార్డ్‌పోస్ట్‌లుంటాయి. డీఎంజెడ్‌లో దాదాపు 20 లక్షల మందుపాతరలున్నట్టు అంచనా. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో ఎవరికీ సరిగా తెలియదు. ఆంక్షలు, పేదరికాన్ని తట్టుకోలేక డీఎంజెడ్ ద్వారా దక్షిణ కొరియాకు పారిపోయేందుకు ప్రయత్నించే పౌరులను ఉత్తరకొరియా సైనికులు కాల్చిపడేస్తారు. కొన్నాళ్లుగా పరిస్థితి మారింది. గతేడాది నుంచి ఉభయకొరియాల అధ్యక్షులు మూన్-కిమ్ మధ్య తరుచూ చర్చలు జరుగడంతో సానుకూల వాతావరణం ఏర్పడింది. వారిద్దరి మధ్య పలు ఒప్పందాలు జరిగాయి. ఈ మేరకు వేల మంది సైనికులను సరిహద్దు నుంచి ఉపసంహరించుకున్నారు. కొన్ని గార్డ్‌కోస్ట్‌లను ధ్వంసం చేశారు. పలు మందుపాతరలను నిర్వీర్యం చేశారు. సరిహద్దులో సైనికుల శిక్షణ కార్యక్రమాలను నిలిపివేశారు.

భారత సంతతి సెనెటర్ కమలా హ్యారిస్‌పై

జాతి వివక్ష వ్యాఖ్యలు

మద్దతు పలుకుతూ రీట్వీట్ చేసిన ట్రంప్ కుమారుడు

వాషింగ్టన్, జూన్ 30: 2020 అమెరికా ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరుపున అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ఉన్న కమలా హ్యారిస్‌పై ఆన్‌లైన్ వేదికగా వ్యక్తమైన జాతి వివక్ష పూరిత వ్యాఖ్యలు కలకలం సృష్టిస్తున్నాయి. హ్యారిస్ అమెరికాకు చెందిన నల్ల జాతీయురాలు కాదని ఓ అమెరికా జాతీయుడు చేసిన ట్వీట్ వివాదాస్పదమైంది. డెమొక్రటిక్ పార్టీ తరుపున కాలిఫోర్నియా సెనెటర్‌గా ఉన్న కమలా హ్యారిస్ అమెరికాలో పుట్టారు. ఈమె తల్లి ఇండియన్. తండ్రి జమైకా దేశవాసి. భారతీయ మూలాలున్న తొలి సెనెటర్‌గా ఈమె గుర్తింపు తెచ్చుకొన్నారు. కాగా.. 'కమలా హ్యారిస్ అమెరికా నల్లజాతీయురాలు కాదు. ఆమె సగం ఇండియన్. సగం జమైకా దేశీయురాలు' అని ఓ అమెరికా నల్ల జాతీయుడు గురువారం ట్వీట్ చేశాడు. తమ జాతి (అమెరికన్ నల్ల జాతీయులు) పేరు చెప్పుకుని మమ్మల్ని ఇలాంటి వాళ్ళు (కమలా హ్యారిస్) దోచుకుంటున్నారని తీవ్రంగా విమర్శించాడు. ఈ ట్వీట్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ రీట్వీట్ చేశారు. 'ఇది నిజమేనా? వావ్' అంటూ తనను అనుసరిస్తున్న 30 లక్షల మంది ఫాలోవర్స్‌ను ప్రశ్నించారు. ఆయన ట్వీట్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో ఆ ట్వీట్‌ను జూనియర్ ట్రంప్ తొలగించారు. గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా జాతి వివక్ష వ్యాఖ్యలను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రిపబ్లికన్ల నుంచి ఇలాంటి విమర్శలు ఎక్కువగా ఎదురయ్యాయి. ఒబామా అమెరికా జాతీయుడు కాదని, కావున అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి ఆయనకు అర్హతలేదని ట్రంప్ అన్నారు.

ఖండించిన డెమొక్రటిక్ పార్టీ నేతలు

డెమొక్రటిక్ పార్టీ కాలిఫోర్నియా సెనెటర్ కమలా హ్యారిస్‌పై సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న జాతి వివక్ష వ్యాఖ్యలను ఆ పార్టీ నేతలు ఖండించారు. 'ఈ వ్యాఖ్యలు ఎంతో క్రూరమైనవి. ప్రతీ ఒక్కరూ దీనికి వ్యతిరేకంగా స్పందించాలి' అని హ్యారిస్ ప్రతినిధి లిల్లీ ఆడమ్స్ అన్నారు. హ్యారిస్‌పై జాతి వివక్ష దాడులు ఎంతో వికారమైనవని మరో సెనేటర్ ఎలిజిబెత్ వారెన్ అన్నారు.

పుంజుకుంటున్న 'నైరుతి'!

అల్పపీడన ప్రభావంతో ఈ వారంలో విస్తారంగా వర్షాలు

జూన్‌లో 33 శాతం లోటు వర్షపాతం

భారత వాతావరణ విభాగం వెల్లడి

ఆదివారం కురిసిన భారీ వర్షాలకు బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో జలమయమైన రహదారులు

న్యూఢిల్లీ, జూన్ 30: ముప్పై మూడు శాతం వర్షపాత లోటుతో జూన్ నెల ముగిసింది. మొత్తంగా జూన్‌లో 78 శాతం భూభాగంలో లోటు వర్షపాతం నమోదైందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ఈ వారం నుంచి నైరుతి రుతపవనాలు పుంజుకునే అవకాశం ఉందని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఒడిశా, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలతో పాటు మధ్య భారతదేశ వ్యాప్తంగా మెండుగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అదనపు డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. అయితే ఈ అల్పపీడనం కారణంగా ఢిల్లీ, పంజాబ్, హర్యానా తదితర ఉత్తరభారత రాష్ట్రాలకు మాత్రం వర్షాలకు ఆస్కారం లేదని చెప్పారు. ప్రైవేట్ వాతావరణ అధ్యయన సంస్థ స్కైమెట్ మేనేజింగ్ డైరెక్టర్ జతిన్ సింగ్ మాట్లాడుతూ.. జూన్ 30 నుంచి జూలై 15 మధ్య రుతుపవనాలు చురుగ్గా ఉంటాయని తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఉత్తర తెలంగాణ, దక్షిణ మధ్యప్రదేశ్, విదర్భ, మధ్య మహారాష్ట్ర, నైరుతి మధ్యప్రదేశ్, దక్షిణ రాజస్థాన్, గుజరాత్‌లలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని చెప్పారు. దేశంలో నైరుతి రుతపవనాల సీజన్ జూన్ 1 మొదలై సెప్టెంబర్ 30తో ముగుస్తుంది. వాస్తవానికి జూన్ 30 నాటికి ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశమంతటా రుతుపవనాలు విస్తరిస్తాయి. అయితే ఇవి ఇంకా ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్‌కు విస్తరించాల్సి ఉంది. 36 వాతావరణ సబ్ డివిజన్లకుగానూ 28 సబ్‌డివిజన్లలో లోటు వర్షపాతం నమోదైంది. రెండు సబ్ డివిజన్లలో అత్యధిక లోటు వర్షపాతం రికార్డు కాగా, ఐదు సబ్ డివిజన్లలో (కొంకన్ అండ్ గోవా, జమ్ము కశ్మీర్, నార్త్ ఇంటీరియర్ కర్నాటక, ఉత్తర రాజస్థాన్, గుజరాత్) మాత్రమే సాధారణ వర్షపాతం కురిసింది. ఈ ఏడాది సాధారణం కంటే వారం ఆలస్యంగా జూన్ 8న నైరుతి రుతపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. వాయు తుఫాన్ కారణంగా రుతుపవనాలు వారానికి పైగా ముందుకు సాగలేదు. గడచిన 24 గంటల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురిశాయి.

ఢిల్లీలో వేసవి సెలవులు వారం పొడిగింపు

దేశ రాజధాని ఢిల్లీలో వడగాల్పులు ప్రభావం కారణంగా 8వ తరగతి వరకు వేసవి సెలవులను వారం పాటు పొడిగిస్తూ ఢిల్లీ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 8వ తరగతి లోపు విద్యార్థులకు జూలై 8న తరగతులు ప్రారంభమవుతాయి. ఆ పై తరగతులకు మాత్రం ముందుగా నిర్ణయించిన మేరకు సోమవారం నుంచి తరగతులు మొదలవుతాయి. ప్రభుత్వ బడులతోపాటు ప్రైవేట్ పాఠశాలలకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా స్పష్టం చేశారు.

భూగర్భ జల వాడకం

17 రాష్ట్రాల్లో అధికం

న్యూఢిల్లీ: దేశంలో 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం అధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అలాగే దేశంలోని 253 యూనిట్లలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని పేర్కొంది. భూగర్భ జలాల పరిస్థితిపై ఇటీవల లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానమిచ్చింది. 2013 లెక్కల ప్రకారం.. దేశంలోని 6,584 యూనిట్లలో (మండలం, తాలుకా, బ్లాక్ స్థాయిల్లో) భూగర్భ జలాల పరిస్థితిపై కేంద్ర జల బోర్డు అధ్యయనం జరిపిందని, ఇందులో 16 శాతం అనగా దాదాపు 1,034 యూనిట్లలో భూగర్భ జలాల వినియోగం అధికంగా ఉన్నదని ప్రభుత్వం తెలిపింది. 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 1,034 యూనిట్లలో అందుబాటులో ఉన్న భూగర్భజలాల కన్నా అధికంగా వినియోగించారని పేర్కొంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే దాదాపు 681 యూనిట్లు అత్యల్ప ప్రమాదకర క్యాటగిరీలో, 253 యూనిట్లు ప్రమాదకర క్యాటగిరీలో, 4,520 యూనిట్లు సురక్షిత క్యాటగిరీలో ఉన్నాయని తెలిపింది. మొత్తం 6,584 యూనిట్లలోని ఒక్కశాతం యూనిట్లు ఉప్పునీరుతో నిండి ఉన్నాయని వెల్లడించింది. భూగర్భ జలాల అధిక వినియోగంలో 76 శాతంతో పంజాబ్ తొలిస్థానంలో ఉన్నదని, తర్వాత స్థానాల్లో రాజస్థాన్ (66%), ఢిల్లీ (56%), హర్యానా (54%) ఉన్నాయని తెలిపింది. భూగర్భ జలాల అధిక వినియోగం లేని రాష్ట్రాల జాబితాలో పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్, త్రిపుర, ఒడిశా, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, మణిపూర్, జమ్ముకశ్మీర్ నిలిచాయని పేర్కొంది. ఇక భూగర్భ జలాలు సురక్షితం జాబితాలో అరుణాచల్‌ప్రదేశ్, అసోం, గోవా, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, అండమాన్ నికోబార్, చండీగఢ్, దాద్రానగర్ హవేలీ ఉన్నాయని కేంద్రం వెల్లడించింది.

బ్యాట్‌తో దాడి చేసిన ఎమ్మెల్యేకు బెయిల్

జైలువద్ద ఘనంగా స్వాగతం పలికిన బీజేపీ నేతలు

ఆకాశ్ విడుదల సందర్భంగా ఇండోర్‌లో బీజేపీ కార్యకర్తల సంబరాలు

ఇండోర్, జూన్ 30: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఓ అధికారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన ఘటనలో అరెస్టైన బీజేపీ ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్‌వర్గియా ఆదివారం బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ్‌వర్గియా కుమారుడైన ఆకాశ్‌కు ఆయన కుటుంబ సభ్యులతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జైలు నుంచి పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆకాశ్‌ను పూల దండలతో ముంచెత్తడంతోపాటు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబురాలు జరిపారు. ఆకాశ్‌కు చెందిన ఓ వీరాభిమాని తుపాకీతో గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మరోవైపు అధికారిపై బ్యాట్‌తో దాడి చేసిన తన చర్యను ఆకాశ్ విజయ్‌వర్గియా సమర్థించుకున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రజల కోసం నేను చేసిన పనికి ఎలాంటి పశ్చాత్తాపం, సిగ్గుపడటం లేదు. నేను చాలా బాధ్యతతో చాలా ఆలోచించే ఆ పని చేశాను. ఒక మహిళను పోలీసుల ముందే దారుణంగా లాగిపడేశారు. దీంతో నాకు ఏమి చేయాలో తోచలేదు. ఒకవేళ నేను అలా ప్రవర్తించకపోతే ఆ మహిళ గౌరవంతో పాటు ఆమె ఇల్లు ఐదు నిమిషాల్లో పోయేవి. ప్రజల కోసమే మేం పని చేస్తాం. మా జీవితంలోని ప్రతి క్షణాన్ని ఈ దేశ ప్రజల శాంతి, అభివృద్ధి కోసం అంకితం చేస్తాం. దాన్ని అలాగే కొనసాగిస్తాం. నాకు మరోసారి బ్యాటు పట్టుకునే అవకాశం రానివ్వవద్దని దేవుడ్ని ప్రార్థిస్తున్నా..' అని ఆకాశ్ విజయ్‌వర్గియా అన్నారు. ఇండోర్ అసెంబ్లీ స్థానం నుంచి తొలిసారి గెలిచిన ఆయన, బుధవారం ఓ అక్రమ నిర్మాణ భవనాన్ని తొలగించేందుకు ప్రయత్నించిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన సంగతి తెలిసిందే.

ఎన్డీయే పాలనలో పెరిగిన ఇంధన ధరలు

కాంగ్రెస్ పార్టీ విమర్శలు

న్యూఢిల్లీ, జూన్ 30: పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ విమర్శించింది. జూన్ 22న ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.69.93 కాగా 30వ తేదీ నాటికి ఇది రూ.70.40కి పెరిగిందని తెలిపింది. డీజిల్ లీటర్ ధర 63.78 నుంచి రూ.64.22కు చేరుకుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఇలా రోజురోజుకు ఇంధన ధరలను పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నదని విమర్శించింది. అలాగే కేరళలో 2018లో సంభవించిన వరదల తర్వాత తేయాకు ఉత్పత్తి 120 లక్షల టన్నులకు పడిపోయిందని, రబ్బరు

పాయింట్ల పట్టిక

స్థానం	జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే.	ర.రే	పా
1. ✔	ఆస్ట్రేలియా	8	7	1	0	+1.00	14
2.	భారత్	7	5	1	1	+0.85	11
3.	న్యూజిలాండ్	8	5	2	1	+0.57	11
4.	ఇంగ్లండ్	8	5	3	0	+1.00	10
5.	పాకిస్థాన్	8	4	3	1	-0.79	9
6.	బంగ్లాదేశ్	7	3	3	1	-0.13	7
7.	శ్రీలంక	7	2	3	2	-1.18	6
8.	దక్షిణాఫ్రికా	8	2	5	1	-0.08	5
9.	వెస్టిండీస్	7	1	5	1	-0.32	3
10.	ఆఫ్ఘనిస్థాన్	8	0	8	0	-1.41	0

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు, ✔- అర్హత

వరల్డ్‌కప్‌లో నేడు | శ్రీలంక X వెస్టిండీస్ - 3 గం. | స్టార్ స్పోర్ట్స్‌లో | అత్యధిక పరుగులు 516 వార్నర్ (ఆస్ట్రేలియా) | అత్యధిక వికెట్లు 24 స్టార్క్ (ఆస్ట్రేలియా)

టీమ్‌ఇండియా

జైత్రయాత్రకు బ్రేక్

బెయిర్‌స్టో (111)

ప్రపంచకప్‌లో భారత్ తొలి ఓటమి

31 పరుగులతో నెగ్గిన ఇంగ్లండ్ ▪ సెమీస్ ఆశలు సజీవం

మెరిసిన బెయిర్‌స్టో, స్టోక్స్ ▪ షమీ, రోహిత్ పోరాటం వృథా

రోహిత్ (102)

ఆతిథ్య హోదా, భారీ హిట్టర్లు.. అంతకుమించి అంచనాలు.. వీటన్నింటిని మోస్తున్న ఇంగ్లండ్ ఎట్టకేలకు జూలు విదిల్చింది. గత ఐదు మ్యాచ్‌ల్లో ఈ పిచ్‌పై ఛేజింగ్ చేసిన జట్టే గెలిచినా.. మోర్గాన్ మాత్రం మొదటి బ్యాటింగ్‌కే మొగ్గుచూపాడు. పరుగుల దాహంతో ఉన్న ఓపెనర్లు జాసన్ రాయ్, జానీ బెయిర్‌స్టో విజృంభిస్తే.. గత రెండు మ్యాచ్‌ల్లో చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడినా.. జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయిన స్టోక్స్ స్కోరుకు రాకెట్ వేగాన్ని అందించాడు. మోత మోగిస్తాడనుకున్న మోర్గాన్ పెద్దగా ప్రభావం చూపలేకపోయినా.. ఉన్నంత సేపు బట్లర్ చెడుగుడాడేసుకున్నాడు. దీంతో భారత్ ముందు రికార్డు స్థాయి లక్ష్యం నిలిచింది.

రోహిత్, రాహుల్, కోహ్లీ, పంత్, పాండ్యా, ధోనీ, జాదవ్‌తో కూడిన లైనప్‌కు ఇదేమంత పెద్ద స్కోరు కాదనిపించినా.. రాహుల్ ఆరంభంలో చేతులెత్తేశాడు. కెప్టెన్, వైస్ కెప్టెన్ ఉన్నంతసేపు మొగ్గు మనవైపే ఉన్నా.. ఆ తర్వాత సాధించాల్సిన రన్‌రేట్ మరీ ఎక్కువవడంతో టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. భారత్‌తో పాటు పాకిస్థాన్ అభిమానులు ప్రార్థించినా దేవుడు కరుణించలేదు. ప్రపంచకప్ ఆరంభానికి ముందు హాట్‌ఫేవరెట్‌గా కనిపించినా.. మూడు ఓటములతో డీలాపడ్డ ఇంగ్లండ్ ఎట్టకేలకు చక్కటి ఆటతో సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకొని పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంకకు కొత్త తలనొప్పి తెచ్చిపెట్టింది.

బర్మింగ్‌హామ్:

సెమీస్ రేసులో నిలువాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ అదరగొట్టింది. మొదట బ్యాట్స్‌మెన్ సమిష్టిగా కదం తొక్కడంతో భారీ స్కోరు చేసిన ఇంగ్లిష్ జట్టు ఆ తర్వాత బౌలింగ్‌లోనూ రాణించి కీలక విజయం సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 31 పరుగుల తేడాతో నెగ్గి భారత్‌కు టోర్నీలో తొలి ఓటమిని రుచిచూపించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 337 పరుగులు చేసింది. బెయిర్‌స్టో (109 బంతుల్లో 111; 10 ఫోర్లు, 6 సిక్సర్లు) ప్రపంచకప్‌లో తొలి శతకంతో అదరగొట్టగా.. బెన్ స్టోక్స్ (54 బంతుల్లో 79; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), జాసన్ రాయ్ (57 బంతుల్లో 66; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విజృంభించిన మొహమ్మద్ షమీ (5/59) ఐదు వికెట్లు ఖాతాలో వేసుకోగా.. బుమ్రా (1/44) పొదుపుగా బౌలింగ్ చేశాడు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 306 పరుగులకు పరిమితమైంది. రోహిత్ శర్మ (109 బంతుల్లో 102; 15 ఫోర్లు) ఈ టోర్నీలో మూడో సెంచరీ నమోదు చేసుకోగా.. విరాట్ కోహ్లీ (76 బంతుల్లో 66; 7 ఫోర్లు) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ప్లంకెట్ 3, వోక్స్ 2 వికెట్లు పడగొట్టారు. బెయిర్‌స్టోకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో భారత్ మంగళవారం శ్రీలంకతో తలపడనుంది.

కోహ్లీ (66)

రికార్డు ఛేదనలో రాణించలేక..

ప్రపంచకప్ చరిత్రలోనే తమ అత్యధిక పరుగుల ఛేదన కోసం బరిలో దిగిన భారత్‌కు అందుకు తగ్గ ఆరంభం లభించలేదు. మూడో ఓవర్‌లోనే రాహుల్ (0) ఔటయ్యాడు. వోక్స్ వరుసగా తొలి మూడు ఓవర్లు మెయిడెన్‌లు వేయడంతో పరుగుల రాక గగనమైంది. ఆ తర్వాత కాస్త జోరు పెంచిన కోహ్లీ 59 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. మరోవైపు రోహిత్ కూడా బ్యాట్‌కు పనిచెప్తూ 65 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ దాటాడు. అర్ధశతకం తర్వాత జోరు పెంచిన హిట్‌మ్యాన్.. స్టోక్స్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో రెచ్చిపోయాడు. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు విరాట్ వికెట్ రూపంలో పెద్ద షాక్ తగిలింది. ప్రపంచకప్‌లో వరుసగా ఐదు అర్ధశతకాలు సాధించిన కోహ్లీ ఈ సారి సెంచరీ చేస్తాడానుకున్నా అది సాధ్యపడలేదు. ప్లంకెట్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటై పెవిలియన్ బాట పట్టాడు. ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న యువ సంచలనం రిషబ్ పంత్ (29 బంతుల్లో 32; 4 ఫోర్లు) ఆరంభంలో తడబడ్డాడు. అయితే రోహిత్ శర్మ 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న కాసేపటికే ఔట్ కావడం భారత్ అవకాశాలను దెబ్బతీసింది. కాసేపటికే పంత్ కూడా పెవిలియన్ బాటపట్టాడు. పాండ్యా (33 బంతుల్లో 45; 4 ఫోర్లు), ధోనీ (31 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే పరిమితమైంది.

రాత మార్చిన ఓపెనర్లు..

గత రెండు మ్యాచ్‌ల్లో టార్గెట్ ఛేజింగ్‌లో తీవ్రంగా ఇబ్బంది పడ్డ ఇంగ్లండ్‌కు.. ఓపెనర్ జాసన్ రాయ్ జట్టులో చేరడం బలం చేకూర్చింది. ఆరంభం నుంచి రాయ్, బెయిర్‌స్టో సాధికారికంగా ఆడటంతో అలవోకగా పరుగులు వచ్చాయి. ఫలితంగా పవర్‌ప్లే ముగిసేసరికి ఇంగ్లండ్ వికెట్ నష్టపోకుండా 47 పరుగులు చేసింది. చేంజ్ బౌలర్‌గా వచ్చిన చహల్ (0/88) ప్రభావం చూపలేకపోగా.. పాండ్యా (0/60) కూడా ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నాడు. ముఖ్యంగా బెయిర్‌స్టో భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. చహల్ బౌలింగ్‌లో 4 సికర్లు బాదిన అతడు.. కుల్దీప్‌కు 2 రుచి చూపించాడు. ఈ జోడీ ధాటికి 10 నుంచి 20 ఓవర్ల మధ్య ఇంగ్లండ్ 98 పరుగులు రాబట్టింది. ఈ క్రమంలో మొదట బెయిర్‌స్టో, ఆ తర్వాత రాయ్ అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. తొలి వికెట్‌కు 160 పరుగులు జోడించాక సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ జడేజా పట్టిన సూపర్ క్యాచ్‌కు రాయ్ ఔటయ్యాడు. 90 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న బెయిర్‌స్టోతో పాటు కెప్టెన్ మోర్గాన్ (1)ను పెవిలియన్ పంపిన షమీ భారత శిబిరంలో ఆనందం నింపాడు. ఒక దశలో ఏడున్నర వద్ద ఉన్న రన్‌రేట్ నెమ్మదిగా 6కు చేరింది. కుదురుకునే వరకు సమయం తీసుకున్న రూట్ (44; 2 ఫోర్లు), స్టోక్స్ బ్యాట్లకు పనిచెప్పడంతో స్కోరు బోర్డు మళ్లీ పరుగులు పెట్టింది. రూట్ ఔటైనా.. చహల్ బౌలింగ్‌లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు దంచిన స్టోక్స్ చూస్తుండగానే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. బట్లర్ (8 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్సర్లు) క్రీజులో ఉన్నది కాసేపే అయినా.. ధాటిగా ఆడాడు.

1

ప్రపంచకప్‌లో వరుసగా ఐదో హాఫ్ సెంచరీ చేసిన తొలి కెప్టెన్‌గా కోహ్లీ రికార్డుల్లోకెక్కాడు. గ్రేమ్ స్మిత్, ఫించ్ నాలుగు అర్ధశతకాలతో రెండో స్థానంలో ఉన్నారు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: రాయ్ (సి) (సబ్) జడేజా (బి) కుల్దీప్ 66, బెయిర్‌స్టో (సి) పంత్ (బి) షమీ 111, రూట్ (సి) పాండ్యా (బి) షమీ 44, మోర్గాన్ (సి) జాదవ్ (బి) షమీ 1, స్టోక్స్ (సి) (సబ్) జడేజా (బి) బుమ్రా 79, బట్లర్ (సి అండ్ బి) షమీ 20, వోక్స్ (సి) రోహిత్ (బి) షమీ 7, ప్లంకెట్ , ఆర్చర్ , **ఎక్స్‌ట్రాలు:** 8, **మొత్తం:** 50 ఓవర్లలో 337/7. **వికెట్ల పతనం:** 1-160, 2-205, 3-207, 4-277, 5-310, 6-319, 7-336, **బౌలింగ్:** షమీ 10-1-69-5, బుమ్రా 10-1-44-1, చహల్ 10-0-88-0, పాండ్యా 10-0-60-0, కుల్దీప్ 10-0-72-1.

భారత్: రాహుల్ (సి అండ్ బి) వోక్స్ 0, రోహిత్ (సి) బట్లర్ (బి) వోక్స్ 102, కోహ్లీ (సి) (సబ్) విన్స్ (బి) ప్లంకెట్ 66, పంత్ (సి) వుడ్ (బి) ప్లంకెట్ 32, పాండ్యా (సి) (సబ్) విన్స్ (బి) ప్లంకెట్ 45, ధోనీ (నాటౌట్) 42, జాదవ్ (నాటౌట్) 12, **ఎక్స్‌ట్రాలు:** 7, **మొత్తం:** 50 ఓవర్లలో 306/5. **వికెట్ల పతనం:** 1-8, 2-146, 3-198, 4-226, 5-267, **బౌలింగ్:** వోక్స్ 10-3-58-2, ఆర్చర్ 10-0-45-0, ప్లంకెట్ 10-0-55-3, వుడ్ 10-0-73-0, రషీద్ 6-0-40-0, స్టోక్స్ 4-0-34-0.

పాక్ ఫ్యాన్స్ నోట 'జనగనమన'

భారత్-పాకిస్థాన్ మధ్య క్రికెట్ మైదానంలో పోరాటం అంటే చాలు ప్రపంచమంతా అటే చూస్తుంది. ఇక ఇరుదేశాల అభిమానుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. తమ జట్టే గెలువాలని పూజలు, పునస్కారాలు, హోమాలు, యాగాలు ఒక్కటేమిటీ తమ వల్ల అయ్యే ప్రతీ పనిచేసి దేశం పట్ల అభిమానాన్ని చాటుకుంటారు. అలాంటిది ఆదివారం ఇంగ్లండ్‌తో పోరులో మాత్రం దాయాది అభిమానులు కూడా భారత్ నెగ్గాలని ప్రార్థనలు చేశారు. కోహ్లీసేనకు మద్దతుగా కొందరు పాకిస్థానీలు భారత జాతీయ గీతాన్ని ఆలాపిస్తే.. తమ స్నేహితులనే విజయం వరించాలని మరికొందరు కోరుకున్నారు. దీని వెనుక వారి స్వార్థం లేకపోలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తేనే పాకిస్థాన్ సెమీస్‌కు వెళ్లే అవకాశం ఉండటంతో ఆ జట్టు అభిమానులు టీమ్‌ఇండియాకు సపోర్ట్ చేశారు. ఒక్క పాకిస్థానే కాదు శ్రీలంక, బంగ్లాదేశ్ ఫ్యాన్స్ కూడా విరాట్ సేననే విజయం వరించాలని కోరుకున్నారు. అయితే ఆసియావాసుల ఆశలు ఫలించలేదు. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇంగ్లండ్ విజయం సాధించింది.

ఈ విజయంతో ఇంగ్లండ్ 8 మ్యాచ్‌ల్లో 5 గెలిచి 10 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానానికి చేరగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన పాకిస్థాన్ 9 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. ఇక పాకిస్థాన్ ముందు కెళ్లాలంటే తమ చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలువడంతో పాటు న్యూజిలాండ్ చేతిలో ఇంగ్లండ్ ఓటమి పాలవ్వాలి.

> మైదానం బయట ఏం జరుగుతుందో నాక తెలియదు. కానీ పాకిస్థాన్ అభిమానులు మాకు సపోర్ట్‌గా నిలువడం అరుదైన విషయం.
>
> - విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్

షమీ 5 స్టార్

షమీ (5/69)

షమీ 7-1-25-2 ఒక దశలో కట్టుదిట్టమైన బంతులతో కట్టిపడేసినా.. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ విజృంభించడంతో ఆఖరి మూడు ఓవర్లలో 44 పరుగులు సమర్పించుకున్నాడు. అయినప్పటికీ.. మోర్గాన్, బట్లర్, వోక్స్‌ను ఔట్‌చేసి ఇంగ్లండ్ ఇంకా భారీ స్కోరు చేయకుండా కట్టడి చేశాడు. ఓ వైపు బుమ్రా చక్కటి బంతులతో చెలరేగితే మరోఎండ్‌లో వికెట్లు పడగొట్టే బాధ్యతను షమీ చూసుకున్నాడు.

రేపటి నుంచి హైదరాబాద్ సెయిలింగ్ వీక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌ను మంగళవారం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రారంభించనున్నారు. ఈ నెల 7 వరకు హుసేన్‌సాగర్ వేదికగా జరుగనున్న ఈ పోటీలకు సంబంధించి వివరాలను మేజర్ జనరల్ నారాయణన్ ఆదివారం వెల్లడించారు. 'సెయిలింగ్ పోటీలకు దేశంలో హైదరాబాద్ ఎంతో పేరు గడించింది. జూన్-జూలై నెలల్లో హుసేన్‌సాగర్‌పై గాలులు సెయిలింగ్‌కు ఎంతో అనుకూలంగా ఉంటాయి. ఈ ఏడాది పోటీల్లో సెయిలర్ల ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయిలో ర్యాంకులు ప్రకటిస్తాం. దేశవ్యాప్తంగా ప్రముఖ సెయిలర్లతోపాటు తెలంగాణకు చెందిన సంజయ్, అజయ్, అశ్విని, కీర్తి ఈ పోటీల్లో పాల్గొననున్నారు. జూలై 3న సెయిలింగ్ రేస్, జూలై 5న సంజీవయ్య పార్క్ వద్ద గ్రీన్ బ్రిడ్జి వాకథాన్, 6న బైకర్స్ ర్యాలీ నిర్వహిస్తాం. పోటీల చివరి రోజు విజేతలకు బహుమతులు అందజేస్తాం'అని నారాయణన్ అన్నారు.

హాకీ జాతీయ శిబిరానికి 33 మంది ఎంపిక

న్యూఢిల్లీ: పురుషుల జూనియర్ హాకీ జాతీయ శిక్షణ శిబిరానికి 33 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాబబుల్స్‌ను హాకీ ఇండియా (హెచ్ఐ) ఆదివారం ప్రకటించింది. బెంగళూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రంలో సోమవారం ప్రారంభమయ్యే ఈ క్యాంపు 4 వారాల పాటు కొనసాగి జులై 27న ముగుస్తుంది. భవిష్యత్తు టోర్నమెంట్ల కోసం ఆటగాళ్లకు ప్రత్యేక శిక్షణ, విభిన్న కాంబినేషన్లను ప్రయోగించడం, జట్టు కూర్పు, ప్లేయర్ల ఫిట్‌నెస్ మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా హెచ్ఐ ఈ క్యాంప్ నిర్వహిస్తోంది. జూనియర్ జట్టు తన తర్వాతి టోర్నమెంట్‌ను అక్టోబర్‌లో ఆడనుంది. 'నాలుగు వారాల పాటు క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నాం. ఆటలో మెరుగు పడేందుకు, వేగం, నైపుణ్యం, ఫిట్‌నెస్ పెంచుకునేందుకు ఆటగాళ్లకు ఇదో మంచి అవకాశం'అని హెచ్ఐ హై పర్ఫార్మెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్ తెలిపారు.

లంకకు విండీస్ సవాల్

కరుణరత్నే

హోల్డర్

చెస్టర్ లీ స్ట్రీట్: మిణుకు మిణుకుమంటున్న సెమీస్ ఆశలను నిలుపుకునేందుకు తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో తలపడేందుకు శ్రీలంక సిద్ధమైంది. సోమవారం జరిగే పోరులో హోల్డర్‌సేనను ఓడించేందుకు లంక కసరత్తులు చేస్తున్నది. టోర్నీలో వరుస ఓటముల తర్వాత ఆతిథ్య ఇంగ్లండ్‌పై అనూహ్య విజయంతో ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకున్న కరుణరత్నే సేన.. ఆ తర్వాత దక్షిణాఫ్రికా చేతిలో ఓడి డీలాపడింది. ప్రొటీస్‌తో మ్యాచ్‌లో సమిష్టి వైఫల్యంతో పరాజయం పాలై తీవ్ర ఒత్తిడిలో ఉంది. గత మ్యాచ్‌లో తొలి బంతికే ఔటైన కెప్టెన్ కరుణరత్నే ఈసారైన భారీ ఇన్నింగ్స్ ఆడాలని ఆశిస్తున్నాడు. సీనియర్లు మాథ్యూస్, తిషార పెరెరాతో పాటు కుషాల్ పెరెరా, అవిష్క ఫెర్నాండో, ధనంజయ రాణించాల్సిన అవసరం ఉంది. రోచ్, హోల్డర్, థామస్, కాట్రెల్‌తో కూడిన విండీస్ బౌలింగ్‌ను ఎదుర్కోవాలంటే లంక బ్యాట్స్‌మెన్ శక్తికి మించి పోరాడాల్సిందే. బౌలింగ్‌లో మరోసారి మలింగ కీలకం కానుండగా.. లక్మల్, ఉడాన, డిసిల్వా కూడా సత్తాచాటితే జట్టుకు ఎదురుండదు. అనారోగ్యం కారణంగా నువాన్ ప్రదీప్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడి రెండు మాత్రమే గెలిచిన(రెండు రద్దు) శ్రీలంక ఆరు పాయింట్లతో ఉంది. విండీస్‌తో సహా తదుపరి మ్యాచ్‌లో భారత్‌పై గెలిచినా సెమీస్‌కు చేరుతుందనే గ్యారెంటీ లేదు.

మరోవైపు పాకిస్థాన్‌పై భారీ విజయంతో టోర్నీని ఘనంగా ఆరంభించిన విండీస్ ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు(ఒకటి రద్దు) ఆడి 3 పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. కొన్ని మ్యాచ్‌ల్లో పోరాడినా కీలక సమయాల్లో ఆటగాళ్లు ఒత్తిడికి లోనవడంతో పరాజయాలను మూటగట్టుకొని సెమీస్‌రేసు నుంచి నిష్క్రమించింది.

ప్రపంచ కప్‌లో..

మొత్తం ఆడినవి	8
శ్రీలంక గెలిచినవి	3
వెస్టిండీస్ గెలిచినవి	4
రద్దు	1

ఆనంద్‌కు మూడో 'డ్రా'

జగ్రెబ్ (క్రొయేషియా): ప్రపంచ మాజీ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌కు క్రొయేషియా గ్రాండ్ చెస్ టూర్-2019లో తొలి విజయం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఆదివారం నాలుగో రౌండ్‌లో వెస్లీ సో (అమెరికా)తో గేమ్‌ను ఆనంద్ డ్రాగానే ముగించాడు. టోర్నీ తొలి రౌండ్‌లో రష్యాకు చెందిన ఆటగాడి చేతిలో అనూహ్యంగా ఓడిన విశ్వనాథన్.. ఆ తర్వాత రెండు, మూడు రౌండ్లను డ్రా చేసుకున్నాడు. నల్లపావులతో ఆడిన అతడు తొలి అర్ధభాగంలోనే రాజును, మంత్రిని చురుగ్గా కదిపి ఆటలో దూకుడు కనబరిచాడు. మొత్తానికి 32 ఎత్తుల్లో మ్యాచ్ డ్రా అయింది.

రిటైల్ మదుపరుల కోసం..

న్యూఢిల్లీ, జూన్ 30: ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో రిటైల్ మదుపరుల కోసం పన్ను ప్రయోజనాల పొడిగింపును కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)లు, భారత్-22 ఈటీఎఫ్‌ల్లో రిటైల్ మదుపరులకు పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న ప్రతిపాదనను మోదీ సర్కారు పరిగణనలోకి తీసుకున్నది. ఇందులో భాగంగానే ఆదాయం పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) ప్రయోజనాన్ని ఈటీఎఫ్‌ల్లోని రిటైల్ మదుపరులకు వర్తింపజేయవచ్చా? అన్నదానిపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)ను ప్రభుత్వ రంగ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం) ఆరా తీసింది. ఈ మేరకు ఓ లేఖ రాసినట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.80,000 కోట్ల నిధుల సమీకరణను లక్ష్యంగా పెట్టుకున్న మోదీ సర్కారు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) రూ.90,000 కోట్ల నిధులను లక్ష్యంగా పెట్టుకున్నది.

నేటి నుంచి ఆర్టీజీఎస్, నెఫ్ట్ ఉచితం

ముంబై, జూన్ 30: ఆర్టీజీఎస్, నెఫ్ట్ వ్యవస్థల ద్వారా నగదు బదిలీ సోమవారం నుంచి ఉచిత సేవగా మారింది. డిజిటల్ లావాదేవీలకు ఊతమివ్వడంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వీటిపై జూలై 1 నుంచి అన్ని చార్జీలను ఎత్తివేస్తున్నట్లు గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. బ్యాంకులు ఈ ప్రయోజనాన్ని తప్పక తమ కస్టమర్లకు అందించాలని కూడా ఆదేశించింది. రియల్ టైం గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్టీజీఎస్) వ్యవస్థను భారీ నగదు బదిలీకి వాడుతుండగా, నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్)ను రూ.2 లక్షల వరకు బదిలీకి వినియోగిస్తున్నారు.

జీఎస్టీకి రెండేండ్లు

నేడు చారిత్రక పన్ను పుట్టిన రోజు
దేశ వ్యాపార ముఖచిత్రాన్ని మార్చేసిన మెగా ట్యాక్స్

న్యూఢిల్లీ, జూన్ 30: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చి రెండేండ్లు పూర్తయ్యింది. 2017 జూలై 1న దేశవ్యాప్తంగా ఈ చారిత్రక పరోక్ష పన్ను అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. జూన్ 30 అర్ధరాత్రి పార్లమెంట్ సాక్షిగా ఒకే దేశం.. ఒకే పన్ను.. ఒకే మార్కెట్ పేరుతో జీఎస్టీని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఆచరణలోకి తెచ్చిన సంగతీ విదితమే. డజను కుపైగా కేంద్ర, రాష్ట్ర పన్నులను విలీనం చేస్తూ వచ్చిన ఈ మెగా ట్యాక్స్‌లో 0, 5, 12, 18, 28 శ్లాబులను ఏర్పాటు చేశారు. 500లకుపైగా సేవలు, 1,200లకుపైగా వస్తువులకు ఈ శ్లాబుల్లో పన్నులు పడుతుండగా, బంగారంపై ప్రత్యేకంగా 3 శాతం, ముడి వజ్రాలు, విలువైన రత్నాలపై 0.25 శాతం పన్నును వసూలు చేస్తున్నారు. అయితే పెట్రోలియం ఉత్పత్తులు, మద్యం, విద్యుత్‌ను జీఎస్టీలోకి తీసుకురాలేదు. విద్య, వైద్యం, తాజా కూరగాయలు తదితర వాటికి జీఎస్టీ నుంచి మినహాయింపునిచ్చారు. నిజానికి జీఎస్టీ రాకతో కేంద్రం ఆదాయం భారీగానే తగ్గిపోయింది. రాష్ట్రాలకు ఐదేండ్లపాటు నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడంతో జీఎస్టీలో వచ్చే కేంద్రం ఆదాయ వాటాలో రాష్ట్రాలకు భాగంగా వెళ్తున్నది. దీంతో ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషిస్తున్న మోదీ సర్కారు.. పన్ను ఎగవేతలపై దృష్టి సారించింది. ఈ రెండేండ్లలో జీఎస్టీలో విధానపరమైన మార్పులను చాలానే చేసింది.

మరిన్ని సంస్కరణలు

జీఎస్టీ అమలై రెండేండ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఈ పరోక్ష పన్ను వ్యవస్థలో మరిన్ని సంస్కరణలను తీసుకురానున్నది. కొత్త రిటర్నుల వ్యవస్థ, నగదు లెడ్జర్ వ్యవస్థ హేతుబద్ధీకరణ, సింగిల్ రిఫండ్-పంపిణీ విధానం వంటివి ఇందులో ఉన్నాయి. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగే జీఎస్టీ రెండేండ్ల వేడుకలో ఆర్థిక మంత్రిత్వ శాఖలోని వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొంటారని ఆదివారం ఓ ప్రకటనలో సదరు మంత్రిత్వ శాఖ తెలిపింది. చిన్న మదుపరులకు జీఎస్టీ ప్రయోజనాలు, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు జీఎస్టీ ఫలాలు అందేలా నిర్ణయాలుంటాయని అంచనా. అలాగే రాబోయే జీఎస్టీ మండలి సమావేశాల్లో మరిన్ని వస్తువులను దిగువ శ్రేణి శ్లాబుల్లోకి మార్చే వీలు కూడా ఉన్నది. ఇప్పటికే చాలా వస్తువులను ఎగువ శ్రేణి శ్లాబుల నుంచి కింది స్థాయి శ్లాబుల్లోకి మార్చినది తెలిసిందే. శ్లాబుల సంఖ్యను కూడా తగ్గించే వీలుందని సమాచారం. జీఎస్టీ ఆదాయం పెరిగితే జీఎస్టీ భారాన్ని తగ్గిస్తామని కేంద్రం ఎప్పట్నుంచో చెబుతున్నది తెలిసిందే.

ఎస్ఎంఎస్ అలర్టులు

జీఎస్టీ నెట్‌వర్క్‌ను ఆధునికీకరిస్తున్న కేంద్రం.. రిటర్నుల దాఖలులో వ్యత్యాసం, ఐటీసీ క్లయిముల్లో తేడాలు, చెల్లింపుల జాప్యం, ఎగవేతలకు ఆయా సంస్థల ప్రమోటర్లు, డైరెక్టర్లకు ఎస్ఎంఎస్ అలర్టులను పంపించనున్నది. ఈ మేరకు జీఎస్టీ నెట్‌వర్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రకాశ్ కుమార్ తెలిపారు. ఇదిలావుంటే పరోక్ష పన్నుల వసూళ్లు తగ్గిపోతున్నాయని, కేంద్ర పథకాల కట్టడి అవసరమని 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్ అభిప్రాయపడ్డారు. జీఎస్టీని మరింత కట్టుదిట్టం చేయాలని, లోపాలను సరిదిద్దితేగానీ ప్రభుత్వ ఆదాయం పెరుగదని హెచ్చరించారు.

మార్పులు-మినహాయింపులు

గడిచిన రెండేండ్లలో జీఎస్టీ స్వరూపాన్ని కేంద్ర ప్రభుత్వం చాలావరకు మార్చేసింది. పన్నుల భారం ఎక్కువైపోయిందంటూ వ్యాపార, పరిశ్రమ వర్గాలు చేసే వినతుల దృష్ట్యా సవరణలు చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నేతృత్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సభ్యత్వంతో ఏర్పాటైన జీఎస్టీ మండలి.. ఎగువ శ్లాబుల్లోని పలు వస్తు, సేవలను దిగువ శ్లాబుల్లోకి మార్చుతూ వచ్చింది. ఇందులోభాగంగా కొన్నింటికి జీఎస్టీ నుంచి మినహాయింపూ లభించింది. ఇక పన్ను ఎగవేతలను అరికట్టడానికి జీఎస్టీ ఈ-వే బిల్లులు, వినియోగదారులకు జీఎస్టీ ప్రయోజనం అందేలా యాంటీ ప్రాఫిటీరింగ్ వ్యవస్థలనూ కేంద్రం తీసుకొచ్చింది.

జీఎస్టీ 2.0 అమలుకు సమయమిదే: పరిశ్రమ

జీఎస్టీని విస్తరించాలని, విద్యుత్, చమురు, గ్యాస్, రియల్ ఎస్టేట్, మధ్యంలను కూడా ఈ పన్ను పరిధిలోకి తీసుకురావాలని దేశీయ పరిశ్రమ కేంద్రానికి సూచనలు చేస్తున్నది.

'రెండోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారు.. జీఎస్టీని మరింత బలోపేతం చేయాలి. 'జీఎస్టీ 2.0' అమలుకు సమయమిదే'

-విక్రమ్ కిర్లోస్కర్, సీఐఐ అధ్యక్షుడు

'సరళమైన జీఎస్టీ అమలుతో దేశ ఆర్థిక వ్యవస్థ మరో మెట్టు ఎక్కింది. అయితే పన్ను శ్లాబుల నిర్మాణాన్ని 2-3 శ్లాబులకు కుదించాలి'

-చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ డైరెక్టర్ జనరల్

'సహజ వాయువుపై తక్షణమే 5 శాతం జీఎస్టీ వేయాలి. పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తెచ్చేదాకా ఎక్సైజ్, వ్యాట్ చట్టాలను సవరించాలి'

-సందీప్ సోమని, ఫిక్కీ అధ్యక్షుడు

'గత రెండేండ్లుగా జీఎస్టీ విధానంలో చేసిన మార్పులతో వ్యాపార నిర్వహణ సులువైంది. రవాణా వ్యయం తగ్గింది. డిజిటల్ చెల్లింపులు పెరిగాయి'

-ఆడీ గోద్రేజ్, సీఐఐ మాజీ అధ్యక్షుడు

ఈసారైనా కరుణిస్తారా..!

ఐటీ మినహాయింపు పరిమితి పెంపు కోసం వేతన జీవుల ఎదురుచూపులు

న్యూఢిల్లీ, జూన్ 30: మరో ఆర్థిక సంవత్సరానికి కొత్త బడ్జెట్ రాబోతున్నది. 2019-20కిగాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే శుక్రవారం లోక్‌సభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నారు. దీంతో ఎప్పట్లాగే బడ్జెట్ అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారైనా కరుణిస్తారా?.. అని ఆదాయం పన్ను (ఐటీ) మినహాయింపు పరిమితి పెంపుపై సగటు వేతన జీవి ఆశగా ఎదురుచూస్తున్నాడు. ప్రస్తుతం వ్యక్తిగత ఆదాయం పన్ను రూ.2.50 లక్షల వార్షిక ఆదాయం వరకు లేదు. దీంతో దీన్ని రెట్టింపు చేయాలన్న డిమాండ్లు ఎప్పట్నుంచో ఉన్నాయి. ఎన్నికలకు ముందు బడ్జెట్‌లో రూ.5 లక్షల వరకు కొన్ని రకాల ప్రోత్సాహకాలు ఇచ్చినా.. అవి పూర్తిస్థాయిలో మాత్రం కాదు. దీంతో 74 శాతం మంది ఈసారి ఐటీ మినహాయింపు పరిమితి పెరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నట్లు కేపీఎంజీ సర్వే తెలిపింది.

కొత్తగా 40 శాతం శ్లాబు

సంపన్నుల కోసం కొత్తగా 40 శాతం పన్ను శ్లాబును మోదీ సర్కారు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించే వీలుందన్న అభిప్రాయాలూ తాజా సర్వేలో వినిపించాయి. 58 శాతం మంది.. రూ.10 కోట్లకు మించి వార్షిక ఆదాయం ఉన్నవారిపై కొత్తగా ఈ 40 శాతం పన్నును వేసే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఇక 13 శాతం మంది వారసత్వ పన్నును మళ్లీ తెస్తారన్న అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. 10 శాతం మంది సంపద పన్ను/ఎస్టేట్ డ్యూటీని తిరిగి పరిచయం చేసే వీలుందన్నారు. అన్ని వర్గాలకు చెందిన 226 మంది నుంచి కేపీఎంజీ అభిప్రాయాలను సేకరించి ఈ అధ్యయనాన్ని రూపొందించింది. కాగా, గృహ నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా గృహ రుణాలపై వడ్డీ కోసం పన్ను కోతల పరిమితిని పెంచే వీలుందని కూడా 65 శాతం మంది అన్నారు. మరోవైపు ఈసారి సీతారామన్ ఎలాంటి చెప్పుకోదగ్గ ప్రత్యక్ష పన్ను సవరణల్ని చేయకపోవచ్చని 53 శాతం మంది అంచనా వేయడం గమనార్హం. కార్పొరేట్ పన్ను రేటునూ తగ్గించే అవకాశాల్లేవని 46 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ఫిన్‌టెక్, స్టార్టప్‌ల ఆశలు..

ఫిన్‌టెక్ సంస్థలు, స్టార్టప్‌లు రాబోయే బడ్జెట్‌లో పన్ను ప్రోత్సాహకాలను ఆశిస్తున్నాయి. పన్నుల నుంచి ఊరట లభిస్తుందని కూడా అంచనా వేస్తున్నాయి. డిజిటల్ ఎకానమీకి మరింత ఉత్సాహాన్నిచ్చే నిర్ణయాలను తీసుకోవచ్చని, నిధుల లభ్యత పెరిగేలా కొత్త అవకాశాలను ఈ బడ్జెట్ అందించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌నే మోదీ సర్కారు ప్రవేశ పెట్టింది. ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను జూలై 5న ప్రకటించనుండగా, గెలుపు జోష్‌ను అందరికీ బీజేపీ పంచుతుందన్న ఆశాభావం పరిశ్రమ నుంచి వ్యక్తమవుతున్నది.

ఓల్డేజ్ హోం మహిళలతో ట్రూజెట్ సిబ్బంది

45 మంది వయోవృద్ధులకు ట్రూజెట్ ఉచిత విమానయానం

- 'వింగ్స్ ఆఫ్ ప్రైడ్' కింద అవకాశం

హైదరాబాద్, జూన్ 30: నా అన్న వాళ్లకు దూరంగా, ఓల్డ్ ఏజ్ హోంలో కాలం వెళ్లదీస్తున్న వయోవృద్ధులకు ట్రూజెట్.. 'వింగ్స్ ఆఫ్ ప్రైడ్' కింద ఉచిత గగన విహార అవకాశాన్ని కల్పించింది. సంస్థ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా గత రెండు రోజులుగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈ క్రమంలోనే 45 మంది వృద్ధులకు విమాన యాన అనుభవాన్ని అందించింది. నగరంలోని మల్కాజ్‌గిరిలోగల సెయింట్ ఆంటోని వృద్ధాశ్రమానికి చెందిన వీరందరిని హైదరాబాద్ నుంచి నాందేడ్‌కు తీసుకెళ్లింది. దీంతో మొదటిసారి విమానం ఎక్కిన ఈ వృద్ధుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాందేడ్‌లోని ప్రసిద్ధ గురద్వారాను వీరికి చూపించామని, భోజన, ఇతర సదుపాయాల్ని కల్పించామని ట్రూజెట్ ఈ సందర్భంగా ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేసింది. ఈ జీవితంలో విమానం ఎక్కుతానని అనుకోలేదంటూ రాణి, సుజాత అన్నారు. ఇదిలావుంటే అనాథ పిల్లలకూ ట్రూజెట్ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. శనివారం ఇక్కడి దుండిగల్‌లోని స్ఫూర్తి అనాథాశ్రమంలో పైలెట్లు, కెప్టెన్లు, ఎయిర్ హోస్టెస్‌లు, ఇతర సిబ్బంది అక్కడి చిన్నారులతో కేక్ కట్ చేయించారు. ఆట బొమ్మలు, వివిధ బహుమతుల్ని అందజేశారు.

340 ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై రూ.3.3 లక్షల కోట్ల వ్యయ భారం

- గణాంకాలు, ప్రణాళికల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 30: దేశవ్యాప్తంగా 340 మౌలిక రంగ ప్రాజెక్టులు.. అంచనాలకు మించిన వ్యయంతో నడుస్తున్నాయని గణాంకాలు, ప్రణాళికల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒక్కో ప్రాజెక్టు రూ.150 కోట్లు అంతకుమించిన వ్యయ భారాన్ని మోస్తున్నట్లు పేర్కొన్నది. దీంతో వీటన్నిటి వ్యయ భారం రూ.3.3 లక్షల కోట్లపైనేనని చెప్పుకొచ్చింది. '1,405 ప్రాజెక్టుల వాస్తవ అమలు వ్యయం రూ.18,09,681.47 కోట్లు. అయితే ఇది రూ.21,39,924.38 కోట్లకు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫలితంగా రూ.3,30,242.91 కోట్లు ఎక్కువైంది' అని ఈ ఏడాది మార్చి కోసం విడుదల చేసిన తాజా నివేదికలో సదరు మంత్రిత్వ శాఖ చెప్పింది. 340 ప్రాజెక్టుల అంచనా వ్యయం 381 రెట్లు పెరిగిపోయిందని పేర్కొన్నది. ఇక 381 ప్రాజెక్టులు ఆలస్యంగా నడుస్తున్నాయని, 117 ప్రాజెక్టులు 1 నుంచి 12 నెలల ఆలస్యంతో, 63 ప్రాజెక్టులు 13 నుంచి 24 నెలల జాప్యంతో, 103 ప్రాజెక్టులు 25 నుంచి 60 నెలల ఆలస్యంతో, 98 ప్రాజెక్టులు ఐదేండ్లు అంతకంటే ఎక్కువ ఆలస్యానికి చేరుకున్నాయని తెలిపింది. మౌలిక రంగ ప్రాజెక్టుల వేగవంతమే లక్ష్యమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెబుతున్న క్రమంలో ఈ ప్రాజెక్టుల భవితవ్యం ఎలా? ఉంటుందా? అన్న ఆసక్తి నెలకొన్నది. గత ప్రభుత్వ హయాంలోనూ మౌలిక రంగ ప్రాజెక్టుల వేగవంతానికి గడ్కరీ చొరవ చూపించిన విషయం తెలిసిందే.

హువావీకి లైన్ క్లియర్

- అమెరికా-చైనా వాణిజ్య చర్చలతో తొలగనున్న ఆంక్షలు

వాషింగ్టన్, జూన్ 30: చైనా టెలికం దిగ్గజం హువావీకి పూర్వ వైభవం వస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికా-చైనా మధ్య వాణిజ్య చర్చలు మళ్లీ ప్రారంభమవుతుండటం.. హువావీకి కలిసొస్తున్నది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. హువావీపై మెత్తబడ్డట్లు కనిపిస్తున్న విషయం తెలిసిందే. జీ20 సమావేశాల్లో ఈ మేరకు ట్రంప్ సంకేతాలు కూడా ఇవ్వడం గమనార్హం. ఈ క్రమంలో గతంలో హువావీపై విధించిన ఆంక్షలు తొలగిపోయే వీలుందని ట్రంప్ సన్నిహితుడు ఒకరు అన్నారు. వైట్ హౌజ్ ఎకనామిక్ అడ్వైజర్ లర్రీ కుడ్లో ఆదివారం ఇక్కడ మాట్లాడుతూ మరిన్ని అమెరికా సంస్థలు హువావీతో వ్యాపార సంబంధాలు పెట్టుకునే అవకాశాలున్నాయని చెప్పారు. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లేలా హువావీ తీరు ఉందంటూ దానిపై ట్రంప్ సర్కారు నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీంతో ఆ సంస్థ మొబైల్ ఫోన్లకు అందుతున్న అమెరికా టెక్నాలజీ ఒక్కసారిగా ప్రశ్నార్థకమైంది. గూగుల్ కూడా హువావీతో సంబంధాలను తెంచుకోనున్నట్లు ప్రకటించింది. ఫలితంగా అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం తారాస్థాయికి చేరిందనుకుంటున్న సమయంలో జీ20 వేదికగా ఈ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి.

స్విస్ బ్యాంక్ డిపాజిట్లలో బ్రిటనే టాప్

- రెండో స్థానంలో అమెరికా
- 74వ స్థానానికి దిగిన భారత్

జ్యూరిచ్/న్యూఢిల్లీ, జూన్ 30: స్విస్ బ్యాంకుల్లో భారతీయుల నగదు నిల్వలు పడిపోతున్నాయి. డిపాజిట్ల పరంగా పోయినసారి 73వ స్థానంలో ఉన్న ఇండియా.. ఈసారి 74వ స్థానానికి దిగింది. అంతకుముందు ఏడాది 88వ స్థానంలో ఉండటం గమనార్హం. కాగా, స్విస్ బ్యాంకుల్లో వ్యక్తిగత, సంస్థాగతంగా డబ్బు దాచుకున్న దేశస్తుల్లో ఎప్పట్లాగే బ్రిటన్ ముందున్నది. ఆ తర్వాతి స్థానంలో అమెరికా ఉండగా, టాప్-5లో వెస్టిండీస్, ఫ్రాన్స్, హాంకాంగ్ దేశాలున్నట్లు స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ అథారిటీ విడుదల చేసిన తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఐదు దేశాల వాటా.. స్విస్ బ్యాంక్‌లోని విదేశీ నిధుల్లో 50 శాతానికిపైగానే ఉందని స్విస్ నేషనల్ బ్యాంక్ (ఎస్ఎన్‌బీ) తెలియజేయడం గమనార్హం. టాప్-10లో బహమాస్, జర్మనీ, లగ్జెంబర్గ్, కేమన్ ఐస్‌లాండ్స్, సింగపూర్ ఉన్నాయి. ఇక బ్రిక్స్ దేశాల్లో రష్యా 20వ స్థానంలో ఉంటే, చైనా 22వ స్థానంలో, దక్షిణాఫ్రికా 60వ స్థానంలో, బ్రెజిల్ 65వ స్థానంలో ఉన్నది. భారత్‌తో పోల్చితే ఇవన్నీ కూడా ఎగువ స్థానాల్లోనే ఉండటం విశేషం. ప్రధాన దేశాల విషయానికొస్తే.. మారిషస్ (71), న్యూజీలాండ్ (59), ఫిలిప్పీన్స్ (54), వెనిజులా (53), సీషెల్స్ (52), థాయిలాండ్ (39), కెనడా (36), టర్కీ (30), ఇజ్రాయెల్ (28), సౌదీ అరేబియా (21), పనామా (18), జపాన్ (16), ఇటలీ (15), ఆస్ట్రేలియా (13), యూఏఈ (12) ఈ జాబితాలో ఉన్నాయి. భారతీయులు, భారతీయ సంస్థల నగదు నిల్వలు ఈసారి దాదాపు 6 శాతం దిగజారాయని స్విస్ నేషనల్ బ్యాంక్ తెలిపింది. 2018 లో 954.71 మిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ (దాదాపు రూ.6,757 కోట్లు)కు పరిమితమయ్యాయి. భారత్ ఆధారిత శాఖల ద్వారా వచ్చిన సొమ్ము కూడా ఉన్నా.. స్థూల సంపద క్షీణించింది. గడిచిన రెండు దశాబ్దాలకుపైగా కాలంలో ఇది రెండో అత్యంత కనిష్ఠ స్థాయి.

వేచి చూసే ధోరణి

ఈ వారం స్టాక్ మార్కెట్ కదలికలపై నిపుణుల అంచనా.. బడ్జెట్‌పైనే భారం

న్యూఢిల్లీ, జూన్ 30

మదుపరులు ఈ వారం వేచి చూసే ధోరణిని అవలంభించే వీలుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎలాంటి ప్రకటనలు వస్తాయోనన్న దైలమాలో మదుపరులుండే వీలుందని, కొనుగోళ్ల జోలికి వెళ్లకపోవచ్చని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇటీవలి జీ20 సమావేశంలో అమెరికా-చైనా మధ్య కుదిరిన వాణిజ్య చర్చల సయోధ్య.. మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇకపోతే వర్షపాతం, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల కదలికలు వంటివి కూడా కీలకమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 200.15 పాయింట్లు పుంజుకుని 39,394.64 వద్ద ముగిసింది.

ఐదు సంస్థలకు రూ.37 వేల కోట్ల లాభం

సెన్సెక్స్ టాప్-10లోని ఐదు సంస్థల మార్కెట్ విలువ గత వారం దాదాపు రూ.37 వేల కోట్లు ఎగబాకింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ, ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యునిలివర్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీల మార్కెట్ విలువ రూ.36,839 కోట్లు పెరిగింది. ఇందులో ఎస్‌బీఐ వాటా రూ.10,218.68 కోట్లుగా ఉండగా, సంస్థ మార్కెట్ విలువ రూ.3,22,089.23 కోట్లకు చేరింది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.8,485.38 కోట్లు పుంజుకుని రూ.6,68,555.19 కోట్లకు, హెచ్‌డీఎఫ్‌సీ రూ.9,398.59 కోట్లు అందిపుచ్చుకుని రూ.3,78,194.61 కోట్లకు చేరాయి. హిందుస్థాన్ యునిలివర్ మార్కెట్ క్యాప్ కూడా రూ.4,026.53 కోట్లు ఎగిసి రూ.3,86,914.89 కోట్లకు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.4,148.44 కోట్లు ఎగబాకి రూ.2,82,105.47 కోట్లను తాకాయి. కాగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ రూ.17,242.19 కోట్లు పడిపోయి రూ.7,93,647.61 కోట్లకు దిగజారింది. టీసీఎస్ రూ.8,517.92 కోట్లు చేజార్చుకోగా, సంస్థ మార్కెట్ విలువ రూ.8,35,749.88 కోట్లకు పరిమితమైంది. ఇన్ఫోసిస్ రూ.8,191.74 కోట్లను నష్టపోయి రూ.3,19,783.94 కోట్లకు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.2,520 కోట్లు చేజార్చుకుని రూ.2,81,900.73 కోట్లకు వచ్చాయి. ఐటీసీ స్వల్పంగా రూ.367 కోట్లను నష్టపోగా, సంస్థ మార్కెట్ విలువ రూ.3,35,825.21 కోట్లను చేరింది. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం సెన్సెక్స్‌లో టీసీఎస్ టాప్‌లో ఉండగా, తర్వాతి స్థానాల్లో రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యునిలివర్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీ, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లున్నాయి.

తగ్గని ఎఫ్‌పీఐల జోరు

విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ).. దేశీయ మార్కెట్లలోకి పెట్టుబడుల వరద పారిస్తున్నారు. ఈ నెలలో రూ.10,384 కోట్లను తీసుకొచ్చారు. దీంతో వరుసగా ఐదు నెలలపాటు భారతీయ మార్కెట్లలో నికర పెట్టుబడిదారులుగా నిలిచారు. కాగా, జూన్‌లో స్టాక్ మార్కెట్లలోకి రూ.2,272.74 కోట్లు, రుణ మార్కెట్లలోకి రూ.8,111.80 కోట్లను ఎఫ్‌పీఐలు పట్టుకొచ్చారు. దీంతో మొత్తం రూ.10,384.54 కోట్లను తాకింది.

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

ఎమ్మెల్యేలకు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తనను కలిసిన గువ్వల బాలరాజుకు కేటీఆర్‌ను స్వయంగా శుభాకాంక్షలు చెప్పారు. సుంకె రవిశంకర్‌కు కేటీఆర్ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫసల్ బీమా నమోదు రైతుల ఇచ్ఛికం!

- బీమా చెల్లింపులను వారి ఇష్టానికే వదిలేయాలని కేంద్రం నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నమోదు అయ్యేందుకు రైతుల ఇష్టానికి అవకాశం ఇచ్చే అంశంపై కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ విషయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ తన అభిప్రాయాలను పంపాలని తాజాగా కేంద్రం లేఖ రాసింది. ప్రస్తుతం పంటల బీమాలో నమోదయ్యేందుకు రెండు మార్గాలున్నాయి. ఒకటి బ్యాంకులో పంట రుణాలు తీసుకోవడం, మరొకటి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోని (నాన్‌లోన్) రైతులు ఇతర కేంద్రాల ద్వారా బీమా ప్రీమియం చెల్లించడం. వీటిపై అధ్యయనంచేసిన కేంద్రం పంటల బీమా ప్రీమియం చెల్లింపు అనేది రైతుల ఇష్టానికే వదిలేయాలన్న భావనకు వచ్చినట్టు తెలిసింది. దీనిపై రెండు వారాల్లోగా అభిప్రాయాలను పంపాలని కోరింది. రైతుల్లో చాలామందికి అవగాహన లేదని, కొంతకాలం తప్పనిసరి చేస్తే బాగుంటుందని అధికారులు చెప్తున్నారు.

విగ్రహావిష్కరణ

మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో టీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏకే మురుగేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని మంత్రి చామకూర మల్లారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

- జవహర్‌నగర్

హృదయాల్ని చేరేదే కవిత్వం

ఉద్యమాల చరిత్ర గురించి తెలుసుకోవాలి • తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

ఘనంగా తెలంగాణ రచయితల సంఘం 3వ వార్షికోత్సవం • తెలంగాణ ఉద్యమాలు, సాహిత్య సంస్థలు, సాహిత్యంపై సమావేశాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హృదయాల్ని చేరుకునేదే ఉత్తమమైనటువంటి కవిత్వం అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం (తెరసం) మూడో వార్షికోత్సవ సమావేశం ఆదివారం తిలక్‌నగర్ – అబిడ్స్ పరిధి బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగింది. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేవరకు 'తెలంగాణ ఉద్యమాలు – సాహిత్య సంస్థలు – సాహిత్యం' అన్న అంశాలపై మూడు విభాగాలుగా సమావేశాలు కొనసాగాయి. ప్రారంభ సమావేశాన్ని తెరసం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అధ్యక్షత వహించి ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా నందిని సిధారెడ్డి హాజరై మాట్లాడారు. 'నేడు కవుల సంఖ్య పెరిగింది. కవిత్వం రాయాలనే ఆకాంక్ష కూడా పెరిగింది. కానీ కవిత్వం ఏ దిశలో వెళ్లాలి? కవులు ఏ పద్ధతిలో పరిణతి సాధించాలి? సాధించడానికి కావలసిన వనరులు ఏమున్నయ్? అవి కొరవడినటువంటి సందర్భం. ముఖ్యంగా సోషల్ మీడియాలో హోరెత్తినటువంటి కవిత్వపు వరద మధ్య.. ఇవ్వాల కొట్టుకుపోతున్నటువంటి ఒక ప్రవాహ సందర్భంలో కవులెట్లా ఉండాలి? రచయితలెట్లా ఉండాలి? సంఘాలెట్లా ఉండాలి? రచనలెట్లా ఉండాలి? సాహిత్య పరిమళాలెట్లా ఉండాలి? అని చెప్పేటువంటి ఒక సభను ఇవ్వాల తెలంగాణ రచయితల సంఘం నిర్వహిస్తున్నదని అనుకుంటున్నాను' అని పేర్కొన్నారు. తెలంగాణలో ఎట్లా కొట్లాడాలో, తెలంగాణను ఎప్పుడు నిర్మించుకోవాలో తెలిసిన సంస్థ తెలంగాణ రచయితల సంఘమని నందిని సిధారెడ్డి అన్నారు. చరిత్రలో ఒకసారి పరిశీలించుకోవడం, వర్తమానాన్ని సమీక్షించుకోవడం, భవిష్యత్తును నిర్వచించుకోవడమనే దిశగా 'తెలంగాణ ఉద్యమాలు – సాహిత్య సంస్థలు – సాహిత్యం' అనే అంశాన్ని పెట్టారని చెప్పారు.

హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రచయితల సంఘం మూడో వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి. చిత్రంలో తెరసం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, సాక్షి పత్రిక ఎడిటోరియల్ డైరెక్టర్ కే రామచంద్రమూర్తి తదితరులు

చరిత్ర తెలుసుకోవాలి

తెలంగాణ సాహిత్యంలో సాహిత్య విలువలు తక్కువున్నటువంటి మాట నిజమేనని నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. కానీ అదే సమయంలో సాహిత్య విలువల కోసమే సాహిత్యమన్న వాదాన్ని తెలంగాణ రచయితల సంఘం ఖండించి, సాహిత్య విలువల కంటే జీవన విలువలు గొప్పవనే వాదాన్ని నిరూపించగలిగిందని చెప్పారు. తెలంగాణకు ఉన్నది ఉద్యమాల చరిత్రని ఆయన తెలిపారు. వ్యక్తిగత చరిత్ర గానీ, సంస్థల చరిత్ర గానీ, ఉద్యమాల చరిత్ర గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. కవులు, రచయితలు కొట్లాడుతూనే ఉంటారని, తెలంగాణను ఎవరైనా ప్రేమిస్తే ప్రేమిస్తారని, ఎవరైనా అవమానిస్తే తిరుగబడిన చరిత్ర కూడా ఉన్నదని గుర్తుచేశారు. ప్రేమలో తెలంగాణ ఉన్నతమే.. తిరుగుబాటులో కూడా ఉన్నతమేనని చెప్పారు. రెండు పూటలా స్నానంచేసే వ్యవస్థ రావాలంటే, నీటి గోస తీరాలని, ఇవ్వాల కాళేశ్వరం గ్రామీణ వాతావరణంలోని నీటి అవసరాలను తీర్చుతున్నదనే నమ్మకం ఉన్నదన్నారు. కవిత్వం, సాహిత్యం వేరు కాదని, హృదయాలను చేరుకునేదే కవిత్వమని, హృదయాలను సంస్కరించే.. హృదయాల్ని చేరుకునే అక్షరాలు రావాలని సిధారెడ్డి పిలుపునిచ్చారు.

ఉద్యమానికి సాహిత్య సంస్థలు దోహదం

ద్వితీయ సమావేశంలో సభాధ్యక్షులుగా వ్యవహరించిన కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి డాక్టర్ బన్న ఐలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్య సంస్థలు ఉద్యమానికి ఎంతగానో దోహదం చేశాయని చెప్పారు. డాక్టర్ బాల శ్రీనివాసమూర్తి, డాక్టర్ జే చెన్నయ్య, డాక్టర్ దేవకీదేవి తదితరులు మాట్లాడగా, కార్యక్రమంలో సిద్దెంకి యాదగిరి, బిల్ల మహేందర్ పాల్గొన్నారు. అనంతరం 'సామాజిక జీవితం – సాహిత్యం'పై కొనసాగిన మూడో సమావేశానికి సభాధ్యక్షులుగా రామోజు హరగోపాల్ వ్యవహరించారు. డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, డాక్టర్ కాశీం మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ కలువకుంట రామకృష్ణ, బెల్లంకొండ సంపత్‌కుమార్, కవి సమ్మేళనంలో డాక్టర్ ఎస్ రఘు, సేనాధిపతి, శివకుమార్, కాంచనపల్లి, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పరమాత్మ, బాలయ్య, సుబ్బయ్య, అంజయ్య, జగన్‌రెడ్డి, రాపోలు సుదర్శన్, త్రివేణి, మాధవీలత, వాణి, శ్రీలక్ష్మి, రమాదేవి, కవిత, జ్యోతి, సీతాలక్ష్మి, శారద, సుజాత, ఉషారాణి పాల్గొన్నారు.

కవిత్వం కదిలించాలి.. కార్యోన్ముఖుల్ని చేయాలి

కవిత్వం కదిలించేలా, పలువురిని కార్యోన్ముఖుల్ని చేసేలా ఉండాలని సాక్షి పత్రిక ఎడిటోరియల్ డైరెక్టర్ కే రామచంద్రమూర్తి అన్నారు. పాఠకులకు దిశానిర్దేశం చేసేదే కవిత్వమని, ప్రశ్నించని కవికి నిష్కృతి ఉండదని పేర్కొన్నారు. మానవీయ కోణం, ప్రశ్నించలేని కవిత్వం నిరర్థకమని చెప్పారు. అనంతరం బైస దేవదాసు రాసిన 'నీళ్ల గోస' పుస్తకాన్ని, యాదగిరి రాసిన 'గల్మ' కవితా సంపుటిని నందిని సిధారెడ్డి, కే రామచంద్రమూర్తి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డాక్టర్ వీ శంకర్, కందుకూరి శ్రీరాములు, ఘనపురం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులు, దర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రూ.21 లక్షల వ్యయంతో యూసుఫైన్‌బాబా దర్గాలో సౌకర్యాలు
- హోంమంత్రి మహమూద్ అలీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం

నాంపల్లిలోని దర్గాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ బేగంబజార్: రాష్ట్రంలోని మసీదులు, దర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని హోంమంత్రి మహమూద్ అలీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం అన్నారు. నాంపల్లిలోని యూసుఫైన్ బాబా దర్గాలో అభివృద్ధి పనులకు మహమూద్ అలీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్గాకు వచ్చే సందర్శకులు చేతులు, కాళ్లు శుభ్రపరుచుకునేందుకు వజూర్‌ఖానా, మరుగుదొడ్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ నిధుల నుంచి రూ.21 లక్షలను కేటాయించినట్టు తెలిపారు. సలీం మాట్లాడుతూ.. యూసుఫైన్ దర్గాను అభివృద్ధి చేసేందుకు వక్ఫ్‌బోర్డు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్, సెట్విన్ చైర్మన్ ఇనాయత్‌అలీ, నాంపల్లి నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి నీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సౌదీలో అన్నివసతులు కల్పిస్తాం

హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసిఉల్లాఖాన్

యూసుఫ్‌గూడలోని శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ యాత్రికులకు కావాల్సిన సౌకర్యాలన్నీ సౌదీ అరేబియాలో కల్పిస్తామని, అనవసరమైన వస్తువులను తీసుకెళ్లొద్దని హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్ సూచించారు. ఆదివారం యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ ప్యాలెస్‌లో హజ్ యాత్రికులకు తొమ్మిదో విడుత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మసిఉల్లాఖాన్ మాట్లాడుతూ.. జూలై 26 నుంచి తెలంగాణ, ఏపీకి చెందిన హజ్ యాత్రికులకు విమాన సదుపాయం కల్పించామని, హైదరాబాద్ హజ్ శిబిరం నుంచి వెళ్లే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన యాత్రికులకు జూలై 18న ప్రత్యేకంగా విమానాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు మహ్మద్ అబ్దుల్ షఫీ, మహ్మద్ ఆరీఫుద్దీన్, ముఫ్తీ రెహమాని తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత్రి కన్నుమూత

విజయవాడ: మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత్రి, పద్మశ్రీ కోటేశ్వరమ్మ (94) కన్నుమూశారు. గత కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆమె ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మంగళవారం విజయవాడలో కోటేశ్వరమ్మ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఏపీలోని కృష్ణా జిల్లా గోసాల గ్రామంలో 1925 సెప్టెంబర్ 15న కోటేశ్వరమ్మ జన్మించారు. బాలిక విద్యపై కోటేశ్వరమ్మ విశేష కృషిచేశారు. మాంటిస్సోరి పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాల ద్వారా లక్షల మందికి విద్యాదానంచేసిన ఆమె.. స్త్రీ విద్య, సమాజ నిర్మాణం, మహిళా సాధికారత కోసం విశేష కృషిచేశారు. కోటేశ్వరమ్మ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ 1955లో మాంటిస్సోరి పాఠశాలను స్థాపించారు. విద్యారంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది. కోటేశ్వరమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆస్ట్రేలియాలో ఉత్సాహంగా టీఆర్ఎస్ సభ్యత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఆస్ట్రేలియాలో ఉత్సాహంగా ప్రారంభమైంది. టీఆర్ఎస్ ఎన్నారై ఆస్ట్రేలియాశాఖ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి కాసర్ల ఆధ్వర్యంలో సభ్యత్వ కార్యక్రమాన్ని ఆ దేశంలోని అన్ని నగరాల్లో నిర్వహిస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఏ భారతీయ పార్టీకీరాని స్పందన టీఆర్ఎస్‌కు వస్తున్నదని నాగేందర్‌రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అనిల్‌రావు, రాజేశ్ రాపోలు, అర్జున్, సునీల్‌రెడ్డి, విశ్వామిత్ర, పరశురామ్, సంగీత దూపాటి, రవి దూపాటి, రాకేశ్ లక్కరసు, చంద్రమోరంపూడి, విన్నీ తూముకుంట తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

'నమస్తే తెలంగాణ'తో టాస్క్ కొత్త సీఈవో శ్రీకాంత్ సిన్హా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించుకునేలా తమ విద్యాసంవత్సర ప్రణాళిక ఉంటుందని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) కొత్త సీఈవో శ్రీకాంత్ సిన్హా వెల్లడించారు. ప్రస్తుతం వివిధ అంశాలపై అందిస్తున్న శిక్షణకుతోడు నూతన విభాగాల్లోనూ శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు వివరించారు. ఇటీవల సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన సిన్హా ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో పలు అంశాలపై స్పందించారు. ఇటీవలి వరకు శిక్షణ, ఉద్యోగ కల్పనలో నగర విద్యార్థులకు 60 శాతం, గ్రామీణ ప్రాంతాలవారికి 40 శాతం ప్రాధాన్యమిస్తుండగా.. ఈ ఏడాది నుంచి గ్రామీణ విద్యార్థులకు 60 శాతం ప్రాధాన్య మివ్వనున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఐటీరంగంలో 13 సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, దీనికితోడు ఫార్మా, బ్యాంకింగ్, బల్క్ డ్రగ్స్, ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో అవకాశాలను కల్పించేందుకు వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఐటీ పట్టభద్రులతో పాటు సివిల్, మెకానికల్‌వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామని, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ అందిస్తున్నామని చెప్పారు. యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలను కల్పిస్తున్న చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి సరైన మానవవనరులను అందించడంపై దృష్టి పెడుతామని, దీనివల్ల జిల్లాల్లోని యువత సమీప ప్రాంతాల్లోనే ఉద్యోగాలు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు పెద్దఎత్తున ప్రాధాన్యం ఇస్తూ వివిధ శిక్షణ అంశాల్లో వారికి ఎక్కువ అవకాశాలు కల్పించనున్నామని సిన్హా వివరించారు.

గిరిజన వర్సిటీ ఈ ఏడాదే ప్రారంభించాలి

- కేంద్ర మానవ వనరులశాఖ ముఖ్యకార్యదర్శి సుబ్రహ్మణ్యం
- రాష్ట్ర అధికారులతో సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ములుగులో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఈ విద్యాసంవత్సరమే ప్రారంభించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ, ఇతర అధికారులకు కేంద్ర మానవ వనరులశాఖ ముఖ్యకార్యదర్శి ఆర్ సుబ్రహ్మణ్యం సూచించారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై ఆదివారం ఆయన సెంట్రల్ యూనివర్సిటీలో తెలంగాణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. గిరిజన వర్సిటీకి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టులోగా బదిలీచేయాలని, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక క్యాంపస్, క్లాస్‌రూంలు, డార్మెటరీల కోసం ములుగు దగ్గరలోని ట్రైబల్ వెల్ఫేర్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలన్నారు. వీటికోసం యూజీసీ నుంచి రూ.3 కోట్లు విడుదలచేసినట్టు చెప్పారు. విద్యాసంవత్సరాన్ని కుదించి నడుపడం ఇబ్బందని, సాధ్యాసాధ్యాలను రెండ్రోజుల్లో కేంద్ర మానవ వనరులశాఖకు వివరిస్తామని సెంట్రల్ వర్సిటీ వీసీ అప్పారావు చెప్పారు.

తెలంగాణ సీఎంతో ఘర్షణ ఎందుకు పెట్టుకోవాలి?

- టీడీపీ నేతల తీరును ఘాటుగా ప్రశ్నించిన వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో ఎందుకు ఘర్షణ పెట్టుకోవాలని టీడీపీ నేతలను వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి నిలదీశారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చర్చలపై టీడీపీ నేత కేశినేని నాని చేసిన కామెంట్లపై ఆదివారం ట్విట్టర్‌లో ఘాటుగా స్పందించారు. 'కేశినేని ఇకనైనా మారండి. మీ అధినేత బీజేపీని సమర్థిస్తే అందరూ జైకొట్టాలి. యూటర్న్ తీసుకొని కాంగ్రెస్ గుంపులో చేరితే అది గొప్ప నిర్ణయమనాలి. తెలంగాణ సీఎంతో ఘర్షణ వైఖరి అవలంబిస్తే మేమూ అదే చేయాలా? యుద్ధం ఎప్పుడు చేయాలో, సామరస్యంగా ఎప్పుడు మెలగాలో మా సీఎంకు తెలుసు' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

అతివేగమే ప్రాణం తీసింది

- పంజాగుట్ట ఫ్లైఓవర్‌పై బైక్‌ను వెనుకనుంచి ఢీకొట్టిన కారు
- పది అడుగులకుపైగా ఎగిరి కింద రోడ్డుపై పడి రైడర్ దుర్మరణం

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం. మృతుడు తాజుద్దీన్ (ఫైల్)

ఖైరతాబాద్: అతివేగం నిండు ప్రాణాన్ని బలిగొన్నది. ఓ కారు అతివేగంగా వచ్చి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో రైడర్ పది అడుగులకుపైగా ఎగిరిపడి దుర్మరణం చెందారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ తాజుద్దీన్ (41) కొంతకాలం క్రితం కుటుంబంతో నగరానికి వలసవచ్చి కుతుబ్‌షాహీ టూంబ్స్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. పలు ప్రైవేట్ కంపెనీలకు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శనివారం రాత్రి పంజాగుట్ట ఫ్లైఓవర్ మీదుగా బైక్‌పై వెళ్తుండగా.. లలితా జువెల్లరీస్ షోరూమ్ వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నుజ్జునుజ్జుకాగా, తాజుద్దీన్ పది అడుగులకుపైగా ఎగిరి ఫ్లైఓవర్ కిందరోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు పోలీసుల సాయంతో 108 వాహనంలో ఉస్మానియా దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇదే ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినడంతోపాటు డ్రైవర్‌కు సైతం గాయాలు కాగా అతడిని కూడా ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మృతుడి సోదరుడు ఎండీ సిరాజుద్దీన్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటినుంచి 40 రైళ్ల వేళల్లో మార్పులు!

- దక్షిణమధ్య రైల్వే ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణమధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్లవేళల్లో సోమవారం నుంచి మార్పులు చేసినట్టు రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోల్కొండ, పల్నాడు, దేవగిరి, హుస్సేన్‌సాగర్, తడోబ, ఆనంద్‌వన్, కాకినాడ, జన్మభూమి, శాతవాహన, అండమాన్, రామగిరి, హంద్రీ, అజ్ని, సికింద్రాబాద్– నాగ్‌పూర్, సికింద్రాబాద్– దర్భాంగ తదితర 40 రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్టు వెల్లడించారు. 15 – 45 నిమిషాల తేడాతో రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని.. ప్రయాణికులు గమనించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 1 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

చెత్త నుంచి సంపద సృష్టించిన

అమృతా ఛటర్జీ

మురికివాడలంటే మనలో చాలామందికి ఎంతో చులకన. అక్కడ నివసించేవారి దగ్గర మురికి తప్ప ఏమీ ఉండదని అంతా భావిస్తారు. కానీ ఆమె మురికివాడలు మన ఆర్థిక వ్యవస్థను, జీవితాలను మార్చగలవని నిరూపించారు. కోల్‌కతాలోని శాంటీ టౌన్‌లో ఇప్పుడు ఎంతోమంది మహిళలు తమ కాళ్ళమీద తాము నిలబడగలుగుతున్నారు. అంతేకాదు పిల్లలకు మంచి చదువులు కూడా చెప్పించగలుగుతున్నారు. అయితే గతంలో చెత్త పక్కనే నివసిస్తూ రెండోపూట తినలేని వారు.. తమ జీవితాలు మార్చేది చెత్తే అని గ్రహించడానికి చాలాకాలం పట్టింది. ఆ తర్వాత వారి జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. దీనికంతటికీ కారణం ట్రాష్ టు క్యాష్ సంస్థ. ఆ సంస్థను స్థాపించింది సౌత్ ఏషియన్ ఫోరం ఫర్ ద ఎన్విరాన్‌మెంట్ (సేఫ్) ప్రాజెక్ట్ మేనేజర్ అమృతా ఛటర్జీ. చెత్తనుంచి సంపద సృష్టించవచ్చు అంటారు ఆమె. చెత్తను రీ సైక్లింగ్ చేసి లక్షలు సంపాదిస్తున్నది అమృత. తాను సంపాదించిన సొమ్మును మురికివాడల వారికీ పంచుతున్నది. వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్న అమృత సక్సెస్‌మంత్ర ఇది.

దేన్నీ కూడా తక్కువగా చూడడం తగదు అంటారు పెద్దలు. ఒక్కోసారి చిన్నదే పెద్ద ఉపయోగానికి పనికి రావచ్చు. మారుతున్న రోజుల్లో ప్రతీది డబ్బుతోనే ముడిపడి ఉంటుంది. అందుకే అమృతా చెత్తను కూడా సంపద సృష్టికి వినియోగించుకున్నారు.

చెత్త నుంచి ఆదాయం

చెత్తే కదా అని పారేయడం, పర్యావరణానికి ఎంతో ప్రమాదకరం అంటారు అమృతా ఛటర్జీ. నిరుపేదలు కొత్త ఆదాయ వనరుల కోసం నిరంతరం అన్వేషిస్తూ ఉంటారు. అలాంటి వారికి మంచి దారి చూపించారామె. చెత్తను రీసైక్లింగ్ చేయడం ఎలాగో ఆమె శిక్షణ ద్వారా మహిళలకు తెలియజేశారు. తాను చేసేది పర్యావరణానికి ఎంతో మేలు చేసే కార్యక్రమం అంటారామె. ఆ మధ్య జరిగిన యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లయిమేట్ చేంజ్ (యుఎన్ఎఫ్‌సీసీ) సదస్సులో అమృతా ఛటర్జీ పాల్గొన్నారు. పెరూలో జరిగిన ఈ సదస్సులో మెట్రోపాలిటన్ నగరాలకు చెందిన ఎంతోమంది అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. చెత్తను విపరీతంగా బయట పారేయడం, నదులు, నీటిలో చెత్తను పారబోయడం వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని, చెత్తను ఆదాయ వనరుగా ఎలా మార్చుకోవాలనే అంశంపై.. ఆమె అందరికీ ఆసక్తికర విషయాలు తెలియజేశారు. సరైన నిర్వహణ లేకపోతే నగరాలు డంపింగ్ యార్డులుగా మారిపోతాయని హెచ్చరిస్తారు అమృత. కోల్‌కతాలోనే రోజుకి 5వేల టన్నుల చెత్త తయారవుతున్నదని 2010 లో జరిగిన ఓ సర్వేలో వెల్లడైంది. సరైన నిర్వహణ లేకపోవడం వల్ల 86 శాతం చెత్త ఎందుకూ పనికిరాకుండా పోతున్నదనేది ఆమె ఆందోళన. ఇది ప్రజల ఆరోగ్యం పైనా ప్రభావం చూపుతుందని చెప్తారు.

వెలుగులు నిండాయి

వ్యాపార సముదాయాలు, మార్కెట్ల నుంచి తయారయ్యే చెత్త వల్ల అంతగా ఇబ్బందులు ఉండవు. కానీ వివిధ ఆరోగ్యకేంద్రాలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల చెత్త వల్ల ఎన్నో ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. చెత్తను మంచి ఆదాయ వనరుగా మార్చాలన్నదే నా లక్ష్యం అంటారు అమృతా ఛటర్జీ. అందులో భాగంగానే ఓ కార్యక్రమం ప్రారంభించారు. అదే 'ట్రాష్ టు క్యాష్'. ఈ పథకం ద్వారా ఆమె 2 నుంచి 5 శాతం బ్రోకరేజ్ ఆదాయం పొందుతున్నారు. 2011లో ప్రారంభమయిన ఈ పథకం ఎంతోమంది మురికివాడల వారికి ఆదాయ వనరుగా మారింది. చెత్త సేకరించడం, దాన్ని రీసైక్లింగ్ చేయడం మురికివాడల్లో ఎంతోమంది జీవితాలను బాగా మార్చేసింది. నగరంలో చెత్త సమస్యను తీర్చే చక్కని పరిష్కారంగా ఈ కార్యక్రమం రూపొందించారు. రీ సైక్లింగ్ అనేది ఒక కళ లాంటిది. దాన్ని సకాలంలో ఉపయోగించుకోగలిగితే పేదరికం మన దరిదాపులకు కూడా రాదు. ఇలాంటి రీ సైక్లింగ్ వల్ల సమాజానికి ఎంతో మేలు కలుగుతుంది. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఈ రీసైక్లింగ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (యుఎన్ఈపి) ద్వారా రీసైక్లింగ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చారు అమృతా ఛటర్జీ .

ఐరాస గుర్తింపు

అమృతా ఛటర్జీ రూపొందించి అమలుచేస్తున్న రీసైక్లింగ్ ప్రక్రియకు ఐక్యరాజ్యసమితి గుర్తింపు కూడా లభించింది. అది ఇప్పుడు మైక్రో ఎంటర్‌ప్రైజ్‌గా మారింది. అంతేకాదు వివిధ మురికివాడల్లో అవగాహన కోసం అమృతా ఛటర్జీ ప్రత్యేక వర్క్‌షాపులను కూడా నిర్వహిస్తున్నది. సేకరించిన చెత్తను ఎలా విడగొట్టాలి, మనకు అవసరమయిన దాన్ని ఆదాయంగా ఎలా మార్చుకోవాలనే విషయాలను సమీప ప్రాంతాల ప్రజలకు ఆమె వివరిస్తూ ఉంటారు. చెత్త నుంచి రీ సైక్లింగ్ చేయగా వచ్చిన ముడి పదార్థాలతో తయారుచేసిన వివిధ రకాల వస్తువులను షాపుల్లో అమ్మకానికి పెడుతున్నారు. ట్రాష్ టు క్యాష్ ఇప్పుడు అంతా మహిళల నిర్వహణలోనే నడుస్తున్నది. మధ్యలో స్కూల్ మానేసే వారి సంఖ్య ఈ ప్రాంతంలో చాలా తక్కువగా నమోదు అవుతున్నది. తాగి తందనాలాడడం, చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు తమ జీవితాలను మార్చుకున్నారు. 350 మంది చెత్త రిక్షాలు లాగేవారు ట్రాష్ టు క్యాష్‌ను ముందుకు నడిపిస్తున్నారు.

పెరిగిన సామాజిక బాధ్యత

మురికివాడల్లోని మహిళల పేరు మీద బ్యాంకు అకౌంట్లు ప్రారంభించారు అమృత. వారిని జాయింట్ లయబిలిటీ గ్రూప్స్ పేరుతో ఏర్పాటుచేసి పొదుపును ఆమె ఎంతగానే ప్రోత్సహించారు. యూకో బ్యాంకు అధికారులు ఆమె కృషిని ఎంతగానో మెచ్చుకున్నారు. అమృత ప్రోత్సాహంతో ఎంతోమందికి బ్యాంకు అకౌంట్లు ఇచ్చారు. ఇప్పుడు అక్కడున్న చాలామందికి బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి. అంతేకాదు వారికి ఓ గుర్తింపు ఉంది. అంతకుమించి గుర్తింపుకార్డులు కూడా తెచ్చుకోగలిగారు. అంతకుముందు తామంటే ఏంటో తమకే తెలియదని, అమృతా ఛటర్జీ చొరవ వల్ల తాము బ్యాంకు గుమ్మం తొక్కుతున్నామని అక్కడి మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రీసైక్లింగ్‌పై అవగాహన లేనివారికి అమృతా ఛటర్జీ వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. మార్కెటింగ్ మెళకువలు, లెక్కాపత్రాల నిర్వహణ. ఇంటి దగ్గర నుంచే సంపాదించడం ఎలాగో నేర్చుకున్నారు. తమ కాళ్ళ మీద తాము నిలబడే మానసిక స్థైర్యం వారికి కలిగింది. ఎన్నో కార్పొరేట్ సంస్థలు తమ ఆఫీసులో చెత్త కాగితాలను ఓ కవర్ వేసి వీరికి అందజేస్తున్నారు. గతంలోలాగే చెత్త ఎక్కడ బడితే అక్కడ వేయడం లేదు. జనంలో సామాజిక బాధ్యత కూడా బాగా పెరిగిందంటారామె.

పర్యావరణానికి రక్షణ

ట్రాష్ టు క్యాష్ కార్యక్రమం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతున్నది. పెరిగిపోతున్న కాలుష్యానికి కారణం రోజూ విడుదలవుతున్న చెత్తే కారణం అంటారు. చెత్తను సరైన పద్ధతిలో రీసైక్లింగ్ చేయకపోతే ఎంతో ఇబ్బంది అంటారు అమృతా ఛటర్జీ. ప్రస్తుతం ఎన్నో ఆరోగ్య ఇబ్బందులకు చెత్త కారణం అంటారు వైద్యులు. అందుకే చెత్తను రీసైక్లింగ్ చేసే విధానాలకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకి రావాలంటారామె.

కంపోస్ట్ ఎరువుకూడా..

అమృతా ఛటర్జీని కోల్‌కతాలోని మురికివాడల ప్రజలు ఆప్యాయంగా అక్కా అని పిలుస్తారు. ఆమె మాటలు వారికి శిరోధార్యం. 'మీరు మాతో కలిసి వస్తే మీ జీవితాలను మారుస్తా. మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఇవాల్టి నుంచి మా సంస్థతో చేతులు కలుపండి' అని చెప్పుకొచ్చేవారామె. అమృతా ఛటర్జీ మాటలు వారిని ముందుకి నడిపించాయి. పేపర్ వేస్ట్ రీసైక్లింగ్ ప్రాజెక్టు మురికివాడల వారికి ఎంతో ఉపయుక్తంగా ఉందంటారు అమృతా ఛటర్జీ. అంతేకాదు బాగా తడిసిన చెత్త నుంచీ వర్మీ కంపోస్టు ఎరువును తయారుచేస్తున్నారు. దీన్ని వివిధ వ్యవసాయ క్షేత్రాలకు విక్రయిస్తున్నారు. వ్యవసాయరంగానికి అవసరమయిన చౌక అయిన ఎరువులు వీళ్ళు సరఫరా చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను రీ సైక్లింగ్ చేసి ప్లాస్టిక్ బాటిల్స్ తయారుచేస్తున్నారు. హోం గార్డెన్లకు అవసరమయిన సరంజామాను రూపొందిస్తున్నారు. ట్రాష్ టు క్యాష్ వల్ల తమ జీవితాలు ఎంతో మెరుగుపడ్డాయని ఆనందంగా చెప్తారు అక్కడి ప్రజలు.

మహిళల స్వావలంబన దిశగా అడుగులు

ఆర్థిక పరిపుష్టి సాధించిన మహిళలు సమాజానికి ఎంతో ఉపయోగపడతారు. వారివల్ల సమాజం ముందడుగు వేస్తుంది. రీసైక్లింగ్ విధానం వల్ల మురికివాడల్లోని మహిళల ఆదాయం గతంలో కంటే 35 శాతం పెరిగింది. తమ జీవన ప్రమాణాల స్థాయి బాగా వృద్ధి చెందిందని కూడా వారు చెబుతున్నారు. ట్రాష్ టు క్యాష్ కార్యక్రమం ఎంతో బృహత్తరమయింది. 400 మంది వివిధ ప్రాంతాలకు చెందిన, విభిన్న జీవన శైలిని ఆచరించేవారి ప్రమేయం ఇందులో ఉంది.

స్వర్గం నిజంగానే ఉన్నది..

ఒకసారి చనిపోయాక మళ్లీ బతకడం అనేది జరగదు. అలాంటిది 27 నిమిషాల తర్వాత ఆమె మళ్లీ బతికింది. మరణం తర్వాత ఏం జరగుతుందో కళ్లారా చూసింది. ఇంతకీ ఆమెకు స్వర్గంలో ఏం కనిపించిందో తెలుసా?

ఆమె పేరు టినా హినీస్. అరిజోనాకు చెందిన ఆమె ఫీనిక్స్‌లో పర్వాతారోహణ చేస్తుండగా హార్ట్ ఎటాక్ వచ్చింది. కదళిక లేని ఆమెను హాస్పటల్‌కు చేర్చేలోపు ఆరుసార్లు చికిత్స చేయాల్సి వచ్చింది. దాంతో ఆమె చనిపోయిందని అదరూ భావించారు. కానీ, ఆమె 27 నిమిషాల తర్వాత కళ్లు తెరిచింది. మాట్లాడలేని పరిస్థితిలో ఉన్న టినా ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నది. మాటరాక పెన్, పేపర్ కావాలంటూ కనుసైగ చేసింది. కాగితంపై 'its real' (ఇది నిజం) అని రాసింది. అర్థం కాని కుటుంబ సభ్యులు ఏది నిజం? అని అడిగారు. దీంతో టీనా కన్నీళ్లు పెట్టుకుంటూ పైకి చూసింది. ఈ సంఘటన ఫిబ్రవరిలో జరిగింది. కట్ చేస్తే.. ఇటీవలె టీనా పూర్తిగా కోలుకొని అసలు విషయం చెప్పింది. 'స్వర్గం నిజంగానే ఉంది. ఆ ప్రాంతం చాలా రంగులమయంగా ఉంది. అక్కడ నల్ల రంగులో ఉన్న తలుపుల ముందు జీసస్ నిల్చొని ఉన్నాడు. ఆయన వెనుక పసుపు వర్ణంలో కాంతులు కనిపించాయి' అని చెప్పుకొచ్చింది. ఆమె మాటలు విన్న తల్లిదండ్రులు చాలా సంతోషించారు. టీనా తమ్ముడి కుమార్తె మాడియా జాన్సన్ అయితే హాస్పటల్‌లో రాసిన its real అక్షరాలను ఏకంగా టాటూ వేయించుకున్నది. అంతేకాకుండా టాటూను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి జరిగిన విషయాన్ని వివరించింది. ఇప్పుడు ఈ టాటూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మల్లెలతో మానసిక ఉల్లాసం

పువ్వుల్లో మల్లెలదే అగ్రస్థానం. అలాంటి మల్లెపువ్వులను ఇష్టపడని మహిళలు ఉండరు. మల్లెలు అందించే కొన్ని సౌందర్య పరమైన ప్రయోజనాలు..

- మల్లెపూలు నీటిలో వేసుకుని గంట తర్వాత ఆ నీటితో స్నానం చేస్తే శరీరం, మనసు తేలికపడతాయి. పూల సువాసనతో ఒళ్లు గుబాళిస్తుంది. రోజంతా బయట తిరగడం వల్ల ఒత్తిడికి లోనైన కళ్ల మీద విరిసిన మల్లెపూలను ఉంచితే ఒత్తిడి తగ్గిపోతుంది.
- కొందరికి ఏళ్లుగా చుండ్రు బాధిస్తూనే ఉంటుంది. అలాంటి వారు మెంతులు, కాసిన్ని నీళ్లు, ఎండు మల్లెలు కలిపి నూరాలి. ఆ మిశ్రమాన్ని తలకు పట్టిస్తే సమస్య తగ్గడమే కాకుండా జుట్టు దృఢపడుతుంది.
- మల్లె పువ్వులను కొబ్బరినూనెలో వేసి రాత్రంతా నానబెట్టి, ఆ తర్వాత మరగనిచ్చి ఆ నూనెను జుట్టుకు పట్టిస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. మాడు చల్లబడుతుంది. జుట్టు దృఢంగా కూడా తయారవుతుంది.
- గుప్పెడు విచ్చిన మల్లెల్ని నూరి ముద్ద చేసి కొద్దిగా పాలు కలిపి ముఖమంతా మర్దన చేసుకుని ఆ తర్వాత అరచెంచా చొప్పున ముల్తానామట్టి, గంధం, తేనె కలిపి ఫేస్ ప్యాక్ వేసుకుంటే చర్మం తాజాగా మారి మెరిసిపోతుంది.
- రెండు చెంచాల చొప్పున మల్లెపూల రసం, గులాబీ పువ్వుల రసం, గుడ్డు పచ్చ సొన కలిపి ముఖానికి పట్టిస్తే ముఖ చర్మం మెత్తబడి కాంతివంతంగా మారుతుంది. మల్లెల నూనెను మొటిమల మీద రాసి మర్దన చేస్తే ఆ మచ్చలు మాయమైపోతాయి.

ఆపరేషన్ తర్వాత కిడ్నీ రిజెక్ట్ అవుతుందా?

నా వయసు 38 సంవత్సరాలు. కిడ్నీ చెడిపోవడంతో ఇటీవల నాకు ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ జరిగింది. అయితే ఆపరేషన్ అయినంత మాత్రాన సమస్య పరిష్కారం అయినట్టు కాదని తెలిసినవాళ్లు అన్నారు. అంటే ఆపరేషన్ ఫెయిల్ అవుతుందా? ఇలాంటి సమస్యల నుంచి ఎలా బయటపడాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? దయచేసి తెలుపగలరు.
- మోహన్, సంగారెడ్డి

అడుగండి చెబుతా

ఆపరేషన్ తర్వాత చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. కిడ్నీ రిజెక్ట్ కాకుండా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడాలి. వీటిని జీవితాంతం వాడాల్సి ఉంటుంది కూడా. చాలామంది కిడ్నీ బాగానే పనిచేస్తుంది కదా? అనవసరంగా మందులు ఎందుకు దండగ? అనుకుంటారు. మందులు మానేయడం వల్ల కిడ్నీ రిజెక్ట్ అవుతుంది. దీన్నిబట్టి చెప్పేదేంటంటే ట్రాన్స్‌ప్లాంట్ అయిన తర్వాత కూడా ఇన్ఫెక్షన్స్ వస్తాయి. జలుబు, జ్వరం వంటి ఏ చిన్న సమస్యలు వచ్చినా డాక్టర్‌ను సంప్రదించాలి. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ఎలాంటి మందులు వాడొద్దు. ఫ్రెష్‌గా ఉన్న ఆహారమే తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. బీపీ, షుగర్ ఉంటే వాటిని కంట్రోల్ చేసుకోవాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయాలి.

డాక్టర్ విక్రాంత్‌రెడ్డి
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్

వంటింటి చిట్కాలు

- బిస్కెట్ ప్యాకెట్ బియ్యం డబ్బాలో ఉంచితే బిస్కెట్లు త్వరగా మెత్తబడవు.
- మినుపపప్పు త్వరగా నానాలంటే అందులో ఇనుప వస్తువును ఏదైనా వేయాలి.
- నూనె పొంగకుండా ఉండాలంటే అందులో కొంచెం చింతపండు వేయాలి.
- వడియాల పిండిలో కొంచెం నిమ్మరసం వేస్తే తెల్లగా వస్తాయి.
- గుడ్లు ఉడకబెట్టేటప్పుడు కొంచెం ఉప్పు వేసి ఉడకనిస్తే పెంకులు త్వరగా ఊడిపోతాయి. ఒకే రకమైన మంట మీద 12 నిమిషాలు ఉడికిస్తే గుడ్లు సరిగ్గా ఉడుకుతాయి.
- పసుపు నీటితో కిచెన్‌ను శుభ్రం చేస్తే ఈగలు రావు.

అక్కడి తొలి మహిళా జర్నలిస్టు

దేశంలో వెనుబడిన తెగల్లో కోయ తెగ ఒకటి. ఈ తెగలో చదువుకుంటున్న అమ్మాయిలు చాలా తక్కువ. అయితే ఈ యువతి కథ కొంచెం వేరు. తన కమ్యూనిటీ నుంచి ఎదిగిన మొదటి జర్నలిస్టుగా పేరు సంపాదించుకున్నది.

ఒడిశాలోని మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన యువతి జయంతి. ఆమె చదువుకోవడానికి చాలా ధైర్యం చేసిందనే చెప్పాలి. చిన్నతనంలోనే ఎన్నో కలలుగంటూ పెరిగిందామె. ఆ కలలు సాకారం చేసుకోవడానికి జయంతి తండ్రి సహకారం ఆమెను తన తెగలోనే ప్రత్యేకంగా నిలిపింది. ఇక్కడ ఎవరైనా చదువుకుంటే అది కేవలం ప్రభుత్వ ఉద్యోగం సాధించే ఆలోచనతోనే. కానీ జయంతి ఆశయం అంతకుమించింది. ఒక జర్నలిస్టుగా ఎదగాలని కలలుగన్నది. పైచదువులు చదివించే ఆర్థిక స్థోమత లేనప్పటికీ, కుటుంబం ఆమెకు అండగా నిలిచింది. ఒడిశా కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జర్నలిజం చదవడానికి ప్రోత్సహించింది. యూనివర్సిటి హాస్టల్‌కు ఫీజు కట్టడానికీ ఆమె దగ్గర డబ్బులు లేని పరిస్థితుల్లో ఆమె స్నేహితురాలి బాబాయి ఇంట్లోనే ఉంటూ జర్నలిజం కోర్సును పూర్తిచేసింది. తర్వాత భువనేశ్వర్‌లో ఇంటర్న్‌షిప్ చేసి, కళింగా టీవీ రిపోర్టర్‌గా విధుల్లో చేరింది. ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక మహిళా జర్నలిస్ట్ కావడంతో చాలా వివక్షను ఎదుర్కొంటున్నది. పురుషాధిక్యమున్న చోట ఆమె నిర్ణయాలకు, రాసే వార్తలకు ప్రాధాన్యం ఇవ్వని పరిస్థితుల్లో ఆమె అడుగడుగునా ఎంతో ఓర్పుగా, నేర్పుతో పనిచేస్తున్నది. ఇదంతా ఒక ఎత్తయితే అక్కడి పోలీసులతో ఆమె మరింత జాగ్రత్తగా మసలుకోవాల్సి వస్తున్నది. ఆమె చదువుకున్న మహిళ, ఒక ఆదివాసీ తెగకు చెందింది కావడంతో తనని మావోయిస్టు అనుకుంటూ ఉంటారని చెబుతున్నది జయంతి. ఆమె కేవలం జర్నలిస్ట్‌గానే కాకుండా తన తెగకు సహకారం అందించే ఎన్జీఓనూ నిర్వహిస్తున్నది. దీనితో పాటు రేడియో యాక్టీవ్ 90.4 ఎఫ్ ఎమ్లో బాలల కార్యక్రమాన్ని నడుపుతున్నది.

నమస్తే తెలంగాణ
నిపుణ
[కరీంనగర్]
సోమవారం 1 జూలై 2019

గ్రూప్-2 ఇంటర్వ్యూ

మౌఖికం బహు కీలకం

పోటీ పరీక్షల్లో విజయం, వైఫల్యం మధ్య తేడా కేవలం ఒకే ఒక మార్కు ఉండవచ్చు. కొన్ని సందర్భాల్లో ఒకే మార్కులు వచ్చినప్పటికీ వయసులో పెద్దవారికి మాత్రమే ఉద్యోగం ఇస్తారు. కాబట్టి రాత పరీక్షలో వచ్చిన మార్కులతో సంబంధం లేకుండా ఇంటర్వ్యూలో అందరికంటే ఎక్కువ మార్కులు సంపాదించుకోవడానికి కృషి చేయాలి. అందుకోసం అందుబాటులో ఉన్న ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోకూడదు.

ప్రిపరేషన్ మెళకువలు

- వ్యక్తిత్వ పరీక్షలో ప్రధానంగా భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించేటప్పుడు తన ఆఫీసులో ఉన్న సిబ్బందితో కలిసి పనిచేయగలిగే మనస్తత్వం, సిబ్బందితో పనిచేయించగలిగే సమర్థత ఉన్నాయా లేవా? అన్న అంశాన్ని పరీక్షిస్తారు. సమయం, సందర్భానుసారం సరైన నిర్ణయాలు తీసుకునే శక్తి సామర్థ్యాలు, విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన తెలివితేటలను వివిధ ప్రశ్నల రూపంలో ఇంటర్వ్యూ బోర్డు పరిశీలిస్తుంది.

ఇంటర్వ్యూ ప్రిపరేషన్

- ఇంటర్వ్యూ ప్రిపరేషన్ అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఇది ఒక్కరోజులో పూర్తయ్యే అంశం కాదు. ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థి ప్రవర్తన, వ్యక్తిత్వం, జీవన విధానం తెలుస్తుంది. ఒక ప్రభుత్వ అధికారిగా సమాజానికి సేవలు అందించే వ్యవస్థలో భాగస్వామిగా చేరే వ్యక్తికి సత్ప్రవర్తన, మంచి మూర్తిమత్వం తప్పనిసరిగా ఉండాలి. ఎందుకంటే వ్యక్తికంటే సమాజం గొప్పది. సమాజంలోని ప్రజలు కట్టిన పన్నులతో ప్రభుత్వ అధికారులు జీతభత్యాలు పొందుతారు. జీవితాంతం ఉద్యోగ, ఆర్థిక భద్రతను పొందుతున్నందున సమాజానికి సేవచేసే అవకాశాన్ని కల్పిస్తున్న ప్రభుత్వ ఉద్యోగం ఎంపిక విషయంలో ప్రభుత్వం తప్పనిసరిగా అనేక జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇందులో అత్యంత కీలకం ఇంటర్వ్యూ.
- ప్రముఖ మనస్తత్వ శాస్త్రవేత్త పాలిన్ వియంగ్ అభిప్రాయంలో ప్రతివ్యక్తి తన జీవితంలో చాలాభాగం ప్రైవేటుగా గడపటం జరుగుతుంది. అయితే ఇతరుల ముందుకు వచ్చినప్పుడు మర్యాద ముసుగు వేసుకుని నెగ్గుకురావటం అలవాటైన పని. ఈ ముసుగును తొలగించి అసలు సిసలు నిజస్వరూపాన్ని వ్యక్తిత్వాన్ని బయటపెట్టడమే ఇంటర్వ్యూ ప్రధాన లక్ష్యం. కాబట్టి అభ్యర్థులు కృత్రిమంగా ప్రవర్తించకుండా సహజంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఈ ప్రవర్తనలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవాలి.

దశలు

1. భౌతిక సంసిద్ధత
2. మానసిక సంసిద్ధత
3. మేధోపరమైన సంసిద్ధత

భౌతిక సంసిద్ధత

- ఇంటర్వ్యూలో అత్యంత ప్రాథమికమైనది, కీలకమైనది అభ్యర్థి భౌతికంగా కనిపించే తీరు. ఒక వ్యక్తి వేషధారణ, వ్యక్తిగత పరిశుభ్రత చూడగానే మంచి సానుకూల దృక్పథం ఏర్పడేలా జాగ్రత్తలు తీసుకోవాలి. first impression is the best impression గా మిగిలిపోవాలంటే తల వెంట్రుకలు, గోళ్లు మొదలు వేసుకునే దుస్తులు చివరకు సాక్స్ ఎంపిక వరకు ప్రతి అంశానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఖరీదైన దుస్తులు లేకపోయినప్పటికీ వేసుకున్న దుస్తులు ముడతలు లేకుండా నీట్‌గా ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా లైట్‌కలర్ దుస్తులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది.

మానసిక సంసిద్ధత

- ఇంటర్వ్యూలో అభ్యర్థి మానసిక స్థితిని అంచనా వేయటానికి అనేక రకాల ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థి నిజ స్వరూపాన్ని తెలుసుకునేందుకు ఇంటర్వ్యూ బోర్డు వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తుంది. అందువల్ల మానసిక అడ్డంకులైన భయం, ఆందోళన, ఆత్మన్యూనత వంటి లక్షణాలను మనసులో నుంచి తొలగించుకోవాలి.
- బోర్డు సభ్యులు అభ్యర్థి మానసిక స్థితిని, స్థితప్రజ్ఞత స్థాయిని సమయస్ఫూర్తిని అంతిమంగా ఆత్మ విశ్వాసాన్ని అంచనా వేయటానికి అనేక రకాలుగా ప్రశ్నలు అడుగుతారు.

ఉదాహరణకు

1. గ్రూప్-2 ఉద్యోగాన్ని ఎందుకు ఎంచుకున్నారు?
2. ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే ఏం చేస్తారు?
3. ఇప్పుడు చేస్తున్న ఉద్యోగాన్ని ఎందుకు వదిలి వస్తున్నారు?
4. ప్రైవేటురంగంలో జీతభత్యాలు చాలా ఎక్కువ కదా?
5. మీ అర్హతకు ఈ ఉద్యోగం చాలా తక్కువగా ఉంది కదా?
6. మీ పరిజ్ఞానం ఇతర రంగాల్లో మరింత బాగా ఉపయోగపడుతుంది కదా?
7. డిగ్రీ/పీజీ తర్వాత చాలాకాలంపాటు ఖాళీగా ఉన్నారా?
8. ఖాళీ సమయంలో ఏం చేస్తారు?
9. ఇంటర్వ్యూ బాగా చేశానని భావిస్తున్నారా?
10. మీరు ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిస్తే ఎలా స్పందిస్తారు.
11. దేవుడు ప్రత్యక్షమై ఏదైనా కోరుకోమంటే ఏం కోరుకుంటావు?
12. మీరు చదివిన చదువుకు ఈ ఉద్యోగాలకు సంబంధం లేదు కదా?
13. మీ బలాలు, బలహీనతల గురించి చెప్పండి?
14. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?
15. మీకు పూర్తి అధికారాలు ఇస్తే మొదట ఎలాంటి సమస్యలకు పరిష్కారం చూపిస్తావు?

మేధోపరమైన సంసిద్ధత

- ఇంటర్వ్యూను పూర్తిస్థాయిలో ఎదుర్కోవాలంటే మేధోపరమైన సామర్థ్యం (విషయ పరిజ్ఞానం) చాలా కీలకం. గ్రూప్-2 సిలబస్‌లోని అనేక అంశాలపై లోతైన పరిజ్ఞానం ఉన్నందునే ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని గుర్తించాలి. అయితే ఇంటర్వ్యూలో మరో రకమైన పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు.

ఉదాహరణకు

1. మీ పేరు, ఇంటిపేరులోని ప్రత్యేకత, నేపథ్యం
2. మీరు చదివిన విద్యాసంస్థల ప్రాముఖ్యం
3. మీ జిల్లా సమాచారం
4. వర్తమాన అంశాలపట్ల మీకున్న అవగాహన
5. ప్రభుత్వ కార్యక్రమాలపై మీ అవగాహన

- ఇలా అనేక అంశాలపై కనీస పరిజ్ఞానాన్ని ఇంటర్వ్యూలో ప్రధానంగా గమనిస్తారు.

మెంటల్ అలర్ట్‌నెస్ కీలకం

- ఇంటర్వ్యూలో అభ్యర్థిలోని విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించే సందర్భంలో మెంటల్ అలర్ట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తారు.
- సాధారణంగా ప్రతి అభ్యర్థిని ఇంటర్వ్యూలో 20 నుంచి 25 నిమిషాల సమయంలో వారి సామర్థ్యాన్ని అంచనావేస్తారు. సగటున 30 ఏండ్ల వయసులోని అభ్యర్థుల మనస్తత్వాన్ని ఇంత తక్కువ సమయంలో అంచనా వేయాలంటే చాలా కష్టం. అందువల్ల అభ్యర్థి ఇంటర్వ్యూ బోర్డు ఉన్న గదిలోకి ప్రవేశించటం, నడకతీరు, బోర్డు సభ్యులను విష్ చేయటం, కుర్చీలో కూర్చునే పద్ధతి, ప్రశ్నలకు సమాధానాలు చెప్పేటప్పుడు ప్రదర్శించే హావభావాలు, ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత ధన్యవాదాలు తెలిపే విధానం, తిరిగి బయటకు వెళ్లేటప్పుడు నడక, డోర్ వేయటం వంటి ప్రతి విషయాన్ని బోర్డు సభ్యుల్లోని సైకాలజిస్టు నిశితంగా గమనించి అభ్యర్థి మనస్తత్వాన్ని అంచనా వేస్తారు.

ప్రధానంగా గమనించే అంశాలు

1. మానసిక పరిపక్వత, స్థితప్రజ్ఞత, ఆత్మవిశ్వాసం
2. వివిధ అంశాలపై అభ్యర్థి అవగాహన, దృక్పథం
3. అంశాలను వివరించే విధానం
4. ప్రభుత్వ విధానాల అమలుకే పరిమితమని తెలుసా?
5. మెంటల్ అలర్ట్‌నెస్
6. స్పోర్టివ్‌నెస్
7. అనవసర సంభాషణకు దూరంగా ఉండటం
8. సమయస్ఫూర్తి
9. ముందు చెప్పినదానికి కట్టుబడి ఉన్నారా? లేక తరచూ అభిప్రాయం మార్చుకుంటున్నారా?
10. కామన్‌సెన్స్, కనీస సమాచారాన్ని కలిగి ఉన్నారా?
11. ఇతరుల సహాయాన్ని తీసుకునే స్వభావం ఉన్నదా?
12. సంక్షోభం, సంఘర్షణ సమయంలో మానసిక దృఢత్వం
13. నిర్ణయాలు తీసుకునే ధైర్యం, సామర్థ్యం
14. నైతిక బాధ్యత
15. పరిపాలనలో భాగస్వామిగా చేరేందుకు అవసరమైన లక్షణాలు అభ్యర్థికి ఉన్నాయా? లేవా?

సామాజిక సమస్యలు

1. పేదరికం
2. నిరుద్యోగం
3. మహిళలపై హింస, అత్యాచారాలు
4. సామాజిక దురాచారాలు
5. బలహీనవర్గాల స్థితిగతులు
6. షెడ్యూల్డ్ కులాలు
7. షెడ్యూల్డ్ తెగలు
8. వెనుకబడిన తరగతులు
9. మైనారిటీలు
10. వికలాంగులు
11. మానవ అక్రమ రవాణా
12. వృద్ధుల సమస్యలు
13. సామాజిక అసమానతలు
14. కులతత్వం
15. మతతత్వం
16. వివాహ, కుటుంబ వ్యవస్థల విచ్ఛిన్నం
17. గ్రామీణ సమాజంపై ప్రపంచీకరణ ప్రభావం
18. సైబర్ నేరాలు
19. నైతిక విలువల పతనం
20. మోసాలు, దోపిడీలు, దొంగతనాలు

సంక్షేమ యంత్రాంగం

1. సంక్షేమ విధానాల అంతిమ లక్ష్యం
2. సంక్షేమ రాజ్య భావన ఎలా వికాసం చెందింది?
3. జాతీయ విధానాల ప్రభావం ఎంతమేరకు ఉంటుంది?
4. షెడ్యూల్డ్ కులాల సంక్షేమం
5. షెడ్యూల్డ్ తెగల సంక్షేమం
6. వెనుకబడిన వర్గాల సంక్షేమం
7. మైనారిటీల సంక్షేమం
8. మహిళ, శిశు సంక్షేమం
9. వికలాంగుల సంక్షేమం
10. వృద్ధుల సంక్షేమం

తెలంగాణ ప్రభుత్వ విధానాలు/ పథకాలు

1. పారిశ్రామిక విధానం/ టీఎస్ ఐపాస్
2. వ్యవసాయ విధానం, రైతుబంధు, రైతు బీమా
3. ఐటీ విధానం
4. విద్యా విధానం
5. సాంఘిక సంక్షేమం
6. జల విధానం, ప్రాజెక్టులు
7. మిషన్ కాకతీయ
8. మిషన్ భగీరథ
9. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్
10. ఆసరా పింఛన్లు
11. చేనేత లక్ష్మి
12. కంటి వెలుగు
13. ఆరోగ్య లక్ష్మి
14. కేసీఆర్ కిట్
15. గ్రామజ్యోతి
16. పల్లె ప్రగతి
17. డబుల్ బెడ్‌రూం ఇండ్లు
18. తెలంగాణకు హరిత హారం
19. మన ఊరు మన ప్రణాళిక
20. టీ హబ్
21. ఫైబర్ గ్రిడ్
22. ప్రజా పంపిణీ విధానం
23. దళితులకు మూడెకరాల భూ పంపిణీ
24. చేప పిల్లల పంపిణీ
25. గొర్రెల పంపిణీ
26. నైపుణ్యాభివృద్ధి విధానం- టాస్క్
27. నేతన్నకు చేయూత
28. స్వచ్ఛ తెలంగాణ
29. షీ టీమ్స్
30. స్వయం సహాయక బృందాలకు ఆర్థిక సాయం

తెలంగాణలో సామాజిక సమస్యలు

1. తెలంగాణ సామాజిక నిర్మాణం ఏ విధంగా ఉంది?
2. జోగిని దేవదాసీ వ్యవస్థల నేపథ్యం ఏమిటి?
3. వెట్టిచాకిరీ వ్యవస్థ గురించి క్లుప్తంగా చెప్పండి
4. బాలకార్మిక వ్యవస్థ మూలాలు ఎక్కడ ఉన్నాయి?
5. వెట్టి, బాలకార్మిక వ్యవస్థలను ఏకకాలంలో ఏ విధంగా నిర్మూలించవచ్చు?
6. ఫ్లోరోసిస్ సమస్యలను ఎలా ఎదుర్కోవాలి?
7. తెలంగాణలో వలసలు ఎందుకు ఎక్కువ ఉన్నాయి?
8. తెలంగాణలో వ్యవసాయరంగం స్థితిగతులు ఏమిటి?
9. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?
10. తెలంగాణ ఉద్యమం సామాజిక ఉద్యమమేనా?

సమాధానాలు చెప్పటంలో పాటించాల్సిన జాగ్రత్తలు

1. ప్రశ్న అడిగినప్పుడు అవును, కాదు వంటి పదాలను తక్కువగా వాడాలి.
2. సమాధానం అనుభవ పూర్వకంగా ఉండేలా చూసుకోవాలి.
3. సమాధానాన్ని సమర్థించుకోవాలి.
4. ప్రశ్న అడిగి సభ్యుడికి సమాధానం చెబుతూనే మిగతా సభ్యులవైపు కూడా చూడాలి.
5. ప్రతి ప్రశ్నకు స్పందించాలి.
6. పొగడ్తలకు దూరంగా ఉండాలి.
7. సమాధానం చెప్పేటప్పుడు అతి వినయాన్ని ప్రదర్శించకూడదు.
8. బోర్డు సభ్యుల దయతో ఉద్యోగాలు పొందాలన్న భావన ఉండరాదు.
9. కుటుంబ స్థితిగతులను దీనంగా చెప్పకూడదు.
10. ప్రతి సమాధానంలో ఆత్మవిశ్వాసం కనపడాలి. మెరిట్‌తోనే ఉద్యోగం పొందగలనన్న నమ్మకాన్ని కలిగి ఉండాలి.

ముఖ్యమైన కొన్ని పథకాలు - వివరాలు

ఆసరా పింఛన్లు

- ప్రారంభం: 2014 నవంబర్ 8

అర్హులు:

- వృద్ధులు
- వికలాంగులు
- వితంతువులు
- కల్లుగీత కార్మికులు
- చేనేత కార్మికులు
- బీడీ కార్మికులు
- ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు
- పేద వృద్ధ కళాకారులు
- ఒంటరి మహిళలు

పెన్షన్ల కాలక్రమం

- 2013-14లో రూ. 200
- 2014-15లో రూ.1000
- 2019-20లో రూ. 2016
- వికలాంగులకు ప్రస్తుతం రూ. 3016
- **లబ్ధిదారుల సంఖ్య:** సుమారు 45 లక్షలు
- **బడ్జెట్ కేటాయింపులు:** దాదాపు రూ.5000 కోట్లు

కళ్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్

- ప్రారంభం: 2014 అక్టోబర్ 2

ఆర్థిక సాయం

- 2014లో రూ. 51,000
- 2017లో రూ.75,116
- 2018లో రూ.1,00,116

అర్హులు

- 18 ఏండ్లు దాటిన యువతులు

వార్షికాదాయ పరిమితి:

- గ్రామాల్లో లక్షన్నర రూపాయలు
- పట్టణాల్లో రెండు లక్షల రూపాయలు

గ్రామజ్యోతి

- ప్రారంభం: 2015, ఆగస్టు 17
- రాబోయే ఐదేండ్లలో గ్రామాల అభివృద్ధికి రూ.25,000 కోట్లు ఖర్చు చేయటం
- జనాభాను బట్టి గ్రామాల అభివృద్ధికి 2 నుంచి రూ.6 కోట్ల వరకు ప్రభుత్వ నిధులు కేటాయింపు

మన ఊరు మన కూరగాయలు

- ప్రారంభం: 2015
- కూరగాయల సాగును ప్రోత్సహించడం
- రైతు పండించే కూరగాయలకు నేరుగా మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించడం

తెలంగాణకు హరితహారం

- ప్రారంభం: 2015, జూలై 3
- 24 శాతం వరకున్న అటవీ విస్తీర్ణాన్ని 33శాతానికి పెంచటం
- 230 కోట్ల మొక్కలను నాటడం

ఆరోగ్య లక్ష్మి

ప్రారంభం: 2013, జనవరి 1

- 2015, జనవరి 1 నుంచి పూర్తి విస్తరణ
- సమగ్ర శిశు అభివృద్ధి పథకానికి అనుబంధంగా గర్భిణులు,బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించటం.
- ఆరు నెలల నుంచి 6 ఏండ్లు ఉన్న బాలబాలికలకు రెండున్నర కిలోల బాలామృతాన్ని అందించటం

మిషన్ కాకతీయ

- ప్రారంభం: 2015, మార్చి 12
- లక్ష్యం: 46,531 చెరువుల పునరుద్ధరణ
- అన్నిరకాల జలాశయాల్లో 250 నుంచి 270 టిఎంసీల నీరు నిల్వ ఉండేలా సామర్థ్యాన్ని పునరుద్ధరించటం

మిషన్ భగీరథ

- ప్రారంభం: 2016, ఆగస్టు 7
- లక్ష్యం: కృష్ణా, గోదావరి నదులతోపాటు ఇతర జలాశయాలను కలిపి 1,30,000 కిలోమీటర్ల పైపులైన్ల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా.

చేనేత లక్ష్మి

- ప్రారంభం: 2016, ఆగస్టు 7
- చేనేత కార్మికులను ఆదుకోవటం
- ప్రతినెల రూ.1000 చొప్పున 9 నెలలు చెల్లిస్తే రూ.14,400 విలువైన వస్త్రాలను తెలంగాణ చేనేత సహకార సంఘం షోరూంలలో కొనుగోలు చేయవచ్చు. (నాలుగు నెలలు చెల్లిస్తే రూ.5400 విలువగల వస్త్రాలు)

ఫైబర్ గ్రిడ్

- ఇంటింటికి ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించటం
- భారత్ నెట్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తుంది.
- రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, దవాఖానలు, బ్యాంకులు, ప్రజాసేవా సంస్థలకు అధికవేగంతో కూడిన ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించటం.

రైతుబంధు

- ప్రారంభం: 2018, మే 10
- **పెట్టుబడి సాయం:** ఏడాదికి రబీ, ఖరీఫ్ పంట కాలాలకు రూ.4000 చొప్పున ఏటా రూ.8000
- 2019 నుంచి ఏటా రూ.5000
- **లబ్ధిదారులు:** 58.34 లక్షలు

భూ కమతాలు రైతుల సంఖ్య

- 2 ఎకరాల లోపు 42 లక్షలు
- 2-5 ఎకరాలు 11 లక్షలు
- 5-10 ఎకరాలు 4.4 లక్షలు
- 10 ఎకరాల కంటే ఎక్కువ 94 వేలు
- 25 ఎకరాల కంటే ఎక్కువ 6488

తెలంగాణ పల్లె ప్రగతి

- ప్రారంభం: 2015 ఆగస్టు 23
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వర్గాలను రాబోయే ఐదేండ్లలో ఆర్థికంగా బలోపేతం చేయటం
- ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయం
- పల్లె ప్రగతి సేవా కేంద్రాల ఏర్పాటు
- బేస్‌లైన్ సర్వే ద్వారా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన 150 మండలాల గుర్తింపు

అమ్మ ఒడి/ కేసీఆర్ కిట్

- ప్రారంభం: 2017, జూన్ 3

అమ్మ ఒడి

- గర్భిణులకు చెకప్‌ల కోసం, ప్రసవానికి దవాఖానకు తరలించటం, ప్రసవం తర్వాత మళ్లీ తల్లీబిడ్డను ఇంటికి చేర్చటం

కేసీఆర్ కిట్

- ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను ప్రోత్సహించటం. గర్భిణులకు నాలుగు విడతల్లో రూ.12,000 ఆర్థిక సాయం (ఆడ శిశువు అయితే రూ.13,000)
- ప్రసవానంతరం రూ.2000 విలువ చేసే 16 వస్తువులతో కూడిన కిట్‌ను అందిస్తారు.

నూతనకంటి వెంకట్
జాయింట్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం

సుడోకు

డైలీ సుడోకు 77 సమాధానం

7	9	8	4	3	2	6	5	1
3	1	4	7	6	5	9	2	8
2	6	5	8	9	1	4	3	7
6	3	2	1	7	4	5	8	9
4	5	1	6	8	9	3	7	2
8	7	9	2	5	3	1	6	4
9	8	6	3	1	7	2	4	5
1	4	7	5	2	6	8	9	3
5	2	3	9	4	8	7	1	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -78

						8		9
			2				7	5
	9		5	3				2
		1	9					
8			7	4	2			1
					1	2		
2				8	5		6	
9	4				7			
3		8						

నమస్తే తెలంగాణ
నిపుణ
[కరీంనగర్]
సోమవారం 1 జూలై 2019

నీట్ కౌన్సెలింగ్

నీట్ కౌన్సెలింగ్ షురూ కానుంది. దీంతో రాష్ట్రంలో నీట్ రాసిన అభ్యర్థులు తమకు సీటు వస్తుందా రాదా అనే ఆతృతతో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు, కాలేజీలు తదితర వివరాలు అందిస్తున్నాం.

ప్రవేశ ప్రక్రియ

- నీట్ ర్యాంకులు వెలువడినాయి. కాబట్టి ఆ ర్యాంకుల్లో ఏ విధమైన తేడా ఉండదు. ఎందుకంటే దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీల్లోని వైద్యవిద్య సీట్లన్నింటినీ ఆ ర్యాంకుల ద్వారానే భర్తీచేస్తారు కాబట్టి. జాతీయ కోటాలో రెండు విడతలుగా ప్రవేశ ప్రక్రియ ఉంటుంది. జాతీయ స్థాయి కోటాలో మొదటి విడత పూర్తయ్యాక, రాష్ట్ర స్థాయి మొదటి విడత ప్రక్రియ ఉంటుంది. జాతీయ స్థాయి రెండో విడత తర్వాత రాష్ట్రస్థాయిలో రెండో విడత మొదలవుతుంది. జాతీయ స్థాయిలో రెండో విడత తర్వాత మిగిలిన సీట్లను రాష్ట్రాలకే ఇస్తారు. రాష్ట్రంలోనూ రెండు విడతలు పూర్తయిన తర్వాత కూడా సీట్లు మిగిలితే చివరిగా మాప్ అప్ చేపడుతారు.

కన్వీనర్ కోటాలో 2880 ఎంబీబీఎస్ సీట్లు

- తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద మొత్తం 2,880 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నేషనల్ పూల్‌కు 15 శాతం సీట్లు పోగా 1275, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 1275, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో 330 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 200 ఎంబీబీఎస్ సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఇవన్నీ కలిపితే 3080 ఎంబీబీఎస్ సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ కానున్నాయి. ప్రైవేటు, మైనారిటీల్లోని ఎంబీబీఎస్ సీట్లల్లో 50 శాతం కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్‌కు ఏడాది ఫీజు రూ.10 వేలు, ప్రైవేటు మెడికల్, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా ఫీజు రూ.60 వేలుగా ఉంది. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 50 పర్సంటైల్ 134 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీకి 40 పర్సంటైల్ 107 మార్కులు, దివ్యాంగులు 45 పర్సంటైల్ 120 మార్కులుగా కటాఫ్‌ను ఎంసీఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

తెలంగాణలో కాలేజీలు, సీట్లు

- రాష్ట్రంలో 48,996 మంది నీట్‌కు హాజరైతే వీరిలో 33,044 మంది విద్యార్థులు అర్హత సాధించారు.

ఎంబీబీఎస్ సీట్లు 4600

- రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2019-20 విద్యా సంవత్సరానికి 4,600 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,500 సీట్లు, 21 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 3,100 సీట్లు ఉన్నాయి. గతేడాది కంటే ఈసారి ఎంబీబీఎస్ సీట్లు ఏకంగా 1,000 పెరిగాయి.
- ప్రభుత్వంలోని అన్ని సీట్లు, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉన్న 1,500 సీట్లలో 15 శాతం అంటే 225 సీట్లు అఖిల భారత కోటా కింద కేంద్రం భర్తీ చేస్తుంది. వాటిలో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే తిరిగి వాటిని మన రాష్ట్రానికే ఇస్తారు. మరోవైపు కేంద్రం అగ్రవర్ణ పేదలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ రిజర్వేషన్ అమలు చేయాలంటే ప్రస్తుత రిజర్వేషన్లు దెబ్బతినకుండా ఉంచాలి. అందుకు 25 శాతం సీట్లు పెంచాలి. ఆ మేరకు ప్రస్తుత సీట్లకు అదనంగా 375 సీట్లు పెరగాల్సి ఉంటుంది. అవే పెరిగితే మొత్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో 1,875 సీట్లు అవుతాయి. వాస్తవంగా ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల పెంపుపై ప్రతిపాదనలు పంపాలని కేంద్రం రాష్ట్రాన్ని కోరింది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపే పనిలో వైద్యవిద్య డైరెక్టరేట్ ఉంది. ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలంటే నోటిఫికేషన్ విడుదలలోపు దీనిపై కేంద్రం ఓ నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే ఆ సీట్లు అందుబాటులోకి వస్తాయి. అందుకోసమే నోటిఫికేషన్‌ను కొంత ఆలస్యంగా జారీచేయాలని ఆరోగ్య విశ్వవిద్యాలయం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల వివరాలు

కాలేజీ పేరు	సీట్లు
1. ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్	250
2. గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	200
3. కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్	200
4. మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ	150
5. నల్లగొండ మెడికల్ కాలేజీ	150
6. నిజామాబాద్ మెడికల్ కాలేజీ	100
7. సిద్దిపేట మెడికల్ కాలేజీ	150
8. సూర్యాపేట మెడికల్ కాలేజీ	150
9. రాజీవ్‌గాంధీ కాలేజీ, ఆదిలాబాద్	100
10. ఈఎస్ఐ, హైదరాబాద్	50
మొత్తం	1,500

రాష్ట్రంలోని బీడీఎస్ కాలేజీలు

కాలేజీలు	సీట్లు	జాతీయ కోటా
గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, హైదరాబాద్	100	15
మల్లారెడ్డి డెంటల్ కాలేజ్ ఫర్ ఉమెన్స్, హైదరాబాద్	100	15
మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, హైదరాబాద్	100	15
పాణినీయ మహావిద్యాలయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, హైదరాబాద్	100	15
ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, సికింద్రాబాద్	40	6
బాలాజీ డెంటల్ కాలేజ్, మొయినాబాద్	100	15
కామినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, నార్కట్‌పల్లి	100	15
శ్రీసాయి కాలేజ్ ఆఫ్ డెంటల్ సర్జరీ, వికారాబాద్	100	15
ఎంఎస్ఆర్ డెంటల్ కాలేజ్, సంగారెడ్డి	100	15
మమత డెంటల్ కాలేజ్, ఖమ్మం	100	15
మేఘన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్, నిజామాబాద్	100	15
ఎస్‌వీఎస్ డెంటల్ కాలేజ్, మహబూబ్‌నగర్	100	15

తెలంగాణ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల వివరాలు

కాలేజీ పేరు	సీట్లు
1. అపోలో, హైదరాబాద్	100
2. అయాన్, రంగారెడ్డి జిల్లా	150
3. భాస్కర్ మెడికల్ కాలేజీ, ఎంకపల్లి	150
4. చల్మడ ఆనందరావు మెడికల్ కాలేజీ, కరీంనగర్	150
5. డెక్కన్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	150
6. పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, చేవెళ్ల	150
7. వీఆర్‌కే ఉమెన్స్ మెడికల్ కాలేజీ, అజీజ్‌నగర్	100
8. కామినేని అకాడమీ, హైదరాబాద్	150
9. కామినేని మెడికల్ కాలేజీ, నార్కట్‌పల్లి	200
10. మహావీర్ మెడికల్ కాలేజీ, వికారాబాద్	150
11. మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, హైదరాబాద్	150
12. మల్లారెడ్డి ఉమెన్స్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	150
13. మమత మెడికల్ కాలేజీ, బాచుపల్లి	150
14. మమత మెడికల్ కాలేజీ, ఖమ్మం	150
15. మెడిసిటీ మెడికల్ కాలేజీ, ఘన్‌పూర్	150
16. ఎంఎస్ఆర్ మెడికల్ కాలేజీ, సంగారెడ్డి	100
17. ప్రతిమ మెడికల్ కాలేజీ, కరీంనగర్	200
18. ఆర్వీఎం మెడికల్ కాలేజీ, మెదక్	150
19. షాదన్ మెడికల్ కాలేజీ, పటాన్‌చెరు	150
20. సురభి మెడికల్ కాలేజీ, సిద్దిపేట	150
21. ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, మహబూబ్‌నగర్	150
మొత్తం	3,100

ప్రత్యామ్నాయం బీడీఎస్

- ఎంబీబీఎస్ సీటు రానివారికి ముందుగా కనిపించే ప్రత్యామ్నాయ కోర్సు బీడీఎస్. దంతవ్యాధుల నుంచి సంరక్షణ, దంతాల ఎగుడుదిగుడుల సర్దుబాటు, కృత్రిమ దంతాలు, దంతాల అలంకరణ, పరిశుభ్రతపై అవగాహన పెరగడంతో డెంటిస్ట్‌లకు డిమాండ్ పెరిగింది. దీంతో ఈ కోర్సు చేసినవారికి కూడా అవకాశాలు బాగానే ఉన్నాయి.
- దీనిలోనూ పీజీ కోర్సు మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండీఎస్) కూడా చేయవచ్చు.
- పీరియోడెంటిక్స్, పెడోడెంటిక్స్, ప్రోస్థోడెంటిక్స్, ఆర్థోడెంటిక్స్, ఓరల్ సర్జరీ, పీడియాట్రిక్ డెంటిస్ట్రీ, కాస్మాటిక్ డెంటిస్ట్రీ వంటి స్పెషలైజేషన్లతో బీడీఎస్, ఎండీఎస్ చేయవచ్చు.
- దేశవ్యాప్తంగా దాదాపు 294 కాలేజీల్లో 23 వేలకుపైగా బీడీఎస్ సీట్లు ఉన్నాయి.
- మన రాష్ట్రంలో 12 కాలేజీల్లో బీడీఎస్ కోర్సు అందుబాటులో ఉంది. వీటిలో 1140 వరకు సీట్లు ఉన్నాయి.
- బీడీఎస్ లేదా ఎండీఎస్ చేసిన తర్వాత డాక్టర్‌గా సొంతంగా ప్రాక్టీస్ చేయవచ్చు. ఏదైనా హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్ లేదా హౌస్ స్టాఫ్‌గా, మెడికల్ కాలేజీల్లో క్లినికల్ అసిస్టెంట్ లేదా క్లినికల్ ట్యూటర్‌గా పనిచేయవచ్చు. ప్రభుత్వ హాస్పిటల్లోనైతే సర్జన్‌గా కెరీర్ ప్రారంభమవుతుంది.

స్థానికత

- 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నాలుగేండ్లు ఎక్కడ చదివితే ఆ రాష్ట్రానికే స్థానికత వర్తిస్తుంది. ఇందులో చివరి నాలుగేండ్లు అంటే 9, 10, 11, 12 తరగతులు వరుసగా ఎక్కడ చదివితే అక్కడే స్థానికం. ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో వేర్వేరు ప్రదేశాల్లో చదివితే ఎక్కువ ఏండ్లు ఎక్కడ చదవుతారో అదే స్థానికంగా చెల్లుతుంది. అంటే 6, 7, 8 ఇక్కడ చదివి, 9, 10 ఏపీలో చదివి, మళ్లీ 11, 12 ఇక్కడ చదివితే వారికి ఇక్కడి స్థానికత వర్తిస్తుంది. 6 నుంచి 12 వరకు ఒక్క ఏడాది తెలంగాణ, ఏపీల్లో కాకుండా వేరే రాష్ట్రాల్లో చదివితే అతనికి స్థానికత వర్తించదు.

...✍ సత్యం చాపల

నీట్ రెండో రౌండ్

- **రిజిస్ట్రేషన్/పేమెంట్, చాయిస్ ఫిల్లింగ్:** జూలై 6-8
- **చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్:** జూలై 9
- **సీట్ అలాట్‌మెంట్ ప్రక్రియ:** జూలై 10, 11
- **ఫలితాలు:** జూలై 12
- **రిపోర్టింగ్:** జూలై 13-22
- జూలై 9 మధ్యాహ్నం 12 గం. వరకు పేమెంట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.
- **రిపోర్ట్ చేయని, ఖాళీగా ఉన్న సీట్లు స్టేట్ కోటాకు బదిలీ:**
- జూలై 23, 2019 (ఆలిండియా కోటా 15 శాతం సీట్లు మాత్రమే)
- **సెంట్రల్/డీమ్డ్ యూనివర్సిటీలు/ఈఎస్ఐసీలకు సంబంధించి మాప్-అప్ రౌండ్:**
- **రిజిస్ట్రేషన్/పేమెంట్, చాయిస్ ఫిల్లింగ్:** ఆగస్టు 13-15
- **చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్:** ఆగస్టు 16
- **సీట్ అలాట్‌మెంట్ ప్రక్రియ:** ఆగస్టు 17
- **ఫలితాలు:** ఆగస్టు 18
- **రిపోర్టింగ్:** ఆగస్టు 20-26
- ఆగస్టు 16 మధ్యాహ్నం 2 గం. వరకు పేమెంట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.
- రిపోర్ట్ చేయని/ఖాళీగా ఉన్న సీట్లను డీమ్డ్‌సెంట్రల్ యూనివర్సిటీలు/ఈఎస్ఐ సీలకు బదిలీ: ఆగస్టు 27, 2019.

గ్రామీణ బ్యాంకులు- చక్కని కొలువులు

ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ సీడబ్ల్యూ ఈ VIII- 2019 తాజాగా 8,400 ఖాళీల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగం చేయాలని కోరుకునే ఉద్యోగార్థులకు ఇది చక్కటి అవకాశం. ఐబీపీఎస్ 2019 క్యాలెండర్ ప్రకారం మొదట ఆర్ఆర్‌బీ గ్రామీణ బ్యాంకుల నియామక ప్రక్రియ, తర్వాత ఐబీపీఎస్ పీవోస్, ఐబీపీఎస్ క్లర్క్స్ ఇలా ఇంకా నోటిఫికేషన్లు రావాల్సి ఉంది. కాబట్టి ఉద్యోగార్థులు ఈ నోటిఫికేషన్ కోసం మంచి ప్రణాళికలో ప్రిపేర్ అయితే వచ్చే ఆరు నెలల్లో బ్యాంకు ఉద్యోగం సాధించవచ్చు.

ఇలా ప్లాన్ చేసుకోండి

- బ్యాంకు పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారు ముందుగా పరీక్ష విధానం, సిలబస్ తదితర విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. సాధారణంగా చాలామంది విద్యార్థులు బ్యాంకు పరీక్షల్లో నెగ్గటం చాలా కష్టమని, బ్యాంకు ఉద్యోగం రావటమంటే అదృష్టం ఉండాలనే అపోహలో ఉంటారు. ఇంగ్లిష్ బాగా వచ్చినవారికే బ్యాంకు ఉద్యోగం వస్తుందని భ్రమ పడుతుంటారు. కానీ ఉద్యోగం సాధించటం కష్టం కావచ్చేమోకానీ అసాధ్యం కాదు. ఎందుకంటే బ్యాంకు పరీక్షల్లో మామూలుగా కొన్ని విభాగాల నుంచి ఒకే తరహా ప్రశ్నలు 5-6 వస్తుంటాయి. ఇలా ప్రతి విభాగం నుంచి 8-10 చాప్టర్లు ప్రిపేర్ అయితే ఎవరైనా బ్యాంకు ఉద్యోగం సాధించవచ్చు.

నాలుగు రకాల ఉద్యోగాలు

1. **ఆఫీస్ అసిస్టెంట్:** ఇది క్లర్క్ ఉద్యోగం. దీనికి అర్హత సాధారణ డిగ్రీ
2. **ఆఫీసర్ స్కేల్-1:** ఇది బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం. దీనికి కూడా సాధారణ డిగ్రీ అర్హత.
3. **ఆఫీసర్ స్కేల్-2:** ఇది బ్యాంకు మేనేజర్ పోస్టు. దీనికి విద్యార్హతలతోపాటు ఉద్యోగానుభవం తప్పనిసరి.
4. **ఆఫీసర్ స్కేల్-3:** ఇది బ్యాంకు సీనియర్ మేనేజర్ పోస్టు. దీనికి కూడా ఉద్యోగానుభవం ఉండాలి.

- డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఎవరైనా మొదటి రెండు పోస్టులకు అర్హులు. అందువల్ల క్లర్క్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల పరీక్ష విధానం, ప్రిపరేషన్ ప్లాన్ గురించి చర్చిద్దాం.

పరీక్ష విధానం

- క్లర్క్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు వేర్వేరుగా పరీక్ష నిర్వహణ ఉంటుంది. కానీ పరీక్ష విధానం, సిలబస్ రెండింటికీ ఒకటే. అభ్యర్థి రెండు పోస్టులకు ఉమ్మడిగా ప్రిపేరైతే ప్రయోజనకరంగా ఉంటుంది. అభ్యర్థి జీవనశైలిని బట్టి ఈ పరీక్షల ప్రిపరేషన్‌కు కచ్చితమైన ప్రణాళికను రూపొందించుకోవాలి.
- ఈ పరీక్షలు ప్రిలిమినరీ, మెయిన్స్ అనే రెండు స్థాయిల్లో ఉంటాయి. రెండు స్థాయిల్లోనూ ఆబ్జెక్టివ్ విధానంలోనే ప్రశ్నపత్రం ఉంటుంది. అయితే, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు మాత్రం మూడో స్టేజీగా ఇంటర్వ్యూ ఉంటుంది.

ప్రిలిమినరీ పరీక్ష విధానం

- ప్రిలిమినరీ పరీక్ష కేవలం అర్హత పరీక్ష. ఇందులో ఉత్తీర్ణత సాధించినవారు మెయిన్స్ రాసేందుకు అర్హులు.
- ప్రిలిమినరీ 80 మార్కులకు 80 ప్రశ్నలతో ఉంటుంది. ఇందులో 40 మార్కులకు రీజనింగ్ ఎబిలిటీ, మరో 40 మార్కులకు న్యూమరికల్ ఎబిలిటీ ఉంటుంది. పరీక్ష కాలవ్యవధి కేవలం 45 నిమిషాలు. ఈ దశలో పరీక్ష పేపర్‌లో ఇంగ్లిష్ లేకపోవటం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఊరట నిచ్చే అంశం.

నోట్: ప్రిలిమినరీ పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి నాలుగోవంతు మార్కులు కోత విధిస్తారు.

మెయిన్స్ పరీక్ష విధానం

- ఇది ప్రధాన పరీక్ష. ఈ దశలో పరీక్ష పేపర్ 200 మార్కులకు 200 ప్రశ్నలతో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో సాధించిన మార్కులే అభ్యర్థి ఉద్యోగం సాధించటానికి చాలా కీలకం. అందువల్ల ఈ పరీక్షపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. మెయిన్ పేపర్లో ఐదు విభాగాలు ఉంటాయి.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	సమయం
1. రీజనింగ్	40	50	రెండు గంటలు
2. కంప్యూటర్ నాలెడ్జ్	40	20	
3. జనరల్ అవేర్‌నెస్	40	40	
4. ఇంగ్లిష్ లాంగ్వేజీ	40	40	
5. న్యూమరికల్ ఎబిలిటీ	40	50	
	200	200	

- ఈ దశలో కూడా నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి నాలుగోవంతు మార్కులు కోత విధిస్తారు. ఈ విభాగంలోని జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ సబ్జెక్టులు ఎక్కువ మార్కులు పొందడానికి ఉపయోగపడుతాయి. మెయిన్‌లో ప్రశ్నల కఠినస్థాయి ఎక్కువగా ఉంటుంది. విద్యార్థుల సమయపాలన, విషయ పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు.

ఇంటర్వ్యూ

- పీవో పోస్టులకు ఇంటర్వ్యూ ఉంటుంది. మెయిన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ ఇంటర్వ్యూ ఈ ఏడాది నవంబర్- డిసెంబర్‌లలో ఉండవచ్చు. ఇందులో ముఖ్యంగా అభ్యర్థికి గ్రామీణ ప్రాంతాలపై ఉన్న అవగాహన, బ్యాంకు సేవల లక్ష్యం తదితర అంశాలను పరీక్షిస్తారు.

ఇలా చదవండి

- సాధారణంగా ఏ బ్యాంకు పరీక్షలకైనా మొత్తం ఐదు విభాగాలు ఉంటాయి. అవన్నీ మెయిన్‌లో అడుగుతారు. కానీ ప్రాథమిక పరీక్షలో మూడు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి. ఐబీపీఎస్ గ్రామీణ బ్యాంకు పరీక్షలో మాత్రం మొదటి భాగం ప్రిలిమినరీలో రెండే విభాగాలు ఉన్నాయి. అవి రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ లేదా క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్. ఈ రెండు కూడా క్లర్క్, ఆఫీసర్-1లో కామన్‌గా ఉన్నాయి. కాబట్టి ఈ పోస్టులకు ఉమ్మడిగా ప్రిపేరైతే సరిపోతుంది.
- ప్రిలిమినరీ పరీక్ష ఆగస్టు 3 నుంచి 25 వరకు ప్రతి ఆదివారం ఉంటుంది. ఇంకా ప్రిలిమినరీకి నెల సమయం ఉంది. ఇప్పటి నుంచి సిలబస్ ప్రకారం, ప్రీవియస్ ప్రశ్నలను తిరగేసి వెంటనే ప్రిపరేషన్ ప్రారంభించాలి. మెయిన్ పరీక్ష సెప్టెంబర్ 22, 29 తేదీల్లో ఉంటుంది. దీనికి కావల్సినంత సమయం ఉంది కాబట్టి ఓ ప్రణాళికతో ప్రిపేరైతే గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగం మీ సొంతం అవుతుంది.

న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

- ఈ విభాగం రెండు దశల్లో ఉంటుంది. ప్రిలిమ్స్‌లో ప్రాథమిక స్థాయి ప్రశ్నలు, మెయిన్‌లో కొంచెం ఎక్కువస్థాయి ప్రశ్నలు ఇస్తారు. వీటిలో కామన్ చాప్టర్లపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ప్రతి రోజు కనీసం 4-5 గంటల సమయం ప్రాక్టీస్‌కు కేటాయించాలి. అదేవిధంగా చాప్టర్ల వారీగా 30 నిమిషాల ఆన్‌లైన్ టెస్ట్‌ను రాయాలి. ఇలా చేయడంవల్ల పరీక్షలో మీకు తేలిక పాటి ప్రశ్నలు తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సంపాదించే ప్రశ్నలు గుర్తించడం సులభతరం అవుతుంది.
- న్యూమరికల్ ఎబిలిటీస్ నుంచి 4-5 ప్రశ్నలు వచ్చే చాప్టర్లు నంబర్ సిస్టమ్స్ (క్యాలిక్యులేషన్ పార్ట్), అప్రాక్షిమేషన్స్, నంబర్ సీరిస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ వంటివి తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. డాటా ఇంటర్‌ప్రిటేషన్ (డీఐ) నుంచి 10-15 ప్రశ్నలు వస్తాయి. డీఐను తప్పకుండా సాల్వ్ చేయాలి. ఇవి కామన్ టాపిక్స్ అయిన శాతాలు, నిష్పత్తులు, సరాసరి-లాభనష్టాలు, కాలం-పని, చక్రవడ్డీ, బారువడ్డీ నుంచి 25-30 ప్రశ్నలు వస్తుంటాయి. ఎక్కువ మార్కులు పొందడానికి ఇవి కీలకం. విద్యార్థులు ముందుగా ఎక్కువ ప్రశ్నలు వచ్చే సెక్షన్లపై పట్టుసాధించాలి. క్రమం తప్పకుండా ప్రణాళిక ప్రకారం సాధన చేయాలి.

రీజనింగ్

- ప్రిలిమినరీ, మెయిన్‌లో 40+40 = 80 ప్రశ్నలు వస్తాయి. బ్యాంకు రీజనింగ్‌లో బేసిక్ అంశాలతో పాటు, క్రిటికల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్ కూడా ఎక్కువగా వస్తుంటాయి. ఈ విభాగం స్కోర్ పెంచుకునేందుకు ఉపయోగపడుతుంది. ఇందులో పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ నుంచి 10-15 ప్రశ్నలు వస్తుంటాయి. లెటర్ సిరీస్, వర్డ్ సిరీస్, సిలాజిసమ్, ఇన్‌పుట్-అవుట్‌పుట్‌ల నుంచి 4-5 ప్రశ్నలు వస్తుంటాయి. 25-30 మార్కుల కోసం కేవలం ఐదారు చాప్టర్లను ప్రాక్టీస్ చేస్తే సరిపోతుంది. ఈ సెక్షన్ నుంచి కోడింగ్-డీకోడింగ్, సిరీస్, ర్యాంకింగ్, బ్లడ్‌రిలేషన్స్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్ ఆధారిత ప్రశ్నలపై పట్టు సాధించాలి.
- రీజనింగ్ సబ్జెక్టులో స్పీడ్ పెంచాలంటే ఇంగ్లిష్‌పై కూడా పట్టు సాధించాలి. పజిల్స్, క్వశ్చన్-స్టేట్‌మెంట్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి వాటిని స్నేహితులతో కలిసి ప్రిపేరవడం వలన సులభంగా ప్రాక్టీస్ పూర్తవుతుంది.

ఇంగ్లిష్

- ఈ విభాగం కేవలం మెయిన్‌లో మాత్రమే వచ్చే అంశం. ఇంగ్లిష్ నుంచి 40 ప్రశ్నలు, 40 మార్కులు కేటాయించారు. ఇంగ్లిష్‌లో కామన్ టాపిక్‌లో ఎక్కువ వెయిటేజీ ఉన్న అంశాలనే ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యంగా జంబుల్డ్ సెంటెన్స్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, వొకాబులరీ, ప్రిపోజిషన్స్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్ వంటివి ప్రాక్టీస్ చేస్తే 15-20 మార్కులు సాధించే అవకాశం ఉంది. ఇంగ్లిష్ కఠినం అనుకునే విద్యార్థులు గ్రామర్-నాన్ గ్రామర్ పార్టులను వేర్వేరుగా ప్రిపేర్ కావాలి. అంటే గ్రామర్‌లో మెళకువలు నేర్చుకుంటే సెంటెన్స్ కరెక్షన్స్, ప్రిపోజిషన్స్ వంటివి చేయవచ్చు.
- ఇంగ్లిష్ కష్టం అనే అపోహ వదిలేయండి. ముందుగా సిలబస్, ప్రీవియస్ పేపర్స్ బాగా చదవండి. వీటితోపాటు ఎక్కువ మార్కుల కోసం న్యూస్ పేపర్స్, ఇంగ్లిష్ మ్యాగజైన్లు, ఇంగ్లిష్ వార్తలను ఫాలో కావాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

- ఇది పూర్తిగా బేసిక్స్‌తోపాటు మనం రోజువారీ కార్యకలాపాలకు ఉపయోగించే యాప్స్, ఇంటర్నెట్ పోర్టళ్లు, మొబైల్ బ్యాంకింగ్ సేవలు, బ్యాంకు యాప్‌లు వంటివి కీలకం.
- ఇందులో మంచి మార్కులు పొందడానికి కంప్యూటర్ ఫండమెంటల్స్, ఇన్‌పుట్-అవుట్‌పుట్ లేటెస్ట్ డివైజెస్, కంప్యూటర్ లాంగ్వేజెస్, అప్లికేషన్స్ వివిధ రకాల వైరస్‌లు, ఏటీఎం, నెట్ వర్కింగ్, టచ్‌స్క్రీన్ వంటి అంశాలు చదివితే సరిపోతుంది. దీనికోసం పూర్వప్రశ్నలపై అధ్యయనం చేసి మోడల్ ప్రశ్నలను తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయండి.

జనరల్ అవేర్‌నెస్

- జనరల్ అవేర్‌నెస్ విత్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్. ఈ విభాగం నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, స్టాక్ మార్కెట్, ఆర్థిక బడ్జెట్, ఆర్థిక సర్వే, కేంద్ర ప్రభుత్వ పథకాలు వంటివి ముఖ్యమైనవి. వాణిజ్య రంగంతో ముడిపడిన కరెంట్ అఫైర్స్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- ఇందులో బ్యాంకింగ్ రంగంలో మార్పులు, బ్యాంకుల విలీనం, బ్యాంకు కమిటీలు, ఆర్‌బీఐ, మానిటరీ పాలసీ రివ్యూ, ద్రవ్యపరపతి విధానం నూతన కీ పాలసీ రేట్లు, పేమెంట్స్ బ్యాంకింగ్, బ్యాంక్ యాప్‌లు వంటివి చదవాలి. వీటితోపాటు వాణిజ్య రంగంలో ఆర్థిక కమిటీలు, పేదరికం, ద్రవ్యోల్బణం, నీతి ఆయోగ్ నివేదికలు, 15వ ఆర్థిక సంఘం అంశాలను చదవాలి.
- గత ఆరు నెలల కరెంట్ అఫైర్స్ తప్పకుండా చదవాలి. ఇందులో వ్యక్తులు, జాతీయ, అంతర్జాతీయ అంశాలు, క్రీడలు, రక్షణ రంగం, రచయితలు, అవార్డులు ముఖ్యమైన తేదీలు చదవాలి.

S. Madhukiran
Director
Focus Academy,Dilsukhnagar
90304 96929

శర్వానంద్‌పై క్లాప్‌నిస్తున్న సుకుమార్

శర్వానంద్ 'శ్రీకారం' చుట్టారు

సినిమాల జోరు పెంచుతున్నారు హీరో శర్వానంద్. రెండు చిత్రాలు సెట్స్‌పై ఉండగానే తాజాగా మరో సినిమాను మొదలుపెట్టారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'శ్రీకారం' చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సినిమాతో కిషోర్‌రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 14 రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. శర్వానంద్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు సుకుమార్ క్లాప్‌నివ్వగా, ఎన్నారై శశికాంత్ వల్లూరి కెమెరా స్విచాన్ చేశారు. రచయిత సాయిమాధవ్‌బుర్రా స్క్రిప్ట్‌ను అందించారు. 'విభిన్నమైన కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. శర్వానంద్ పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. ఆగస్టు మొదటివారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, సినిమాటోగ్రఫీ: యువరాజ్, కళా దర్శకత్వం: అవినాష్, సంభాషణలు: సాయి మాధవ్‌బుర్రా, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం:కిషోర్‌రెడ్డి.

సి.కల్యాణ్

నిర్మాతల మండలి అధ్యక్షుడిగా సి.కల్యాణ్

ఆదివారం జరిగిన తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఎన్నికల్లో సి.కల్యాణ్ ఘన విజయం సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నిర్మాతల మండలి అధ్యక్ష పదవికిగాను మొత్తం 477 ఓట్లకు సి.కల్యాణ్ 378 ఓట్లు సాధించగా, ప్రత్యర్థిగా పోటీ చేసిన ప్రతాని రామకృష్ణగౌడ్‌కు 95 ఓట్లు వచ్చాయి. వైస్ ప్రెసిడెంట్స్‌గా వైవీఎస్ చౌదరి (360 ఓట్లు), కె. అశోక్‌కుమార్ (317 ఓట్లు) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సి.కల్యాణ్ మాట్లాడుతూ 'ఎన్నికలు, పోటీ లేకుండా రెండుగా విడిపోయిన నిర్మాతల మండలిని ఏకం చేయాలనే ఆలోచనతో పెద్దలతో చర్చించిన తర్వాత అందరం ఒకేమాట మీద ఉంటూ మన ప్యానల్ తరపున పోటీ చేశాం. ఎల్ఎల్‌పీ, గిల్డ్‌లు లేకుండా నిర్మాతల మండలి ఒకటిగా ఉండాలి. అందరూ ప్రొడ్యూసర్ కౌన్సిల్‌దారిలోనే నడవాలి.అందుకోసం మేము ఏం చేయడానికైనా, ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నాం. ఎలాంటి విభేదాలు లేకుండా ఒకటిగా పనిచేస్తాం. ఎన్నికలు పూర్తవగానే మీ వెనుక నేనున్నానంటూ చిరంజీవి మమ్మల్ని అభినందించారు. మంచి పనులు చేయమని సూచించారు. ఆయనతో పాటు పెద్దల సహకారంతో నిర్మాతలకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం. అవసరమైతే పదవులు త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. రెండో కుంపటి వద్దనే నినాదంతో పనిచేస్తాం. నిర్మాతల మండలి ద్వారానే అన్ని కార్యక్రమాలు జరగాలి' అని తెలిపారు.

సమంత

వెంకటేష్, సమంత, రానా

ఆ మాట కోసం కష్టపడ్డాను

'వైవిధ్యతతో కూడిన ప్రయోగాత్మక సినిమా ఇది. బేబీ పాత్రలో సమంత అద్భుతమైన అభినయాన్ని కనబరిచింది. తన కెరీర్‌లో మైలురాయిలాంటి సినిమా అవుతుంది' అని అన్నారు సీనియర్ హీరో వెంకటేష్. సమంత, లక్ష్మి, నాగశౌర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓ బేబీ'. బి.వి. నందినిరెడ్డి దర్శకురాలు. సురేష్‌బాబు, సునీత తాటి, టి.జి.విశ్వప్రసాద్, హ్యున్ హూ థామస్ కిన్ నిర్మిస్తున్నారు. ఈ నెల 5న విడుదలకానుంది. శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రానా మాట్లాడుతూ ''ఓ బేబీ' లాంటి సినిమాలు ప్రతివారం రావాలి. కుటుంబమంతా కలిసి చూసే మంచి సినిమా ఇది' అని చెప్పారు. సమంత మాట్లాడుతూ 'కథానాయిక ప్రధాన సినిమా చేయడం ఇండస్ట్రీలో చాలా కష్టం. నిర్మాతలు నన్ను నమ్మి ఈ సినిమా చేశారు. నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా ఇది. ఈ కథను మేము ఎంచుకోవడం కంటే కథే మమ్మల్ని సెలెక్ట్ చేసుకుందని నమ్ముతున్నాను. ప్రతి రోజు సంతోషంతో పాటు కొత్త ఛాలెంజ్‌ను ఇచ్చింది. దర్శకురాలు నందినిరెడ్డిని వందశాతం నమ్మి నటించాను. రామానాయుడు కుటుంబం నుంచి తొలిసారి ఓ అమ్మాయి వస్తుంది అని సురేష్‌బాబు చెప్పిన మాటలు విన్నప్పుడు చాలా సంతోషం కలిగింది. ఆయన అన్న మాట కోసం చాలా కష్టపడి ఈ సినిమా చేశాను' అని తెలిపింది. 'గ్లామర్‌తో పాటు నటన తెలిస్తే హీరోయిన్‌లు అయిపోరు. మంచి పాత్రలు దక్కాలి. సమంత విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నది. సినిమాలో క్లిష్టమైన సన్నివేశాల్ని నందినిరెడ్డి అర్థవంతంగా, అద్భుతంగా తెరకెక్కించింది' అని సీనియర్ దర్శకుడు రాఘవేంద్రరావు చెప్పారు. 'అహనా పెళ్లంట' తర్వాత సురేష్ ప్రొడక్షన్స్‌లో తాను నటించిన సినిమా ఇదని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీప్రసన్న, సునీతతాటి, తేజ పాల్గొన్నారు.

'అమ్మ ఓ సార్వజనీనమైన మధురభావన. ప్రతి ఒక్కరికి అమ్మతో అపూర్వమైన అనుబంధం ఉంటుంది. అలాంటి తల్లి ప్రేమలోని గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ అందరికి కనెక్ట్ అయ్యే కథ ఇది' అన్నారు నందిని రెడ్డి. ఆమె దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఓ బేబీ'. సమంత కథానాయిక. ఈ నెల 5న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నందినిరెడ్డి పాత్రికేయులతో ముచ్చటించింది. ఆమె చెప్పిన సంగతులివి...

కట్ చెప్పడం మర్చిపోయేదాన్ని!

కొరియన్ చిత్రం 'మిస్‌గ్రానీ'ని రీమేక్‌గా ఎంచుకోవడానికి కారణమేమిటి?

• నాకు, సమంతకు ఈ కథ ఎంతగానో నచ్చింది. ప్రతి ఒక్కరి హృదయాల్లో అమ్మకు ఉన్నతమైన స్థానం ఉంటుంది. అమ్మ అంటే సార్వజనీనమైన గొప్ప భావోద్వేగం. అందుకే ఈ కథ మనలో అందరికి కనెక్ట్ అవుతుందనిపించింది. సమంత బాడీలాంగ్వేజ్‌కు పక్కాగా సరిపోయే కథ ఇది. ఆమె అయితేనే ఈ పాత్రకు న్యాయం చేయగలదనిపించింది.


నందినిరెడ్డి

తెలుగు నేటివిటీ తగినట్లుగా స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేశారు?

• కొరియన్ స్క్రిప్ట్‌లో నలభైశాతం వరకు మార్పులు చేశాం. మెయిన్ పాయింట్‌ను యథాతథంగా తీసుకున్నాం. మదర్‌సెంటిమెంట్ తాలూకు ఉద్వేగాల్ని ఏమాత్రం మిస్ చేయకుండా స్క్రిప్ట్ రూపకల్పన విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాం.

తల్లి పాత్రలో సీనియర్ నటి లక్ష్మిని ఎంచుకోవాలనే ఆలోచన ఎవరిది?

• ఈ పాత్రలో లక్ష్మిని తప్ప మరొకరిని ఊహించుకోలేక పోయాం. ప్రేమ, ఆప్యాయత, వినోదం, వెటకారం..ఇలా భిన్న వైరుధ్యాలున్న భావాల్ని పలికించే పాత్రలో లక్ష్మి కనిపిస్తుంది. అద్భుతాభినయంతో ఆమె తన పాత్రకు పూర్తిగా న్యాయం చేసింది.

'కల్యాణవైభోగమే' తర్వాత చాలా గ్యాప్ తీసుకున్నారెందుకని?

• స్క్రిప్ట్ రాసుకున్న తర్వాత ఒక్కోసారి అది నచ్చక మార్పులు చేస్తుంటాను. ఈ క్రమంలో కథ కుదరడం ఆలస్యమవుతుంది. అందుకే నా సినిమాలకు చాలా గ్యాప్ వచ్చింది. ప్రస్తుతం మంచి రచయితలతో టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నాను. భవిష్యత్తులో వేగంగా సినిమాలు చేయాలనుకుంటున్నాను.

'ఓ బేబీ' చిత్రంలో చాలా మంది సీనియర్స్ నటించడం వల్ల మేకింగ్ చాలా సులభం అయిందంటున్నారు?

• ఓ చక్కటి విందుభోజనంలా ఈ సినిమాకు సీనియర్ నటీనటులు కుదిరారు. అందుకే ఎలాంటి టెన్షన్స్ లేకుండా షూటింగ్ జరిగిపోయింది. కొన్ని సన్నివేశాల చిత్రీకరణలో ఒక్కోసారి కట్ చెప్పడం కూడా మర్చిపోయేదాన్ని(నవ్వుతూ). ప్రతి ఆర్టిస్టు అంకితభావంతో ఈ సినిమా కోసం శ్రమించారు.

ఈ సినిమా విషయంలో సమంత ఎలాంటి సహకారాన్ని అందించారు?

• సమంత నాకు ఎంతో సన్నిహితురాలు. ఈ సినిమా నిర్మాణ విషయంలో సురేష్‌బాబుగారితో పాటు సమంత కూడా బాధ్యతలు తీసుకున్నారు. సమంత, నాకు మధ్య ఎలాంటి ఈగో సమస్యలు లేవు. ఇద్దరి విజన్ ఒకటే కావడంతో సినిమా అద్భుతంగా వచ్చింది.

మీరు ఎక్కువగా రొమాంటిక్, కామెడీ నేపథ్య సినిమాలే చేస్తున్నారు. ఒకే పంథాకు పరిమితమైపోతున్నారని అనిపించడం లేదా?

• అలాంటిదేమి లేదు. వీలైతే రేపు యాక్షన్ సినిమా కూడా తీయొచ్చు (నవ్వుతూ). ఒకే జోనర్‌కు పరిమితమైపోవాలని అనుకోవడం లేదు. క్రీడానేపథ్యంలో సినిమా చేయాలని ఉంది. అలాగే యాక్షన్ సబ్జెక్ట్‌ను కూడా తెరకెక్కించాలనుకుంటున్నాను. ఎలాంటి సినిమా చేసినా దర్శకురాలిగా నా సెన్సిబిలిటీస్ మాత్రం ఎక్కడా మిస్ చేయను.

భవిష్యత్తులో పెద్ద హీరోలతో సినిమాలు చేసే ఆలోచన ఉందా?

• ఇండస్ట్రీలో నాకు చాలా మంది పెద్ద హీరోలతో పరిచయాలున్నాయి. మహేష్ బాబు, అల్లు అర్జున్ మంచి ఫ్రెండ్స్. వారికి సరిపోయే కథ సెట్ అయితే పెద్ద హీరోలతో కూడా సినిమాలు చేస్తాను.

మీరు ఆ మధ్య ఓ వెబ్‌సిరీస్‌ను కూడా రూపొందించారు. ఆ అనుభవాలేమిటి?

• సినిమా కుటుంబమందరికి చేరువయ్యే వినోద సాధనం. వెబ్‌సిరీస్‌లు అలా కాదు. వ్యక్తిగత అభిరుచులను బట్టి వెబ్‌సిరీస్‌లు చూస్తుంటారు. అందుకే వెబ్‌లో ఎక్కువగా బోల్డ్ , రియలిస్టిక్ కంటెంట్‌తో సినిమాలు వస్తుంటాయి. తెలుగు వెబ్ ప్రేక్షకుల్ని అర్థం చేసుకోవడానికి మరింత సమయం అవసరమని నా అభిప్రాయం. భవిష్యత్తులో వెబ్‌సిరీస్‌ల వల్ల సినిమా మార్కెట్‌కు కొంత మేర నష్టం జరుగుతుందనుకుంటున్నాను.

తదుపరి సినిమా గురించి?

• వైజయంతీ మూవీస్‌లో ఓ సినిమా చేయబోతున్నాను. రెండు కథలు ఓకే అయ్యాయి. అందులో ఒకదాన్ని ఎంచుకొని సినిమా చేస్తాను.

సందీప్‌కిషన్, అన్యాసింగ్

హిట్ కొట్టాలనే తపనతో..

'నా కెరీర్‌లో బెస్ట్ ఫిలిం ఇది. గర్వంతో ఈ మాట చెబుతున్నాను. ఎలాగైన హిట్టు కొట్టాలనే తపనతో ఈ సినిమా చేశాం' అని అన్నారు సందీప్‌కిషన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నిను వీడని నీడను నేనే'. దయాపన్నెం, వీజీ సుబ్రహ్మణ్యన్‌లతో కలిసి సందీప్‌కిషన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కార్తిక్ రాజు దర్శకుడు. అనిల్ సుంకర విడుదలచేస్తున్నారు. అన్యాసింగ్ కథానాయిక. ఈ నెల 12న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో నిర్మాతలు అనిల్‌సుంకర, జెమిని కిరణ్ విడుదలచేశారు. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'నన్ను నేను పెద్ద స్క్రీన్ మీద చూసుకొని రెండేళ్లయింది. సినిమా తప్ప వేరే ఏదీ తెలియని నా లాంటి వాడికి విరామం నరకంగా ఉంటుంది. గతంలో నేను నటించిన కొన్ని సినిమాలు విడుదలైనప్పుడు వాటి గురించి ప్రేక్షకులు చెప్పే మాటలు విని తట్టుకోలేననే భయంతో థియేటర్లకు వెళ్లలేకపోయాను. ఇక్కడ నుంచి వెళ్లిపోతే నా ఆలోచన ధోరణి మారిపోతుందని దేశం వదిలి పోరిపోయాను. తిరిగి వచ్చేసరికి లావైపోయాను. బరువు తగ్గి సరైన కథను ఎంచుకొని మళ్లీ సినిమా చేద్దామని అనుకున్నాను. ఆ సమయంలో మా మేనేజర్ నాకు బాగా కావాల్సిన ఇండస్ట్రీలోని పెద్ద వ్యక్తిని కలిశారు. మాటల సందర్భంలో నా ప్రస్తావన వచ్చినప్పుడు సందీప్ పనైపోయిందని ఆ పెద్ద మనిషి అన్నారు. ఆయన అన్న మాటల నుంచి స్ఫూర్తి పొంది కసితో ఈ సినిమా చేశాను. ఒకవేళ సినిమాలు మానేయాల్సిన పరిస్థితి వస్తే ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాతో ఇండస్ట్రీ నుంచి వెళ్లాలి తప్పితే రెగ్యులర్ చిత్రంతో వెళ్లిపోయాడనే మాట రాకూడదు. ఇన్నాళ్లు నేను పడిన కష్టానికి కన్న కలలకు అది న్యాయం చేయదు. ఇండస్ట్రీలో ఇన్నాళ్లు సంపాదించినదంతా ఈ సినిమాలోనే పెట్టాను' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ ప్రధానంగా సాగే ఎమోషనల్ చిత్రమిది. రెగ్యులర్ హారర్ సినిమాలకు భిన్నంగా ఉంటుంది. తమన్ నేపథ్య సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని చెప్పారు.

ప్రశాంత్‌వర్మ

'అ!' చిత్రం ద్వారా సృజనశీలియైన దర్శకుడిగా విమర్శకుల ప్రశంసలందుకున్నారు ప్రశాంత్‌వర్మ. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. ఆయన ద్వితీయ ప్రయత్నంగా రాజశేఖర్ కథానాయకుడిగా రూపొందించిన చిత్రం 'కల్కి' ఇటీవలే ప్రేక్షకులముందు కొచ్చింది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రశాంత్‌వర్మ పాత్రికేయులతో ముచ్చటించారు.

క్లైమాక్స్ తర్వాతే కథ రాస్తాను!

స్క్రిప్ట్ రాసే సమయంలో నేను ముందు క్లైమాక్స్ ఘట్టాన్ని రాసుకుంటాను. ఆ తర్వాతే మిగిలిన కథ రాయడం ఆరంభిస్తాను. అది నా శైలి. గమ్యం ముందుగానే తెలిసిపోతే దానిని చేరుకునే అనేక మార్గాల్ని అన్వేషించవొచ్చు. 'కల్కి' సినిమా విషయంలో కూడా ముందుగా క్లైమాక్స్ ఎపిసోడ్ రాసుకున్నాను. క్లైమాక్స్ కోసం దాదాపు 16 వెర్షన్స్ రాశాను. తర్వాతే మిగతా కథకు రూపకల్పన చేశాను. అయితే ఎప్పటికీ ఇదే పంథాను అనుసరిస్తానని చెప్పలేను. నా తర్వాతి సినిమా ఇంటర్వెల్ బ్యాంగ్ హైలైట్‌గా ఉండొచ్చు. క్లైమాక్స్ ఆ స్థాయిలో ఉండకపోవచ్చు. స్క్రిప్ట్‌ను అనుసరించి స్క్రీన్‌ప్లే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాను.

ప్రతి ఒక్కరికీ భయం ఉంటుంది...

'అ!' సినిమాకు మంచి ప్రశంసలు లభించాయి. ఆ సినిమా తర్వాత పెద్ద హీరోలతో సినిమా చేసే అవకాశాలు వచ్చాయని చాలా మంది అనుకున్నారు. అయితే ప్రతి హీరోకి ఓ ఇమేజ్ ఉంటుంది. దానికి సంతుష్టి పరిచే విధంగా సినిమా చేయాల్సి ఉంటుంది. ఒకవేళ దర్శకుడు సరిగ్గా డీల్ చేయలేకపోతే తమ ఇమేజ్ ఏమౌతుందో అనే సంశయం ఉంటుంది. హీరోల భయాల్ని మనం కాదనలేం. అందుకే పెద్ద హీరోలతో సినిమాలు చేయలేదు. అగ్రహీరోలతో కూడా సినిమా చేయగలనని నిరూపించుకోవడానికి 'కల్కి' సినిమా చేశాను.

బీ, సీ సెంటర్లలో అద్భుతమైన రెస్పాన్స్..

'కల్కి' చిత్రానికి బీ, సీ సెంటర్లరలో అద్భుతమైన స్పందన లభిస్తున్నది. మాస్ ప్రేక్షకులకు సినిమా బాగా రీచ్ అవుతున్నది. ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో సంధ్య థియేటర్‌లో ప్రేక్షకుల స్పందన చూసి చాలా సంతోషమనిపించింది. రాజశేఖర్ నటన అందరిని అకట్టుకుంటున్నది. సినిమాలో 'ఏం చెప్తిరి చెప్తిరి' అనే డైలాగ్‌ను రాజశేఖర్‌తో చర్చించే పెట్టాం. ఆయనకు కూడా చాలా సరదాగా ఆ సన్నివేశంలో నటించారు. ఈ సినిమాకు ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణుల టీమ్ కుదిరింది. పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగుందని అంటున్నారు.

'కేజీఎఫ్' ప్రభావం ఉంది..

'కల్కి' సినిమాలో కొన్ని సన్నివేశాల్ని కన్నడ చిత్రం కేజీఎఫ్ స్ఫూర్తితో రూపకల్పన చేశాను. హీరోయిజమ్ ఎలివేషన్ తాలూకు సీన్స్‌ను ఆ సినిమా ప్రభావంతో తెరకెక్కించాను. ఈ సినిమాలో ఐటెం సాంగ్‌ను పెట్టాం. స్వతహాగా నాకు ప్రత్యేక గీతాలు ఇష్టం ఉండవు. కానీ ఈ సినిమాకు అది అవసరం అనిపించింది.

నా మార్క్ వదిలిపెట్టను..

నా దర్శకత్వ శైలి మీద చాలా మంది హాలీవుడ్ దర్శకుల ప్రభావం ఉంది. దర్శకుడిగా అన్ని జోనర్ సినిమాలు చేసి మెప్పించాలనుకుంటున్నాను. ఏ కథ తీసుకున్నా నాదైన మార్క్‌ను వదిలిపెట్టను.

'అ!' సినిమా సక్సెస్ అయినా..

నా తొలి చిత్రం 'అ!' మంచి వసూళ్లను సాధించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత ఆ సక్సెస్ గురించి సరిగ్గా ప్రచారం చేయలేదు. సక్సెస్‌మీట్‌ను కూడా నిర్వహించలేదు. నా తదుపరి సినిమా ఏమిటో ఇంకా ఖరారు కాలేదు. ప్రస్తుతం రెండు కథల్ని సిద్ధం చేసుకున్నాను. వాటిలో ఏది కార్యరూపం దాల్చుతుందో వేచిచూడాలి.

కెమిస్ట్రీ బాగుంటుంది..

తెలుగు చిత్రసీమలో మలయాళ ముద్దుగుమ్మల సంఖ్య ఎక్కువే. నయనతార, నిత్యామీనన్, అనుపమ పరమేశ్వరన్‌తో పాటు పలువురు మలయాళీ ముద్దుగుమ్మలు చక్కటి అభినయం, అందచందాలతో ఆకట్టుకున్నారు. తాజాగా 'గుణ 369'తో మరో మలయాళీ సొగసరి అనఘ టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నది. కార్తికేయ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాతలు మాట్లాడుతూ 'తమిళ చిత్రం 'నట్పేతునై'లో అనఘ అద్భుతంగా నటించింది. ఈ సినిమాలో అభినయానికి ఆస్కారం ఉన్న పాత్రలో చక్కగా నటించింది. గ్లామర్ విషయంలో రాజీపడలేదు. స్వతహాగా సంప్రదాయ నృత్యకారిణి కావడంతో డ్యాన్సుల్లో ప్రతిభను చాటుకున్నది. కార్తికేయతో ఆమె కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరింది. నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని తెలిపారు. కథాబలంతో కూడిన సినిమాలు తెలుగులో రావడం లేదనే వారికి సమాధానం చెప్పేలా ఈసినిమా ఉంటుందని, టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్, కెమెరామెన్: రామ్.

అనఘ